




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 21.02.2024 | సంపుటి : 10 సంచిక : 222 | పేజీలు : 12 వెల: రూ. 4/-

Follow :

RNI NO.APTEL / 2013 /50370








తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




పరువు నష్టం కేసులో

## రాహుల్‌కు ఊరట

**అమిత్‌షాపై వ్యాఖ్యల కేసులో బెయిల్**


**లక్నో(జనంసాక్షి):** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆరేళ్ల క్రితం

మిగతా 2లో..

## ఇకపై రెండు సార్లు బోర్డు పరీక్షలు

**2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు**

**టెన్త్, ఇంటర్ పరీక్షలపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పదో తరగతి, ఇంటర్ బోర్డు పరీక్షలకు విద్యార్థులు రెండు సార్లు హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. 2025-26

మిగతా 2లో..

దక్షిణ భాగం

# రీజనల్ రింగ్‌రోడ్డుకు కేంద్రం పచ్చజెండా

**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ భేటీ • పలు అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చ**



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర విషయాలపై చర్చిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అధికారులు

- రాష్ట్రానికి సంబంధించి పెండింగ్ పనులపై వివరణ
- కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై వినతి
- భువనగిరి రహదారి, సిర్పూర్-కాగజ్‌నగర్ జాతీయ రహదారి, శ్రీశైలం ప్రాజెక్టు వద్ద తీగల వంతెనను మరోచోటికి మార్పుపై చర్చ
- కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, హర్దీప్ పూరీ, అశ్వినీ వైష్ణవ్‌తోనూ సమావేశం కానున్న ముఖ్యమంత్రి బృందం

**హైదరాబాద్(జనంసాక్షి):** దిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్ల నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులపై గడ్కరీతో సీఎం చర్చించనున్నట్లు తెలుస్తోంది.రేవంత్ రెడ్డి వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్ల అభివృద్ధితోపాటు, అంతర్జాతీయ సంస్థల నుంచి రావాల్సిన నిధుల గురించి చర్చించినట్లు తెలుస్తోంది. వీటితోపాటు భువనగిరి రహదారి, సిర్పూర్-కాగజ్‌నగర్ జాతీయ రహదారి, శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన తీగల వంతెనను మరోచోటికి మార్పు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరనున్నట్లు సమాచారం.కాగా కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టడంపై రేవంత్ ప్రభుత్వం ప్రధానంగా దృష్టిసారించింది. బకాయిలు సహా వివిధ రూపాల్లో వచ్చే గ్రాంట్‌లను పొందేలా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులను కలిసి ప్రత్యేక విజ్ఞాపన చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అవసరాలపై కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నారు.కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టిసారించింది. బకాయిలు సహా వివిధ రూపాల్లో వచ్చే నిధులను పొందేలా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులను కలిసి ప్రత్యేక విజ్ఞాపన చేయనున్నా రు.ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం నిధుల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టుకునేలా కసరత్తు చేస్తోంది. బడ్జెట్ రూపకల్పన సమయంలోనే సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఈ విషయంపై స్పష్టమైన

మిగతా 2లో..

## ఎంపీ ఎన్నికలకు మోగనున్న నగారా




మార్చి 9 తర్వాత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్

ఈసీ కసరత్తు

**దిల్లీ(జనంసాక్షి):** సార్వత్రిక ఎన్నికల తేదీలపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది.లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఈసీ గత కొన్ని రోజులుగా రాష్ట్రాల్లో వరుస పర్యటనలు చేస్తున్న విషయం తెలిసిందే. రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. మార్చి 9వ తేదీ తర్వాత ఈసీ ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.దేశవ్యాప్తంగా లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటితో పాటు జమ్మూకశ్మీర్‌లోనూ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని ఈసీ భావిస్తోంది.



## నేడు వనజాతర

దారులన్నీ మేడారం వైపే.. • భారీగా తరలివస్తున్న భక్తులు

నాలుగురోజులపాటు జాతర • భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

పూనుగొండ్ల పగిడిద్దరాజు గుడిలో ప్రత్యేక పూజలు

2లో

## కేంద్రానికి కర్షకుల డెడ్‌లైన్

**నేటిలోగా కేంద్రం స్పందించాలి • లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం**

**అప్పటివరకు ఏం జరిగినా కేంద్రానిదే బాధ్యత • స్పష్టంచేసిన రైతుసంఘనాయకులు**

**రైతుల కోసం ఎమ్ఎస్‌పీకి చట్టపరమైన హామీ ఇవ్వాల్సిందే: రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వానికి రైతులు డెడ్‌లైన్ విధించారు. బుధవారం ఉదయం 11 గంటల వరకు ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే 'దిల్లీ చలో' కార్యక్రమం యాథావిధిగా కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ క్రమంలో ఏం జరిగినా దానికి కేంద్రం బాధ్యత వహించాలని తేల్చిచెప్పారు.కనీస మద్దతు ధరపై కేంద్ర ప్రతిపాదనలను తిరస్కరించిన రైతులు, ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించారు. బుధవారం ఉదయం 11గంటల లోగా, ప్రభుత్వం స్పందించకపోతే తాము తలపెట్టిన 'దిల్లీ చలో' కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తేల్చిచెప్పారు. గడువు ముగిసిన తర్వాత దిల్లీ వైపు తమ ప్రయాణం కొనసాగిస్తామని రైతు నాయకులు ఓ ప్రకటనలో వెల్లడించారు.బుధవారం తలపెట్టిన దిల్లీ చలో కార్యక్రమంపై రైతు నాయకుడు సర్వాన్ సింగ్ పంధేర్ మాట్లాడారు. 'మమ్మల్ని

మిగతా 2లో..





## ఐఐటీ హైదరాబాద్ జాతికి అంకితం

**ఐఐఎం,ఐఐటీ,ఐషర్ భవనాలు ప్రారంభం**

**జమ్మూ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ**

**జమ్ము(జనంసాక్షి):** దేశంలోని 20 కొత్త కేంద్రీయ విద్యాలయాలు, 13 కొత్త నవోదయ విద్యాలయ భవనాలను ప్రధాని మోదీ ప్రారంభించారు. జమ్ము కశ్మీర్ నుంచి ఇలాంటి కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), తిరుపతి జిల్లాలో నెలకొల్పిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఐసర్ ప్రాంగణాలను ప్రధాని మోదీ జమ్మూ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్

మిగతా 2లో..

## చండీగఢ్ మేయర్ ఎన్నిక చెల్లదు

**సుప్రీంలో బీజేపీకి చెంపదెబ్బ • ఆప్ అభ్యర్థిని విజేతగా ప్రకటించిన ధర్మాసనం**


**రిటర్నింగ్ అధికారి తీరుపై ఆగ్రహం • బీజేపీ బండారం బయటపడింది: ఆప్**




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** చండీగఢ్ మేయర్ ఎన్నిక చెల్లదంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఈ మేరకు చండీగఢ్ మేయర్ ఎన్నిక ఫలితాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆప్ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేసేందుకు ఉద్దేశపూర్వంగా వ్యవహరించారని స్పష్టంగా తెలుస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆ ఎన్నికలో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు.. ఆ ఎన్నిక చెల్లుబాటు కాదని వ్యాఖ్యానించింది. రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్ వ్యవహరించిన తీరుపై తీవ్రంగా స్పందించింది. జనవరి 30న నిర్వహించిన చండీగఢ్ మేయర్ ఎన్నికలో తగినంత సంఖ్యా బలం(16) లేకపోయినా భాజపా మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్ అనూహ్య విజయం సాధించారు. మెజారిటీకి అవసరమైన కౌన్సిలర్ల బలం(20) ఉన్నప్పటికీ ఆప్- కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కుల్దీప్ కుమార్ ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో పట్టపగలే మోసం జరిగిందని దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఎన్నికల అధికారి బ్యాలెట్ పత్రాలపై పెన్నుతో ఏదో రాసి.. వాటిలో కొన్నింటిని చెల్లకుండా చేశారని కాంగ్రెస్, ఆప్‌లు ఆరోపించాయి. ఆప్ కౌన్సిలర్ వేసిన పిటిషన్‌ను విచారించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కొట్టివేత గుర్తు పెట్టిన బ్యాలెట్ పేపర్లను పరిశీలించింది. 'ఈ బ్యాలెట్ పత్రాలు పాడైపోయినవని మీరు చెప్పారు. అది ఎక్కడో చూపించగలరా..?' అంటూ మసీహ్‌ను ప్రశ్నించింది. 'అవి ఆప్ అభ్యర్థి పేరిట వచ్చాయి. వీడియోలో కనిపిస్తున్నట్లు వాటిపై ఈ అధికారి గీత

మిగతా 2లో..

## రాజ్యసభకు సోనియా, నడ్డా ఎన్నిక





**పెద్దల సభలో అడుగు పెట్టనున్న సోనియా**

**పలు రాష్ట్రాల్లో అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నికలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రాజ్యసభఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా సోనియాగాంధీ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నడ్డా గుజరాత్ నుంచి రాజ్యసభకు మంగళవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు గుజరాత్ రాష్ట్రం నుంచి బీజేపీ అభ్యర్థులుగా రాజ్యసభ రేసులో ఉన్న గోవింద్ ధోలకియా, డాక్టర్ జస్వంత్‌సిన్హ్ సలామ్‌సిన్హ్ పార్మార్, మయాంక్ నాయక్ సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నడ్డాతో సహా గెలుచిన నలుగురు బీజేపీ అభ్యర్థులల్లో ధోలకియా

మిగతా 10లో..

### తెలంగాణలో మూడు రాజ్యసభ సీట్లు ఏకగ్రీవం

రేణుకాచౌదరి,అనిల్, వద్దిరాజుల ఎన్నిక

వార్త 2లో

## మరాఠా రిజర్వేషన్ బిల్లుకు 'మహా' అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం



**ముంబయి(జనంసాక్షి):** మరాఠా రిజర్వేషన్ల బిల్లుకు మహారాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మంగళవారం ఈమేరకు ప్రత్యేకంగా సమావేశమైంది. అంతకుముందు మంత్రివర్గం దీనికి ఆమోద ముద్ర వేసింది. దీనిద్వారా మరాఠా సామాజిక వర్గానికి స్థానికంగా విద్య, ఉద్యోగాల్లో

మిగతా 2లో..

కరీంనగర్‌లో | కొత్తపల్లిలో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణ

## భూకబ్జాకోరులపై కొరడా..

- కొత్తపల్లిలో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణ
- మాజీ మంత్రి గంగుల కమలాకర్ అనుచరుడు అరెస్ట్
- 9 మందిపై కేసు.. రిమాండ్

కరీంనగర్‌లో భూకబ్జాకోరులపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. అక్రమ వ్యవహారాల్లో తలదూర్చడమేగాక అందుకు సహకరించినవారిని ఒక్కొక్కరిని వేటాడుతున్నారు. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన అవినీతి కార్యకలాపాలను బయటపెడుతూ వాటి వెనుకున్న వారిని కటకటాల్లోకి నెడుతున్నారు. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ 'హంటింగ్' అక్రమార్కులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుండగా.. తాజా మరో కేసు చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రికి అన్నీ తానై వ్యవహరించిన వ్యక్తి సహా 9 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వారికి సంబంధించిన సమగ్ర వివరాలపై ఆరా తీస్తున్నారు.



మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రధాన అనుచరుడు నందెల్లి మహిపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):** మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రధాన అనుచరుడు, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన నందెల్లి మహిపాల్ ఎన్నో వ్యవహారాల్లో కీలకంగా ఉన్నట్టు తెలిసిందే. రియల్ ఎస్టేట్, ఇసుక మాఫియా, ఇతర సెటిల్మెంట్ల విషయంలో మాజీ మంత్రి ఆదేశాల మేరకు జోక్యం చేసుకునేవాడు. ప్రభుత్వ పెద్ద ప్రోద్బలంతో ఎంతోమందిని బెదిరింపులకు గురిచేశాడు. తాము చెప్పినట్టు వినకపోతే

మిగతా 2లో..

## హామీలు అమలు చేయాల్సిందే


**షాద్‌నగర్ బీఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు**



**షాద్‌నగర్(జనంసాక్షి):** కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని గ్యారెంటీలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాల్సిందేనని మాజీ మంత్రి హరీశ్ డిమాండ్ చేశారు. ఒక్క రోజు కూడా జై తెలంగాణ అనని వ్యక్తి, ఒక్కరోజు కూడా అమరుల స్థూపం వద్ద పువ్వు పెట్టని రేవంత్ రెడ్డి ఈరోజు తెలంగాణ సీఎం కావడం బాధాకరం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గతంలో ఉద్యమకారుల మీదికి తుపాకీ పట్టుకొని పోయిన వ్యక్తిని ఈరోజు అసెంబ్లీలో సీఎం కుర్చీలో చూస్తే చాలా బాధగా ఉందన్నారు. షాద్ నగర్

మిగతా 10లో..

## ఇండియా కూటమిలో సీట్లపంపకంపై త్వరలో క్లారిటీ



**దిల్లీ(జనంసాక్షి):** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇండియా కూటమిలో సీట్ల పంపకాల అంశం ఇంకా ఎటూ తేలలేదు. తాజాగా ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది.కూటమిలోని ఇతర పార్టీలతో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్నాయని.. ఏ సమయంలోనైనా ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. సీట్ల పంపకాలకు సంబంధించిన ప్రక్రియ ఇంకా కొనసాగుతోందన్నారు. ఇప్పటికే తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కూటమిలోని పార్టీలతో కమిటీని కూడా నియమించిన విషయాన్ని ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఉత్తరప్రదేశ్‌లో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో

మిగతా 10లో..

# కేంద్రానికి కర్షకుల డెడ్‌లైన్

ఎట్టిపరిస్థితుల్లోనూ దిల్లీలో అడుగుపెట్టనివ్వకూడదన్నది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. రైతులతో చర్చల ద్వారా పరిష్కారం కావాలనుకుంటే దిల్లీ వైపు వెళ్లేందుకు అనుమతించాలి. మేము దిల్లీ వైపు వెళ్లినప్పుడు కాల్పులు జరిగాయి. ట్రాక్టర్ల టైర్లకు కూడా బుల్లెట్లు తగిలాయి. రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఇలాంటి వాటిని ప్రయోగించే వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం. అంతేకాకుండా తప్పుడు ప్రకటనలు కూడా చేస్తున్నారు. ప్రస్తుతం హరియాణా పరిస్థితి కశ్మీర్?లా తయారయ్యింది. మేము అసలు డిమాండ్ల నుంచి వెనక్కు తగ్గేలా కేంద్రం ప్రతిపాదనలు చేసింది. ఇప్పుడు ఏం జరిగినా దానికి కేంద్రమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.' అని హెచ్చరించారు. 5 పంటలకు కాంట్రాక్టు కుదుర్చుకుంటామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని నిపుణులు అంటున్నారని పంధేర్? తెలిపారు. దీని ద్వారా ఇప్పటికే సాగు చేస్తున్న రైతులు ఆ కాంట్రాక్టు పరిధిలోకి రారని, అంతేకాకుండా కేంద్రం ఐదేళ్ల కాలపరిమితి పెట్టడం సరికాదన్నారు. సరైన చట్టం లేకపోవడం వల్ల దోపిడీ జరుగుతోందన్న పంధేర్ ఎమ్ఎస్‌పీ చట్టం ద్వారా దీన్ని నియంత్రించవచ్చని తెలిపారు. కానీ కార్పొరేట్ శక్తులు దీనికి అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. అంతకాకుండా రైతుల అంశంపై తమ వైఖరిని స్పష్టం చేయాలని అన్ని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు సర్వాన్ సింగ్ పంధేర్. తాజాగా చేసిన ప్రతిపాదనల వల్ల కేంద్రం అసలు రంగు బయటపడిందని అన్నారు. కనీస మద్దతు ధరపై చట్టం తెస్తే, ప్రభుత్వం దిగుమతులపై చేసే ఖర్చు కంటే తక్కువ ధరకే పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయొచ్చని నిపుణులు చెబుతున్నారని అన్నారు.'నరేంద్ర మోదీ బలమైన ప్రధాని అని బీజేపీ చెబుతోంది. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరిస్తే, మోదీ బలమైన ప్రధాని అని రైతులు కూడా అంగీకరిస్తారు.' అని సర్వాన్ సింగ్ పంధేర్ వివరించారు. కనీస మద్దతు ధర-ఎమ్ఎస్‌పీకి చట్టపరమైన హామీని ఇవ్వగలిగితే అది రైతులను దేశ స్థూల జాతీయోత్పత్తి- జీడీపీ వృద్ధికి చోదకులుగా మారుస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. అంతేగానీ ఈ హామీని అమలు చేయడం వల్ల బడ్జెట్‌పై భారం పడదని చెప్పారు. ప్రభుత్వ బడ్జెట్‌లో ఎమ్ఎస్‌పీ హామీని అమలు చేయడం సాధ్యం కాదని కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు చేశారు. క్రిసిల్ ప్రకారం 2022-23లో రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వడం వల్ల రూ.21 వేల కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉందని అది మొత్తం బడ్జెట్‌లో 0.4 శాతం మాత్రమే అని రాహుల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. గతంలో 14 లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మాఫీ, 1.8 లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ పన్ను మినహాయింపు ఈ దేశంలో జరిగిందని గుర్తు చేశారు. రైతుల కోసం కొంచెం ఖర్చు చేయడానికి కేంద్రం ఎందుకు ఇబ్బంది పడుతోందని రాహుల్ ప్రశ్నించారు.

# ఇకపై రెండు సార్లు బోర్డు పరీక్షలు

విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బోర్డు పరీక్షలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2020లో తీసుకొచ్చిన కొత్త జాతీయ విద్యా విధానంలో విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించడం ఒకటని, ఈ క్రమంలో విద్యార్థులు రెండుసార్లు బోర్డు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరం నుంచి రెండుసార్లు 10, ఇంటర్ విద్యార్థులు బోర్డు పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. గత ఏడాది ఆగస్టులో విద్యా మంత్రిత్వ శాఖ ప్రకటించిన కొత్త కరికులం ఫ్రేమ్‌వర్క్ ప్రకారం.. విద్యార్థులు మంచి పనితీరు కనబరిచేందుకు తగినంత సమయం ఇవ్వడానికి బోర్డు పరీక్షలు సంవత్సరానికి కనీసం రెండుసార్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా ఉంచడం, నాణ్యమైన విద్యతో వారిని సంపన్నం చేయడం, విద్యార్థులను సంస్కృతితో అనుసంధానం చేయడం, భవిష్యత్తు కోసం వారిని సిద్ధం చేయడం జాతీయ విద్యా విధానం ఉద్దేశమన్నారు. ఇదిలా ఉండగా.. దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ మాతృభాషలో చదుకునేందుకు అవకాశం కల్పించాలని నిర్ణయించిన కేంద్రం రాబోయే మూడేళ్లలో అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలను ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఈ మేరకు ట్రాన్స్‌లేషన్ చేయాలని ఎన్‌సీఈఆర్‌టీ, యూజీసీ, ఏఐసీటీఈ, ఇగ్నో, జాతీయ సార్వత్రిక విద్యా పీఠం (ఔఎక్షా)తోపాటు కేంద్రీయ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, సెంట్రల్ వర్సిటీలను విద్యాశాఖ ఆదేశించింది. మాతృభాషలో చదువుకోవడాన్ని ప్రోత్సహించాలని జాతీయ నూతన విద్యా విధానం-2020 సిఫారసు చేసిన విషయం తెలిసిందే. బీటెక్ కోర్సులనూ ప్రాంతీయ భాషల్లో బోధనకు ఏఐసీటీఈ దేశవ్యాప్తంగా అనుమతి ఇస్తుండగా.. మధ్యప్రదేశ్‌లో ఎంబీబీఎస్ కోర్సు హిందీ మాధ్యమంలో ఇప్పటికే ప్రారంభమైంది. పీఎంశ్రీ పథకంపై కేంద్రమంత్రి మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లోని 211 పాఠశాలలను హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అప్‌గ్రేడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కోదానికి రూ.2కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. 2036 ఒలింపిక్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇస్తుందని, నాలుగేళ్లలో జరిగే ఈ ఈవెంట్‌లో దేశానికి 10శాతం పతకాలు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అ÷-లథెట్ల నుంచే రావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం రాష్ట్రంలోని క్రీడాకారులు ఈ ఏడాది నుంచే సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

నాటి ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా యూపీలోనే ఉన్న రాహుల్ కేసు విచారణ నిమిత్తం మంగళవారం కోర్టు ఎదుట హాజరయ్యారు. 2018 మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన రాహుల్.. కేంద్రమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. నాడు బెంగళూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయాల్లో స్వచ్ఛంగా, నిజాయతీగా ఉంటామని చెప్పే భాజపా. ఓ హత్య కేసులో నిందితుడిని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుందని ఆరోపించారు. ఆ సమయంలో అమిత్ షా.. భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలోనే యూపీకి చెందిన భాజపా నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టులో రాహుల్‌పై ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో పలుమార్లు న్యాయస్థానం ఆయనకు సమన్లు జారీ చేయగా రాహుల్ స్పందించలేదు. తాజాగా విచారణకు హాజరవ్వగా.. కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కర్ణాటక ఎన్నికల సందర్భంగా బెంగళూరులో హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో విజయ్ మిశ్రా అనే వ్యక్తి సుల్తాన్‌పూర్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ కేసులో సుల్తాన్ పూర్ లోని జిల్లా సివిల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. మంగళవారం ఈకేసు విచారణకు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం భారత్ జోడ్ న్యాయ్ యాత్రలో పాల్గొనేందుకు అమేథికి వెళ్లారు రాహుల్ గాంధీ.కాంగ్రెస్ కంచుకోట అమేథీని తిరిగి వశం చేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అంతేకాదు భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా పార్టీలో వచ్చే లోక్ సభ ఎన్నికల వరకు బలోపేతం చేసేందుకు కృషి చేస్తోంది.

# ఎంపీ ఎన్నికలకు మోగనున్న నగారా

ఇందుకోసం మార్చి 8-9 తేదీల్లో కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఈ బృందం సమావేశం కానున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు, బలగాలపై అందులో చర్చించనున్నారు. ఆ తర్వాత మార్చి 12-13 తేదీల్లో ఈసీ బృందం జమ్మూకశ్మీర్‌లో పర్యటించి క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పరిశీలించనుంది. లోక్‌సభతో పాటే స్థానిక అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలపై ఒక అంచనాకు రానున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మార్చి రెండోవారంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకు ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు.

# దక్షిణ భాగం రీజనల్ రింగ్‌రోడ్డుకు కేంద్రం పచ్చజెండా

మార్గదర్శకాలు జారీ చేశారు. కేంద్రం నుంచి ప్రత్యేకంగా కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర వాటా కేటాయించి, విడుదల చేయడం ఎప్పటికప్పుడు యూసీలు సమర్పించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ లో ప్రతిపాదనలు రూపొందించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్ల రూపంలో రూ.21 వేల కోట్లకు పైగా వస్తాయని తెలంగాణ ప్రభుత్వం అంచనా. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిక పథకాల కింద కనీసం రూ.19 వేల కోట్లు రాబట్టుకోవాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రధానిని కలిసిన రేవంత్ రెడ్డి పలు విజ్ఞప్తులు చేశారు. ఆ వెంటనే కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి రూ.600 కోట్లు వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అదే తరహాలో పెండింగ్ నిధులను కేంద్రం నుంచి పొందడంపై సర్కార్ దృష్టి సారించింది. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి బకాయిలు ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.1800 కోట్లు రావాల్సి ఉండగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి మరో రూ.450 కోట్లు కలిపితే రూ.2250 కోట్లు అవుతాయి. వాటన్నింటిపై దిల్లీలో కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చర్చించే అవకాశముంది. అందుకే వీరితో పాటు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు దిల్లీ వెళ్లారు. వీటితో పాటు ఇతర అంశాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. గత ప్రభుత్వం ఎక్కువ వడ్డీకి తీసుకున్న రుణాలకీ తక్కువ వడ్డీ భారం పడేలా సాఫ్ట్‌లోన్లుగా మార్చడం, రైతు రుణమాఫీకోసం కార్పొరేషన్ ఏర్పాటు సహా ఇతర అంశాలను కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, హర్దీప్ పూరీ, అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం సమావేశం కానుంది.కాగా సోమవారం దిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి బృందం కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు రణదీప్‌సింగ్‌సుర్జేవాలా కుమారుడు ఆదిత్య వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీ హాజరయ్యారు.

# నేడు వనజాతర

**మహబూబాబాద్(జనంసాక్షి):** సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. వనదేవరుడు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును, ఆయన తనయుడు జంపన్నను మంగళవారం మేడారం తీసుకెళ్లేందుకు పూజారులు ఏర్పాట్లు చేశారు. గిరిజన సంప్రదాయాలు, శివసత్తుల పూనకాల మధ్య మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని దేవాలయం నుంచి పగిడిద్దరాజును, ములుగు జిల్లా కన్నెపల్లి నుంచి జంపన్నను మేడారం తీసుకెళ్లనున్నారు. బుధవారం నాడు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దె పైకి తీసుకురానున్న నేపథ్యంలో... అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మవార్లకు తులాభరంతో బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా వడిబియ్యం, చీర, సారెతో పూజలు చేశారు. భక్తులు పూనకాలతో పరవశిస్తు అమ్మవార్ల దీవెనల కోసం గద్దెల వద్దకు చేరుకుంటున్నారు మేడారం జనసందోహంతో ఆధ్యాత్మిక భక్తి భావనతో పులకించి పోతోంది. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజు గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. పగిడిద్దరాజును తీసుకుని కోయ పూజారులు అటవీ మార్గంలో కాలినడకన మేడారంకు బయలుదేరి వెళ్లనున్నారు. రాత్రికి పగిడిద్దరాజు మేడారంకు రానున్నారు. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క - సారలమ్మ మేడారం జాతర ఈనెల 21 నుంచి నాలుగు రోజుల పాటు ఘనంగా జరుగనుంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకోసారి జరుగుతుంది. జాతరకు ఒకరోజు ముందే పగిడిద్దరాజును మేడారంకు తీసుకువస్తారు. అనంతరం సారలమ్మ, గోవిందరాజును గద్దెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 22న సమ్మక్క దేవతను గద్దెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 23న భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఫిబ్రవరి 24న దేవతల వనప్రవేశం ఉండగా... ఫిబ్రవరి 28వ జాతర పూజలు ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.మంగళవారం ఉదయం పూనుగొండ్ల సమీపంలోని దేవుడి గుట్ట నుంచి పగిడిద్దరాజును తీసుకొచ్చి దేవాలయంలో ప్రతిష్ఠిస్తారు. శాంతి పూజా కార్యక్రమాల అనంతరం పెన్క వంశీయులు పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా సిద్ధం చేసారు. ఆ పడగ రూపాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం పూనుగొండ్ల అడవుల నుంచి మేడారానికి కాలినడకన తీసుకెళ్లే కార్యక్రమం మొదలు పెట్టారు. పూజారులు, పలువురు భక్తులు పగడిద్దరాజు వెంట బయలు దేరుతారు. మధ్యలో గోవిందరావుపేట మండలం కర్లపల్లి లక్ష్మీపురం లోని పెన్క వంశీయుల వద్ద మంగళవారం రాత్రి విడిది కల్పిస్తారు. బుధవారం ఉదయాన్నే బయలుదేరి రాత్రి సారలమ్మ చేరుకునే సమయానికి పగిడిద్దరాజును మేడారం గద్దెకు చేరుస్తామని ప్రధాన పూజారులు చెప్పారు.

# మరాఠా రిజర్వేషన్ బిల్లుకు 'మహా' అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

10 శాతం రిజర్వేషన్ లభించనుంది. ఇది చట్టరూపం దాల్చి, అమలులోకి వచ్చిన పదేళ్ల తర్వాత మరోసారి సమీక్షిస్తారు. రాష్ట్ర జనాభాలో 28 శాతం మంది ఈ వర్గానికి చెందినవారు ఉన్నారని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే తెలిపారు. జనవరి- ఫిబ్రవరి నెలల్లో 'మహారాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్' విస్తృత సర్వే చేపట్టి.. దాదాపు 2.5 కోట్ల మరాఠా కుటుంబాలకు సంబంధించిన వివరాలు సేకరించింది. విద్య, సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంపై సమగ్ర నివేదికను ఇటీవల సమర్పించింది. 84 శాతం మరాఠా కుటుంబాలు వెనుకబడి ఉన్నట్లు అందులో తేలింది. రాష్ట్ర సగటు 17.4 శాతంతో పోలిస్తే.. ఈ వర్గంలో 21.22 శాతం కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు వెల్లడైంది. దీంతో వారిని రిజర్వేషన్లకు అర్హులుగా పరిగణించినట్లు బిల్లులో పేర్కొన్నారు."మాకు వద్దనుకున్నది రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. 10 శాతం లేదా 20 శాతం రిజర్వేషన్లు ఇచ్చినా ఫర్వాలేదు. కానీ, ఓబీసీ కేటగిరీ కిందే ఇవ్వాలి. విడిగా కాదు" అని మరాఠా రిజర్వేషన్ల కోటా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే స్పందించారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలంటూ మరాఠా వర్గానికి చెందిన నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే.

# కరీంనగర్‌లో భూకబ్జాకోరులపై కొరడా

పలువురిని ఎగదోసి ఘర్షణలకు దిగేవారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ పోలీసులు ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకుని కొందరు బాధితులు సీపీ అభిషేక్ మహంతిని ఆశ్రయించారు. తమకు జరిగిన అన్యాయాలను వివరించడంతో వాటన్నింటినీ ప్రత్యేక టీంతో క్షుణ్ణంగా పరిశీలించి మాజీ మంత్రి అనుచరుడు నందెల్లి మహిపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. మంత్రి అనుచరుడి వ్యవహారాలు, పైరవీలు, భూ తగాదాలు, ఇతర వ్యాపారాలపై పోలీసులు ఆరా తీస్తు న్నట్టు తెలిసింది. ఇప్పటికే బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులను కటకటాల్లోకి నెట్టిన పోలీసులు మహిపాల్‌ను కూడా జైలుకు పంపడంతో సర్వత్రా హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఘటన దరిమిలా మాజీ మంత్రితో సన్నిహితంగా ఉండి వ్యాపారాలు కొనసాగించినవారు గప్‌చుప్‌గా ఉండిపోతున్నారు.

**భూ ఆక్రమణ నేపథ్యమిదీ...**

కరీంనగర్‌లోని కొత్తపల్లికి చెందిన 15 గుంటల స్థలానికి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి అక్రమంగా భూ ఆక్రమణకు పాల్పడ్డందుకు చిట్యాల కిష్టమ్మ, గుండ రాజమల్లు, నందలి మహిపాల్,గంగాధర కనకయ్య, నక్క జితేందర్, నక్క పద్మ, తాటిపాముల రాజు, కొత్తకొండ శ్రీను.. మైకల్ శ్రీను, చిల్ల శ్రీనివాస్ (మాజీ కొత్తపల్లి ఎమ్మార్వో)లపై కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎర్రం కనకారెడ్డి తండ్రి భూంరెడ్డి ఫిర్యాదు మేరకు 9 మందిపై 467,468,471,420, 386, 506, 120బి, ఆర్/డబ్ల్యు 34 కింద కేసు నమోదు చేశారు. అయితే, కనకారెడ్డి 2008లో సర్వేనెంబర్ 776, 777, 778 లో 15 గుంటల స్థలాన్ని చిట్యాల కిష్టమ్మ నుండి కొనుగోలు చేశారు.(ఏ1)చిట్యాల కిష్టమ్మ, (ఏ4)గంగాధర కనకయ్యతో కలిసి కనకారెడ్డి భూమిని కాజేయాలని నకిలీ సేల్ అగ్రిమెంట్ డీడ్‌ను (ఏ2) గుండ రాజమల్లు పేరిట సృష్టించారు. ఈ నకిలీ సేల్ అగ్రిమెంట్ డీడ్ ధ్రువపత్రం ఆధారంగా ముందుగా కనకారెడ్డి పేరిట ఉన్న ఒరిజినల్ అగ్రిమెంట్ సేల్ డీడ్ ధ్రువపత్రాన్ని అధికార బలంతో రద్దు చేయించారు. ఆ భూమిని (ఏ2) గుండ రాజమల్లు పేరిట రిజిస్టర్ డిడ్ బియరింగ్ నెంబర్ (4637/2016) ద్వారా రిజిస్ట్రేషన్ కాబడిందన్నారు. ఆ భూమిని తదుపరి (ఏ2) గుండ రాజమల్లు, (ఏ5) నక్క జితేందర్, (ఏ6) నక్క పద్మలకు అమ్మగా తరువాత వారి నుండి అదేభూమిలో కొంతభాగం (ఏ6) నక్క పద్మ తిరిగి (ఏ7) తాటిపాముల రాజు, (ఏ8) కొత్తకొండ శ్రీను అమ్మే ప్రయత్నం చేసిందన్నారు. బాధితుడు న్యాయంకోసం కోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేసినందున, నందెల్లి మహిపాల్ అనే వ్యక్తి బాధితుడిని పిలిపించి, పిటిషన్ వాపసు తీసుకోవాలని బెదిరించారు. ఈ పూర్తి సమస్య పరిష్కరించేందుకు నాలుగు గుంటల ల్యాండ్‌ను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. నిందితులంతా కలిసి కుమ్మక్కై (ఏ9) చిల్ల శ్రీనివాస్‌ను కలిసి (మాజీ కొత్తపల్లి ఎమ్మార్వో) అతని సహకారంతో ఈ భూవివాదం పరిష్కార కోసం కోర్టులో పెండింగులో ఉన్నప్పటికీ, నిందితుల పేరిట మ్యుటేషన్ కూడా చేశాడన్నారు. కేసులో నిందితుడు నందెల్లి మహిపాల్‌ను కోర్టులో హాజరుపరచగా కేసు పూర్వపరాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. కరీంనగర్ రూరల్ పోలీసులు నిందితుడిని జైలుకు తరలించారు.

# తెలంగాణలో మూడు రాజ్యసభ సీట్లు ఏకగ్రీవం

## రేణుకాచౌదరి,అనిల్, వద్దిరాజుల ఎన్నిక

**హైదరాబాద్(జనంసాక్షి):** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రం ముగియడంతో తెలంగాణ నుంచి పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో 3 స్థానాలకు కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఒకరు బరిలో నిలవగా.. ఎన్నిక ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే శ్రమజీవి పార్టీ తరపున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, స్వతంత్ర అభ్యర్థిగా కిరణ్ రాథోడ్ లు నామినేషన్లు వేశారు. అయితే, రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఒక్కో అభ్యర్థికి కనీసం 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు మినహా మిగిలిన ముగ్గురికీ మద్దతుగా ఎమ్మెల్యేలెవరూ సంతకాలు చేయలేదు. ఈ క్రమంలో ఆ ముగ్గురి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు. రేణుకాచౌదరి రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా పేరు పొందారు. 1984లో టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె.. 1986లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికల్లో బంజారాహిల్స్ నుంచి కార్పొరేటర్ గా గెలిచారు. 1986 నుంచి 98 వరకూ రెండుసార్లు రాజ్యసభ సభ్యురాలి గా పని చేశారు. 1999, 2004లో ఖమ్మం లోక్ సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. హెచ్ డీ దేవెగౌడ ప్రభుత్వంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2004లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా, 2006 నుంచి కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2009 ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నుంచి పోటీచేసి నామా నాగేశ్వరరావు చేతిలో ఓటమి పాలయ్యారు. సికింద్రాబాద్ మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్ తనయుడే అనిల్ కుమార్ యాదవ్. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023లోనూ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు యత్నించారు. అయితే, పార్టీలో వన్ ఫ్యామిలీ.. వన్ టికెట్ ఫార్ములా అమలుతో ఆ సీటును తండ్రి కోసం త్యాగం చేశారు. యూత్ కాంగ్రెస్ లో చురుగ్గా పని చేసి మంచి గుర్తింపు పొందడంతో రాజ్యసభ ఛాన్స్ దక్కింది. గతంలో బండ ప్రకాష్ రాజీనామా వల్ల ఖాళీ అయిన రాజ్యసభ సీటును వద్దిరాజుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చారు. 2022, మే 24న ఈ పదవికి ఎన్నికైన వద్దిరాజు కేవలం రెండేళ్లే ఎంపీగా కొనసాగడంతో ఆయనకు మరోసారి గులాబీ బాస్ అవకాశం కల్పించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ ఈస్ట్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్ లో చేరారు. మొత్తంగా ఇద్దరు కాంగ్రెస్, ఒక బీఆర్ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు.

# చండీగఢ్ మేయర్ ఎన్నిక చెల్లదు

గీశారు ' అని వెల్లడించిన సీజేఐ.. ఆ పేపర్లను కోర్టులోని ఇరుపక్షాల న్యాయవాదులకు చూపించారు. అలాగే లెక్కింపు పక్రియకు సంబంధించిన వీడియోను మరోసారి వీక్షించారు. మాసిహ్ చర్యలపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీజేఐ.. లెక్కింపు వీడియోను మరోసారి ప్లే చేయమన్నారు. 'అందరినీ ఈ వీడియో చూడనివ్వండి. జీవితంలో వినోదం మంచిదే. అయితే కౌంటింగ్ వీడియో మొత్తం వేయాల్సిన పనిలేదు. అంతా వేస్తే.. సాయంత్రం 5.45 గంటల వరకు ఇక్కడే ఉంటాం' అని సరదాగా మాట్లాడారు. ఎనిమిది చెల్లిన ఓట్లు ఉన్నాయని, కాబట్టి మళ్లీ లెక్కించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఓట్ ట్యాంపరింగ్ ఆరోపణలపై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. జనవరి 30న చండీగఢ్ మేయర్ ఎన్నికలు జరిగాయి. కార్పొరేషన్‌లో 35 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఆప్-కాంగ్రెస్ కూటమికి 20, బీజేపీకి 14, ఎస్ఏడీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. మేయర్ ఓటింగ్ సందర్భంగా ఆప్-కాంగ్రెస్ కూటమికి చెందిన 8 మంది కౌన్సిలర్ల ఓట్లను చెల్లనివిగా ఆర్వో అనిల్ మాసిహ్ ప్రకటించారు. బీజేపీ మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను విజేతగా ప్రకటించారు. బ్యాలెట్ పేపర్లపై రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్ ఎక్స్ మార్క్ పెడుతున్నట్లు అక్కడే ఉన్న సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ అయింది. ఈ వీడియో బయటకు రావడంతో రాజకీయంగా తీవ్ర కలకలం రేగింది. దీంతో ఆప్ కౌన్సిలర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం పై మంగళవారం మరోసారి విచారణ జరిపిన ధర్మాసనం అనిల్ మాసిహ్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే బ్యాలెట్ పేపర్లను కొట్టివేశారని మండిపడింది. ఈ క్రమంలో ఆ 8 ఓట్లను కూడా లెక్కలోకి తీసుకుని మరోసారి మొత్తం ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

**బీజేపీ బండారం బయటపడింది:ఆప్**

చండీగఢ్ మేయర్ ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆమ్ ఆద్మీ పార్టీ సంతోషం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టులో బీజేపీ బండారం బయటపడిందంటూ ఆ పార్టీ విమర్శలు గుప్పించింది. ఈ సందర్భంగా ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. ఇంత చిన్న ఎన్నికల్లోనే కేంద్ర ప్రభుత్వం, బీజేపీ దోపిడీకి పాల్పడిందంటే.. అది పెద్ద ఆందోళన కలిగించే విషయమేనని అన్నారు. ఇదే సమయంలో ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడినందుకు సుప్రీంకోర్టుకి ధన్యవాదాలు అని ఎక్స్ వేదికగా ఆయన రాసుకొచ్చారు. దిలావుండగా.. జనవరి 30వ తేదీన జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో తగినంత సంఖ్యా బలం(16) లేకపోయినప్పటికీ బీజేపీ మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్ విజయం సాధించారు. మెజారిటీకి అవసరమైన కౌన్సిలర్ల బలం(20) ఉన్నా.. ఆప్-కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కుల్దీప్ కుమార్ మాత్రం ఓటమి పాలయ్యారు. దీంతో.. ఈ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయ స్థానం.. ఆప్ అభ్యర్థి అయిన కుల్దీప్‌ను విజేతగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. భారత ప్రధాన న్యాయ మూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేసేందుకు.. ఉద్దేశపూర్వకంగా వ్యవహరిం చారని స్పష్టంగా తెలుస్తోందని తెలిపింది. ఈ సందర్భం గా.. రిటర్నింగ్ అధికారి కొట్టివేత గుర్తు పెట్టిన బ్యాలెట్ పేపర్లను ధర్మాసనం పరిశీలించింది. అనంతరం లెక్కింపు పక్రియను సంబంధించిన వీడియోని మరోసారి వీక్షించారు.

# ఐఐటీ హైదరాబాద్ జాతికి అంకితం

అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు. విశాఖ ఐఐఎంకు సంబంధించి 2016 నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తాత్కాలిక క్యాంపస్ నిర్వహిస్తున్నారు. ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలో స్థలం కేటాయించి మొదటి దశ శాశ్వత భవనాలు పూర్తి చేశారు. తిరుపతి జిల్లా ఏర్పేడుకు సమీపంలోని ఐఐటీ, శ్రీనివాసపురంలోని ఐసర్ భవనాలను పూర్తి చేశారు. ఉమ్మడి ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన పేర్కొన్న మేరకు తిరుపతిలోని ఐఐటీ, ఐసర్ తోపాటు విశాఖలో ఐఐఎం వంటి కేంద్ర విద్యా సంస్థలకు సొంత భవనాలు సమకూరాయి. ఇన్నాళ్లు అద్దె భవనాల్లో కొనసాగిన ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు నేడు సొంత భవనాల్లో కొలువుదీరాయి. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ గా వీటిని ప్రారంభించారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో అద్భుతాలు సృష్టిస్తూ, సరికొత్త ఆవిష్కరణలకు తోడ్పాడు అందిస్తూ విద్యా వ్యాప్తికి పునాదులు వేస్తున్న తిరుపతి ఐఐటీ, ఐసర్ సంస్థలు నేడు సొంత భవనాల్లో కొలువుదీరాయి. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి కేటాయించిన తిరుపతి(÷ుతిసబుజీబితి) ఐఐటీ, ఐసర్ భవనాలు ఇన్నాళ్లు అద్దె భవనాల్లో కొనసాగాయి. తిరుపతి సమీపంలోని ఏర్పాడు సమీపంలో సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఐఐటీ, ఐసర్ భవనాలను నేడు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ గా ప్రారంభించారు. 2017లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెదేపా ఉన్న సమయంలో జాతీయ విద్యా సంస్థలకు శంకుస్థాపన చేశారు. వీటికి ప్రధాని నరేంద్రమోదీ ఆన్‌లైన్ ద్వారా మంగళవారం జాతికి అంకితం చేశారు. ఏర్పేడుకు సమీపంలోని శ్రీనివాసపురంలోని 255 ఎకరాల విస్తీర్ణంలో ఐసర్ భవనాల నిర్మాణాలు చేపట్టారు.



తొలుత తిరుపతికి సమీపంలో తాత్కాలిక తరగతి గదులు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం రూ.2117 కోట్ల వ్యయంతో ఇక్కడ అత్యాధునికంగా భవనాలు నిర్మించారు. సుమారు 1500 మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. సాంకేతిక విద్యను విద్యార్థులకు అందుబాటులోనికి తీసుకురావడంతో పాటు స్థానికతకు ఉపాధి అవకాశాలు లక్ష్యంగా ఐఐటీ ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఏర్పేడుకు సమీపంలోని నంది కొండలను ఆనుకుని సుమారు 578 ఎకరాల్లో ఈ భవన నిర్మాణాలను చేపట్టారు. ఇక్కడ 1550 మంది విద్యార్థులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పొందుపరిచిన కేంద్ర విద్యా సంస్థల్లో ఒకటి అయిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం శాశ్వత క్యాంపస్‌ను మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. 2015 నుంచి ఐఐఎం విశాఖ కార్యకలాపాలను ఆంధ్రా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశాఖ శివారు ఆనందపురం, గంభీరం పరిసర ప్రాంతాల్లో 241.50 ఎకరాల్ని ఉచితంగా కేటాయించింది. ఇందులో శాశ్వత భవన నిర్మాణం పూర్తి చేసే పనుల్ని రెండు దశల్లో చేపట్టారు. మొదటి దశలో రూ.472.61 కోట్లతో పనులు పూర్తయ్యాయి. మొత్తం 62,350 చదరపు మీటర్ల విస్తీర్ణంలో బిల్టప్ ఏరియాని అభివృద్ధి చేశారు. అడుగడుగునా అద్భుతమనేలా హరిత భవనం (గ్రీన్ బిల్డింగ్), స్మార్ట్ భవనంగా దీన్ని తీర్చిదిద్దారు. 1,500 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ఎ÷-లాంటును నిర్మించారు. దీని ద్వారా సంవత్సరానికి 22.59 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయ నమూనాను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు 'యు' ఆకారంలో కూర్చొనేలా తరగతి గదులు నిర్మించారు. ఇటు తెలంగాణలోని ఐఐటీ హైదరాబాద్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం జాతికి అంకితం చేశారు. 2008 ఆగస్టు 18న ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ఐఐటీ హైదరాబాద్ ప్రారంభమైంది. శాశ్వత క్యాంపస్ ఏర్పాటు కోసం కంది గ్రామంలో 576 ఎకరాలు కేటాయించగా, ఫిబ్రవరి 27, 2009లో అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 20వేల మంది విద్యార్థులతో పాటు 10వేల మంది బోధన, ఇతర సిబ్బంది కోసం క్యాంపస్ నిర్మాణాన్ని 2010లో ప్రారంభించారు. భారత ప్రభుత్వం, జపాన్‌కు చెందిన జైకా సంస్థ కలిసి 2019 వరకు మొదటి దశ నిర్మాణం పనులు పూర్తి చేశాయి. జూలై 2015లో ఐఐటీ హైదరాబాద్‌ను ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ నుంచి కందిలోని శాశ్వత క్యాంపస్‌లోకి మార్చారు. మొదటి దశ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం, జపాన్‌కు చెందిన జైకా కలిసి సుమారు రూ.1700 కోట్లు ఖర్చు చేశాయి.

# గురుకులాల పనితీరుపై సమీక్షించండి

- సమీక్షించి విద్యార్థుల ప్రాణాలను కాపాడండి
- విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడానికి కౌన్సిలర్ల సంఖ్యను పెంచండి
- ఆత్మహత్య చేసుకున్న ఇమాంపేట ఎస్సీ హాస్టల్ విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత
- ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్సీ కవిత



**సూర్యాపేట, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలు కలచివేస్తున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే దీనిపై దృష్టి సారించి గురుకుల పాఠశాలల పనితీరుపై సమీక్షించి ఆడబిడ్డల ప్రాణఆలను కాపాడాలని చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. పరీక్షల సమయం కాబట్టి విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కౌన్సిలర్ల సంఖ్యను పెంచాలని సూచన చేశారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఇమాంపేట ఎస్సీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అస్మిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. మంగళవారం నాడు సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని బుర్కచెర్ల గ్రామంలో అస్మిత తల్లిని, కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తో కలిసి ఎమ్మెల్సీ కవిత పరామర్శించి ఓదార్చారు. ఆర్థిక సాయం చేశారు. కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అస్మిత ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. అదే పాఠశాలలో కొద్దికాలం క్రితం మరొక విద్యార్థిని కూడా ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రెండు వారాల క్రితం భువనగిరి గురుకుల పాఠశాల లోనూ ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఇలా ఆడపిల్లల వరుస ఆత్మహత్యలు తనను కలచివేశాయని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో ఏం జరుగుతోందో అన్నదానిపై సమీక్ష చేయాలని చేతులు జోడించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరీ ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షల ఒత్తిడితో ఉన్నారా అన్నది కూడా ప్రభుత్వం ఆలోచించన చేయాలని సూచించారు. గురుకులాలను ఏర్పాటు చేసి లక్షలాది మంది పిల్లలను చదివిపిస్తున్న నేపథ్యంలో ఇలాంటి వరుస సంఘటనల జరుగుతుంటే ఆందోళన కలిగిస్తుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయం విద్యార్థుల మానసిక ఒత్తిడిని తొలగించే విధంగా కౌన్సిలర్ల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. అలాగే, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మార్కులు, ర్యాంకులు అంటూ ఒత్తిడి చేయవద్దని కోరారు.

అయితే, విద్యార్థినుల ఆత్మహత్యల సంఘటనల్లో దర్యాప్తు ముందుకు సాగడం లేదని ఆక్షేపించారు. భువనగిరి సంఘటనతో పాటు ఇమాంపేట హాస్టల్ విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర దర్యాప్తు జరిపించడానికి కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్షపూరిత వైఖరిని వీడాలని స్పష్టం చేశారు.

## పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్యకు కవిత పరామర్శ



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య గారిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. మూడు రోజుల క్రితం తన భర్త రామకృష్ణా రెడ్డి గారు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు హిమాయత్ నగర్ లోని నివాసానికి వెళ్లి పరామర్శించారు. రామకృష్ణారెడ్డికి నివాళులర్పించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# గాంజా శంకర్ మూవీ టైటిల్ మార్చాలి



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** సంపత్ నంది, సాయి ధరంతేజ్ కాంబినేషన్లో వస్తున్న గాంజా శంకర్ మూవీ టైటిల్ మార్చాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అస్మి బాబు,జావిద్ డిమాండ్ చేశారు. సుందరయ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గాంజా శంకర్ మూవీ టైటిల్ చూస్తుంటే నేటి యువత విద్యార్థులు గాంజా శంకర్ లుగా తయారయ్యే ప్రమాదం ఉందని అన్నారు. యువత విద్యార్థులు డ్రగ్స్ కి, గంజాయిలకి చెడు అలవాట్లకి గురై వాళ్ళ జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. చెడు అలవాట్లకు గురవుతున్న విద్యార్థి యువతలకు దూరంగా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి టైటిల్స్ పెట్టి సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నారు సినిమా దర్శకులు, హీరోలు సమాజాన్ని మార్చే బాధ్యత కూడా సినిమాల పైన ఉంటుంది కాబట్టి ఇలాంటి పేర్లతో సినిమాలు తీయడం సిగ్గుచేటు అన్నారు. సెన్సార్ బోర్డు కూడా ఇలాంటి సినిమాల పేర్లను పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే గాంజా శంకర్ మూవీ టైటిల్ మార్చాలని కోరారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తారని హెచ్చరించారు.

# ఎల్ అండ్ టి మెట్రో రైల్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలి

- కొల్లగొట్టిన ప్రభుత్వ ధనాన్ని రాబట్టాలి
- ఎల్అండ్టి సంస్థ అక్రమాలకు తోడ్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్




**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఎల్అండ్టీ మెట్రో రైల్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఎల్ అండ్ టి మెట్రో రైల్ సంస్థ ఒప్పందాలకు విరుద్ధంగా అధిక రైలు టికెట్ వసూలు చేస్తోందని, ప్రయాణికులకు సరైన సదుపాయాలు కల్పించడం లేదని, వందల కోట్ల లేబర్ సెస్ ఎగవేసిందని ఇంకా అనేక క్రమాలకు పాల్పడుతోందని గతంలోనే సీపీఎం ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిందని, అనేక ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ అండ్ టి సంస్థకు లొంగిపో వడం వల్లే ఈ దోపిడీ కొనసాగిందన్నారు. ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన కాగ్ నివేదిక ఎల్ అండ్ టి సంస్థ అనేక అక్రమాలకు పాల్పడినట్టు స్పష్టం చేసిందన్నారు. కాగ్ నివేదికతో సిపిఎం చెప్పిన విషయాలు వాస్తవమని తేలిందన్నారు. కాగ్ నివేదిక నిర్ధారించిన వివరాల ఆధారంగా దోచుకున్న ప్రభుత్వ సొమ్మును ఎల్ అండ్ టి సంస్థ నుండి తిరిగి రాబట్టే చర్యలు చేపట్టాలని, ఎల్ అండ్ టి సంస్థకు దోపిడీకి సహకరించిన అధికారులపై చర్య తీసుకో వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి విరుద్ధంగా ఎల్ అండ్ టి సంస్థ మెట్రో ఛార్జీలను అధికంగా వసూలు చేసిందన్నారు. కాగ్ అంచనా ప్రకారం 2020 నాటికి 213 కోట్ల రూపాయలు ఎల్ అండ్ టి అదనంగా వసూలు చేసిందని ఈరోజుకు లెక్క వేస్తే సుమారు రూ.500 కోట్లకు చేరుతుందని తెలిపారు. మెట్రో స్టేషన్లు నిర్మాణం విస్తీర్ణం తగ్గించి నిర్మించడంతో ఎల్ అండ్ టీ సంస్థకు రూ.227 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఉప్పల్ కాస్టింగ్ యార్డ్ తక్కువ ధరకే లీజ్ కు ఇవ్వడం వల్ల 2020 నాటికి రూ.95 కోట్లు నష్టం జరిగిందని కాగ్ నివేదిక చెప్పిందని తెలిపారు. పట్టణ పునరుద్ధరణ పనుల పేరుతో ఎల్ అండ్ టి చేయాల్సిన పనులను హెచ్ఎంఆర్ఎల్ చేపట్టి రూ.112 కోట్ల భారాన్ని తనపై వేసుకుంద న్నారు. ఎక్కువగా మెట్రో స్టేషన్లలో నేటికీ పార్కింగ్ సదుపాయం కల్పించలేదని, పార్కింగ్ కోసం కేటాయించిన హైటెక్ సిటీ లోని 15 ఎకరాలను అమ్ముకుంటున్నదని తెలిపారు. గత ప్రభుత్వం తన తప్పిదాల కారణంగా ఎల్ అండ్ టి సంస్థ దోపిడీకి అడ్డుకట్ట వేయలేక పోగా సహకరించిందని, ఎల్ అండ్ టి సంస్థ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# టీజీవోస్ కేంద్ర సంఘం కార్యవర్గానికి శుభాకాంక్షలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఎల్బీనగర్ పల్లవి గార్డెన్‌లో తెలంగాణ అధికారుల సంఘం(టీజీవోస్) కేంద్ర సంఘానికి ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శిగా ఏ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులందరికీ టీజీవో హైదరాబాద్ జిల్లా పక్షాన హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ఏమే ఖాధర్, హరికృష్ణ, శ్రినేష్‌కుమార్, రవీంద్ర కుమార్, స్వరూపరాణి, ఎంజులారెడ్డి, పూనం కుమార్, నాగేశ్వర్‌రావు, డాక్టర్ సురేందర్, నరేశ్, చిత్తరంజన్‌రెడ్డి, డాక్టర్ సునీత జోషి రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

# చల్మెడ నుంచి బొమ్మకల్ ఫ్లై ఓవర్ వరకు రోడ్ జంపర్లు వేయాలి



**కరీంనగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరంలోని చల్మెడ నుంచి బొమ్మకల్ ఫ్లై ఓవర్ వరకు రోడ్ జంపర్లు వేయాలని కరీంనగర్ రూరల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ షహనవాజ్ ఉద్దీన్ ఆర్ అండ్ బీ ఎస్ఈకి వినతిపత్రం అందించారు. సోమవారం ఫ్లై ఓవర్ మదీనా చికెన్ సెంటర్ వద్ద లారీ ఢీకొని యువతి మృతి చెందిందని, ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా ఉండాలని సూచించారు. బొమ్మకల్ గ్రామంలోని చల్మెడ నుండి ఫ్లై ఓవర్ వరకు రోడ్ జంపర్లు వేయాలని కోరుతూ లేఖ సమర్పించారు. వీరితో కరీంనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఇమ్రాన్ ఉన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే మా ఎజెండా

- టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ




**తుంగతుర్తి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమం కోసం టియుడబ్ల్యూజే-ఐజేయు యూనియన్ అవిశ్రాంత కృషి చేస్తూ జర్నలిస్టుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్లో టియుడబ్ల్యూజే-ఐజేయు యూనియన్ మంగళవారం నిర్వహించిన జిల్లా తృతీయ మహాసభకు టియుడబ్ల్యూజె-ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరమంచి రవీందర్ శర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నేడు సమాజంలో ఎన్నో జర్నలిస్ట్ సంఘాలు పుట్టుకొచ్చాయని అవి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేయడం వల్ల ఆ ప్రభుత్వము పడిపోగానే వాటితో పాటు ఆ సంఘాలు కూడా కనుమరుగై పోతున్నాయని అన్నారు. కానీ టీయూడబ్ల్యూజే-ఐజేయు సంఘం జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తూ జర్నలిస్టుల కృషి వారి త్యాగ ఫలితంగా వారి హక్కుల కోసం ప్రభుత్వంతో పోరాటం చేసి హక్కులను సాధించుకున్న ఘనత ఒక్క టీయూడబ్ల్యూజే-ఐజేయుకు మాత్రమే దక్కిందన్నారు. ఒకప్పుడు జిల్లా స్థాయి విలేకరులకు అక్రిడేషన్ కార్డు ఉండేదని కానీ టీయూడబ్ల్యూజే చేసిన పోరాట ఫలితంగానే గ్రామీణ ప్రాంతాల్లోని విలేకరులు కూడా అక్రిడేషన్ కల్పించిన ఘనత తమ సంఘానికి దక్కిందన్నారు. నేడు మండల స్థాయి నుండి ఢిల్లీ స్థాయి వరకు 14 వేలకు పైగా సభ్యత్వాలు కలిగి ఉందన్నారు. తమ సంఘానికి 70 ఏళ్ల చరిత్ర ఉందని అన్నారు. జర్నలిస్టులు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పవిత్రమైన మీడియా వృత్తిలో ఉండి నైతిక విలువలు పెంపొందించడంతోపాటు తమ హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఉద్యమించాలని అన్నారు. జర్నలిస్టులు ముఖ్యంగా ఇళ్ల స్థలాలు కోరుకుంటున్నారని ప్రభుత్వము దృష్టికి ఇట్టి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగానే రాష్ట్ర ముఖ్యమంత్రిని సమాచార శాఖ మంత్రిని కలిసి జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించినట్టు తెలిపారు. 2018 ముందు జర్నలిస్టుల హెల్త్ కార్డులు పనిచేశాయని కానీ ప్రస్తుతం ఆస్పత్రులకు 700 పైగా కోట్లు చెల్లించాల్సి ఉన్నందున వారు వైద్యం చేయకపోవడంతో హెల్త్ కార్డులు నిరుపయోగంగా మారాయని ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.రాష్ట్రంతో పాటు దేశంలో ఏ మూల ఏ సంఘటన జరిగిన వెంటనే పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్న విలేకరుల కృషి వెలకట్టలేనిదని అన్నారు.




# నకిలీ రైతు.. కుళ్లు, కుతంత్రాలు మౌతు

- ఆర్టీఐ అతని ఆదాయ మార్గం
- రైతు పేరుతో కుట్రలకు మార్గం
- ఆడమ్స్ టూ నర్సింగ్ కాలేజీల వరకు అతని బాధితులు..
- మంత్రులు, జడ్జిలు తెలుసంటూ మాయమాటలు



**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి):** సోది చెబుతాడమ్మ సోది.. లేనిది ఉన్నట్లు చెపుతాడు.. ఉన్నది లేనట్లు చెపుతాడు.. బట్టబుర్రుంటే జుట్టు రాదని చెపుతాడు.. ఒళ్ళు తగ్గాలంటే పనిమనిషిని మాన్పించమని చెపుతాడు.. పెళ్ళీడు అబ్బాయి ఉంటే, పెళ్ళి అవ్వగానే వేరు కు0డ పెడతాడాని చెపుతాడు.. పెళ్ళీడు అమ్మాయి ఉంటే నాలుగు దిక్కుల్లో ఓ దిక్కునుంచి పెళ్ళికోడుకు వస్తాడని చెపుతాడు.. అయ్యగారైతే మీ ఇంటావిడ వందకి ఇరవై పనికిమాలిన వస్తువులు కొంటుందని చెపుతాడు.. అమ్మగారైతే భోగభాగ్యాలన్ని అంతానీ వల్లనే, నీ మాట వినాలేగాని కోట్లు సంపాదిస్తాడని అని చెపుతాడు.. ప్రమోషన్ కావాలంటే నాకు చెబితే జరిగిపోతుందని చెపుతాడు.. ఆసక్తి బట్టి ఇంకా ఇంకా చెపుతాడు.

కంచుకొండ కేంద్రంగా అతడి కుళ్లు రాజకీయాలు ఉంటాయి. అగ్ర నాయకులను అన్నీ తానై నడిపిస్తున్నట్లుగా మహా గొప్పలు చెప్పుకుంటాడు. రైతు ముసుగు తొడిగి ఆర్టీఐ వ్యవస్థని జీవనాధారం చేసుకున్నాడు. పరిచయం లేని వ్యక్తులు తనకు ఎంతో దగ్గరి పరిచయమైనట్లు అమాయక జనం ముందు బీరాలు పోతాడు. మమత భూములతో పాటు ప్రస్తుతం మంత్రి గా ఉన్న వారి భూముల వ్యవహారంలో పిల్ వేసి భారీగా నగదు గుంజాడని సమాచారం. పిల్ వేయమని ప్రస్తుతం మంత్రి వర్గంలో ఉన్న ఒక మంత్రి తనకు చెప్పారని సీనియర్ మంత్రి పేరుని బద్నాం చేసాడు. ఊరు వదిలి వెళ్లాడు కాని గ్రామస్థులను సుఖ నిద్ర పోనివ్వకుండా అన్నింటిలో వేలు పెట్టి వేధిస్తున్నాడు. అతని తీరు ఎలా ఉంటుందంటే మాజీ మంత్రి కలిస్తే మాజీకి అనుకూలంగాను.. ప్రస్తుత మంత్రి కలిస్తే తాజా మంత్రికి అనుకూలంగా.. ఇలా మాట్లాడి ప్రతి చోట పబ్బం గడుపుకోవడం మంచుతో పెట్టిన విద్య. ఏ ఇద్దరు కలిసి ఉన్నా అతని కళ్లు ఓర్వలేవు. ఏ పత్రిక విలేకరి కలిస్తే వారితో ఇప్పుడే తన పత్రిక చైర్మన్ తో , ఎడిటర్ మాట్లాడానని చెప్పుకుంటాడు. వారికి ఉపాధి కల్పించింది తనని చెప్పుకుంటాడు. చేసేది చీమంత.. చెప్పుకునేది గోవర్ధన గిరంత. స్నేహం చేసినట్లే చేస్తాడు అంతలోనే విషనాగై కాటేస్తాడు. గాంధీ చౌక్ లోని ఎరువుల మందుల షాపు వారి నుంచి మొదలు నర్సింగ్ కాలేజీ , భూములు, మెడికల్ కాలేజీలు, వెంచర్లు, కోల్డ్ స్టోరేజ్ లు, ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటి కాదు రెండు కాదు ఆదాయ వనరులున్న అన్నింటిలో తల, తోక అన్ని పెట్టి ఏదోక లాభం జరగనిదే బయటికి రాడు. అతన్ని ఎవరైన చూస్తే పెద్ద తరహాగా కంటే ఆర్టీఐల ద్వారా ఎక్కడ వేధిస్తాడో అని ఆందోళన చెందేవారు. ఆర్టీఐ వచ్చిన కొత్తలో ఇతని దందాకు తిరుగు లేకుండా పోయింది. గ్రామంలో భూ వివాదాలు సృష్టించడం వాటిని పరిష్కరిస్తానని ఇద్దరి వద్ద నుంచి ఎంతో కొంత గుంజడం ఇదే వృత్తి , ప్రవృత్తిగా పెట్టుకున్నాడు. మాజీ మంత్రి వద్ద తాజా మంత్రుల గురించి మాట్లాడే వాడు.. ఇప్పుడు తాజా ల వద్ద మాజీ గురించి నోరు జారుతుంటాడు. మాజీ కి మెజార్టీ రావాలని ఆ పార్టీ వారి వద్ద చెప్పేవాడు... తాజా కు మెజారిటీ రావాలని తాజా నాయకుల అభిమానుల వద్ద మాట్లాడే వాడు. మాజీ భూముల పై పిల్ వేయమని తాజా మంత్రి ఒకరు చెప్పారని మాజీ వద్ద చెప్పి తాజా మంత్రికి, మాజీ మంత్రికి మధ్య విబేధాలు సృష్టించాడు. తాజా మంత్రి పిల్ వేయమంటేనే వేసినట్లుగా మాజీ మంత్రి భావిస్తున్నట్లుగా తాజా మంత్రి తో చెప్పి ఇద్దరి మధ్య మరింతగా దూరం పెంచేవాడు. ఎవరు గెలిచినా కాని నేనే గెలిపించా అంటాడు. ఎవ్వరు ఓడినా కాని నేనే ఓడించా అంటాడు. ఎన్నో సార్లు తమ గ్రామంలో స్థానిక సంస్థలకు పోటి చేసి ఓడిన దాఖలాలున్నాయి. జిల్లాలో ఉన్న అనేక మంది నాయకులు ఇతని బాధితులున్నారు. ఆనంద పడి ఏదైనా కొన్నామని చెప్పుకుందామంటే అతని కండ్లు దాని పై పడితే అంతే సంగతులని చెప్పకుండా దాచుకునే వారి సంఖ్య అధికం. సొంత తమ్ముడుని సరైన మార్గంలో పెట్టలేని వాడు లోకమంత శాంతి కీర్తనలు బోధిస్తూ తిరుగుతాడు. జనం ఎన్ని విధాలుగా ఎన్ని మాటలు తిట్టిన కాని రోషం లేని మీసాలు తిప్పుకొని వెళ్లిపోతాడు. ఎవ్వరితో సహాయం పొందుతాడో వారి గురించే నోరు జారుతాడు. పాపం అని సహాయం చేస్తే తనకు భయపడి గజ గజ వణికి పోయి కాళ్ల మీద పడి బ్రతిమిలాడి పని చేసారు అంటాడు. ఎవరైన ఇద్దరు నేతల మధ్య కాస్తా ఆధిపత్య పోరు, వైరం ఉండటం సహజం. దాన్ని పూడ్చకుండా మరింత పెద్దది చేసి వాళ్ల మధ్య చైనా గోడలు నిర్మిస్తాడు. చిన్న తరగతి వ్యక్తుల నుంచి మొదలుకొని పెద్ద స్థాయి హోదాలు కలిగిన వారి వరకు తన చెప్పు చేతల్లో ఉంటారని చెప్పుకుంటూ తిరుగుతాడు. వంద ఎలుకలు తిన్న పిల్లి.. కాశీ కి వెళ్లినట్లు చేసిన తప్పులు చేస్తూనే పైన భగవంతుడు అనే వాడు ఉన్నాడు వాడు చూస్తడు అంటాడు. ముప్పై ఏండ్ల హిస్టరీ అని చెప్పుకునే సదరు కంచు బ్రదర్ టిడిపి హవా కొనసాగుతున్న సమయంలో మహిళ చేతిలో జడ్పిటిసి గా ఓటమి పాలైయ్యాడు. జలయజ్ఞం పథకం లో పూడిక తీసిన సర్పంచ్ కు ప్రభుత్వం అవార్డు ప్రకటిస్తే అతనికి బదులుగా ఈ ఘనాపాటి అవార్డు తీసుకున్నాడు. దాంతో స్టేజీ మీదనే గొడవ జరిగింది. సొసైటీ ఎన్నికల్లో ఇతనికి ఓటమి రూపంలో చేదు అనుభవం ఎదురైంది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో సొసైటీ ఏకగ్రీవం కావడంతో ఏదో మమ అనిపించాడు. అందరు నా వద్దకు రావాల్సిందే అంటూనే అందరి వద్దకు చీకట్లో వెళ్లి శరణు కోరుతాడు.






# చురుకైన పౌరులకు స్కౌటింగ్ ఓ ప్రేరణ

*బాయ్ స్కౌట్స్ ఉద్యమాన్ని స్థాపించిన లార్డ్ రాబర్ట్ బాడెన్-పావెల్ జన్మదినం అయిన ఫిబ్రవరి 22న ప్రపంచ స్కౌట్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ముద్దుగా బి.పి పేరుతో పిలువబడే ఈయన లండన్‌లోని పాడింగ్టన్‌లో 1857న జన్మించి ప్రపంచ స్కౌటింగ్ ఉద్యమాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రపంచ స్కౌట్ దినోత్సవం 2024 యొక్క థీమ్ "స్కౌట్స్ ఫర్ ఎ బెటర్ వరల్డ్." డూ ఎ గుడ్ టర్న్ డైలీ అనేది స్కౌట్ నినాదం. ప్రతిఫలంగా ఏమీ ఆశించకుండా ప్రతిరోజూ సమాజానికి తిరిగి ఇవ్వడం. సమాజం మరియు పర్యావరణం పట్ల శ్రద్ధ వహించడానికి స్కౌట్‌లు తమ వంతు కృషి చేస్తారని దీని అర్థం.*



స్కౌటింగ్ 11 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలుర కోసం ఒక కార్యక్రమంగా ప్రారంభమైంది. స్కౌటింగ్ యువత విద్యా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నైతికత, నాయకత్వ నైపుణ్యాలు మరియు వారి వయోజన జీవితాలను ప్రభావితం చేసే పౌరసత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. స్కౌటింగ్ యువతకు వ్యక్తులుగా తాము ముఖ్యమని భావాన్ని అందిస్తుంది. స్కౌటింగ్ కుటుంబానికి చెందిన వారు ఒక గేమ్‌లో గెలిచినా ఓడినా అనే దానితో సంబంధం లేకుండా వారికి ఏమి జరుగుతుందనే దాని గురించి వారికి తెలియజేయబడుతుంది. స్కౌటింగ్ వ్యక్తిగత బాధ్యత మరియు అధిక ఆత్మగౌరవానికి దారితీసే కార్యకలాపాలను ప్రోత్సహిస్తుంది. తత్ఫలితంగా కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు దానికి కావల్సిన సరైన మార్గాన్ని ఎంచేకునేటప్పుడు ఏర్పడే ఒత్తిడిని జయించవచ్చు. స్కౌటింగ్ మన సమాజంలో పెరుగుతున్న యువకుల ఆరు ముఖ్యమైన అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది. అవి మార్గదర్శకత్వం, జీవితకాలం నేర్చుకోవటం , విశ్వాస సాంప్రదాయాలు, ఇతరులకు సేవ చేయడం, ఆరోగ్యవంతమ్కెన జీవితం మరియు బిల్డింగ్ క్యారెక్టర్. 100 సంవత్సరాలకు పైగా, స్కౌటింగ్ కార్యక్రమాలు యువతలో స్కౌట్ ప్రమాణం మరియు స్కౌట్ చట్టంలో ఉన్న విలువలను నింపాయి. స్కౌటింగ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు మరియు భూభాగాలలో 57 మిలియన్లకు పైగా స్కౌట్‌లతో ప్రపంచంలోని ప్రముఖ విద్యా యువజన ఉద్యమం. విద్య, సాహసం మరియు వినోదం యొక్క కలయికల ద్వారా మెరుగైన మరియు మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో నిమగ్నమై ఉన్న చురుకైన పౌరులుగా మారడానికి యువకులకు స్కౌటింగ్ ప్రేరణగా కొనసాగుతోంది.

**స్కౌట్ చరిత్ర** : 1908 లో బాడెన్-పావెల్ "స్కౌటింగ్ ఫర్ బాయ్స్" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. ఇది తక్షణ విజయాన్ని సాధించింది మరియు అప్పటి నుండి 100 మిలియన్ కాపీలు అమ్ముడవ్వడమే కాకుండా 1909లో ఐదు భాషల్లోకి అనువదించబడింది. ఇది "ది బాయ్ స్కౌట్స్" అనే పేరుతో ఒక ఉద్యమాన్ని రూపొందించింది. 1910లో బాడెన్-పావెల్ తన సోదరి ఆగ్నెస్ నాయకత్వంలో గర్ల్ గైడ్స్‌ను ప్రారంభించాడు. 1916లో "వోల్ఫ్ కబ్స్ హ్యాండ్‌బుక్" ప్రచురణ మరియు రుడ్‌యార్డ్ కిప్లింగ్ యొక్క "జంగిల్ బుక్"ను ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగించడం ద్వారా 11 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బాయిల కోసం కబ్ స్కౌట్స్ ప్రారంభించబడింది. 1920లో మొదటి ప్రపంచ స్కౌట్ కాన్ఫరెన్స్ (నాటి పేరు అంతర్జాతీయ స్కౌట్ కాన్ఫరెన్స్ ) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో జరిగిన మొదటి ప్రపంచ స్కౌట్ జంబోరీలో 33 జాతీయ స్కౌట్ సంస్థలు హాజరయ్యాయి. వరల్డ్ స్కౌట్ బ్యూరో (అప్పట్లో బాయ్ స్కౌట్స్ ఇంటర్నేషనల్ బ్యూరో ) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో స్థాపించబడింది. 1922లో 31 జాతీయ స్కౌట్ సంస్థలు ప్రాతినిధ్యం వహించిన ఫ్రాన్స్‌లోని పారిస్‌లో 2వ ప్రపంచ స్కౌట్ సమావేశం జరిగింది. గ్లోబల్ సభ్యత్వం కేవలం 1 మిలియన్ కంటే ఎక్కువ స్కౌట్‌లకు చేరుకుంది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య, స్కౌటింగ్ కార్యకలాపాలు నిషేధించబడిన నిరంకుశ ప్రాంతాలలో మినహా స్కౌటింగ్ అభివృద్ధి చెందుతూనే ఉంది. ఆక్రమిత దేశాల్లో మరియు నిరంకుశ పాలన ఉన్న దేశాల్లో స్కౌట్‌లు ప్రతిఘటన మరియు భూగర్భ ఉద్యమాలలో ముఖ్యమైన పాత్రలు పోషించడంతో స్కౌటింగ్ రహస్యంగా కొనసాగింది. స్కౌట్స్ ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇవ్వడం మరియు గాయపడిన వారికి సహాయం చేయడం ద్వారా ప్రపంచ యుద్ధాల ద్వారా తమ దేశాలకు మద్దతు ఇచ్చారు. కొన్ని చోట్ల సీస్ స్కౌట్స్ కోస్ట్ గార్డ్స్ గా వ్యవహరించారు. స్కౌట్ ఉద్యమం 21వ ప్రపంచ స్కౌట్ జంబోరీ కోసం యునైటెడ్ కింగ్‌డమ్‌లో దాని మూలాలకు తిరిగి రావడం ద్వారా 2007లో దాని 100వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఒక శతాబ్దం క్రితం స్కౌటింగ్ ప్రారంభించినప్పటి నుండి 500 మిలియన్లకు పైగా యువకులు మరియు పెద్దలు స్కౌటింగ్‌లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ చురుకైన పౌరులుగా ఉండటానికి మరియు వారి కమ్యూనిటీలలో సానుకూల మార్పును సృష్టించడానికి ఉద్యమంలో చేరారు. నేడు, స్కౌటింగ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు మరియు భూభాగాల్లో 57 మిలియన్లకు పైగా స్కౌట్‌లతో ప్రపంచంలోని ప్రముఖ విద్యా యువజన ఉద్యమం. విద్య, సాహసం మరియు వినోదం యొక్క దాని ప్రత్యేక కలయిక ద్వారా మెరుగైన మరియు మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో నిమగ్నమై ఉన్న చురుకైన పౌరులుగా మారడానికి యువకులకు స్కౌటింగ్ ప్రేరణగా కొనసాగుతోంది.



**జనకమోహన్‌రావు దుంగ**
అధ్యాపకులు, శ్రీకాకుళం
8247045230

# మోడీ వర్సెస్ రాహుల్!

*అణగారిన వర్గాలకు అండగా, నిరుద్యోగులలో చైతన్యం ను రగిలింప జేయడం కోసం కృషి చేస్తూ,ప్రజాస్వామ్య వాదులకు, ఈ దేశంలో లౌకిక వాదం ను, బతికి ఉంచడానికి, కులం, మతం కన్నా ముఖ్యం ప్రేమ, సౌభ్రాతుత్వం ప్రధానమని చెప్పే రాహుల్ గాంధీ ఒక్కడే ఈ రోజు కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే పని చేస్తున్నారు. ధైర్యం గా ఎలాంటి శశభిషలు లేకుండా, నిర్భయంగా పీఎం మోడీ ని నిలదీస్తున్నారు.పీఎం కు కూడా రాహుల్ ఒక్కడే తనను నిలదీస్తున్నాడని, భావిస్తున్నట్లు కనిపిస్తున్నది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పీఎం నరేంద్ర మోడీ వర్సెస్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లా పరిస్థితి ఉండే అవకాశం ఉన్నది.*




కాంగ్రెస్ నుంచి పలువురు ఏమాత్రం జనంలో ప్రాధాన్యత లేని నేతలు, ఐటి, ఈడీ, సిబిఐ కేసుల, దాడుల, జైలు భయానికి బీజేపీ లో చేరుతున్నప్పటికి, కొందరు బీహార్ సీఎం నితీష్ కుమార్,ఇటు యూపీ లో జయంత్ చౌదరి, మహారాష్ట్ర లో అశోక్ చౌహన్ లాంటి వారు బీజేపీ తోక పట్టుకుని, కాంగ్రెస్ ను, ఇండియా కూటమిని వదిలేసి ఎన్డిఎ వైపుకు వెళు తున్నప్పటికి బీజేపీ కి లాభం, ఇటు కాంగ్రెస్ కు, ఇండియా కూటమికి నష్టం కలిగే పరిస్థితి లేదు! రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర చాలా సక్సెస్ఫుల్ గా కొనసాగుతున్నది. రాహుల్ దేశంలోని నిరుద్యోగం, అధిక ధరలు, అసమానతలు, దేశ ఆర్థిక పరిస్థితి, రైతుల సమస్యల మీద లేవనెత్తుతున్న ప్రశ్నలకు యువత లో మంచి స్పందన వస్తున్నది. అటు యూపీ లోని ప్రయాగ్ రాజ్ తదితర ప్రాంతాల్లో రాహుల్ యాత్రకు అద్భుతమైన స్పందన ఉన్నది. నిరుద్యోగ యువత తమకు జరిగిన నష్టం ను, తమని హిందూ, ముస్లిం, సిక్, ఈసాయి, అంటూ విడదీసి పబ్బం గడుపుకునే, మందిర్, మస్జీద్ రాజకీయంలో పావులను చేసి ఆడుకుంటున్న వారిని గుర్తించే దిశన యువత పయనిస్తున్నది. రాహుల్ గాంధీ ఉపన్యాసాలు వారిని జాగృతం చేసే విధంగా ఉన్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రాల్ బాండ్స్ విధానం ను సుప్రీం కోర్ట్ రద్దు చేయడం,6 వేల కోట్ల దాకా ఇలా నిధులు సేకరించిన బీజేపీ ని ఇరకాటంలో పెట్టే పరిస్థితి అయిపోయింది. ఇప్పటిదాకా ఎలక్షన్ చందా ను ఇచ్చిన ఆ కంపెనీల గుట్టు బయటపడే పరిస్థితి సుప్రీం కోర్ట్ వల్ల వచ్చింది.

## సుప్రీం మీద కోపమెందుకు?

అందుకే పీఎం మోడీ ఒక సమావేశంలో మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు కి , సుదామా( కుచేలుడు )ల పేర్లను ప్రస్థావిస్తూ, ఆయన కృష్ణుడికి ఇచ్చిన అటుకుల ను లంచం గా భావించి పిల్ వేయలేదు? నయం!ఇప్పుడు అంతా మారింది, జమానా అలా తయారు అయ్యింది!అంటూ కోర్టులో పీఐఎల్ గురించి ఎద్దేవా, చేస్తారు. ఎలక్టోరోల్ బాండ్స్ పై, అటు చండిగడ్ లో జరిగిన మేయర్ ఎన్నికల్లో ఎలక్షన్ ఆఫీసర్ తప్పుడు చర్యలతో బీజేపీ అభ్యర్థి ని గెలిపించిన తీరు ను సుప్రీం కోర్ట్ తప్పు పట్టడం, వెంటనే అక్రమ పద్ధతిలో గెలిచిన మేయర్ రాజీనామా చేయడం లాంటి వాటి వల్ల పీఎం కు కోర్ట్ అంటే కోపంగా ఉన్నట్లు కనిపిస్తున్నది. అందుకే అలాంటి అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారు, అని అప్పుడే విపక్షాల నేతలు విమర్శలు మొదలు పెట్టారు.అటు తమిళ్ నాడు లో కాంగ్రెస్ తో పొత్తులో ఉండి ఇండియా కూటమిలో ఉన్న డిఎంకే తో నటుడు కమలహాసన్ పార్టీ కలిసి రావడం, మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్ నాద్ కాంగ్రెస్ తోనే ఉంటానని, బీజేపీ లోనికి వెళ్లడం లేదని, ప్రకటించడం, యూపీ లో మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ పార్టీ సమాజ్ వాది, కాంగ్రెస్ తో, ఇండియా కూటమిలోనే ఉండి పోటీ చేస్తామని ప్రకటించడం జరిగింది. అటు ఝూర?ండ్ లో సిబు సొరెన్ పార్టీ ఝూర్ఖండ్ ముక్తి మోర్చా, అటు బీహార్ లో ఆర్జెడి కూడ ఇండియా కూటమిలోనే ఉండడం, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్, కాంగ్రెస్ నేత రాహుల్ యాత్రలో పాల్గొనడం, రాహుల్ పక్కన కూర్చుని జీపు తోలడం లాంటివి బీజేపీ కి, ముఖ్యంగా పీఎం మోడీ కి మింగుడు పడడం లేదు!

## కొంత ఊపిరి తో ప్రజాస్వామ్యం!

దేశంలో జుడిషియరీ ప్రస్తుతం న్యాయం, నిజం వైపు ఉండడం వల్ల దేశంలో కొంత ప్రజాస్వామ్యం ఊపిరి పీల్చుకుంటుంది అనక తప్పదు!ఎన్నికల కమిషన్ మొదలు ఈడీ,సిబిఐ,ఐటి లాంటి ఏజెన్సీ ల ఉచ్చు లో విపక్షాలను ఇరికించి, జైలు పాలు చేస్తూ, పార్లమెంట్ ఎన్నికలకు వెళుతున్నది బీజేపీ

## ఎలక్టరోల్ బాండ్స్ పై మోడీ సైలెంట్?

కేంద్ర ప్రభుత్వం ఎలక్టోరోల్ బాండ్ ల విషయాన్ని, కోర్ట్ తప్పు పట్టి, రద్దు చేసినప్పటికి కనీసం ఒక్క మాట మాట్లాడడం లేదు!ఇది అతి పెద్ద స్కాం కాక మరేమి అవుతుంది?దీని మీద పీఎం మోడీ మాట్లాడడం లేదు, ఎందుకు? సుమారు 6 వేల కోట్లు ఎలక్టరోల్ బాండ్స్ బీజేపీ ఖాతా లోనే పడ్డాయి!రాహుల్ మాదిరి, ఏఐసీసీ అధ్యక్షులు మల్లి కార్జున్ ఖర్గే , ప్రియాంకా గాంధీ,బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, ఢిల్లీ సీఎం కేజ్రీ వాల్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే, ఝూర?ండ్ మాజీ సీఎం సిబు సొరెన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్, ఆయన కొడుకు ఉదయనిది, కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్, ఇలా చాలా మంది, ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల నేతలు బీజేపీ ని నిలదీయడంలో ఏమాత్రం వెనుకంజ వేయడం లేదు!బీజేపీ తో వీరంతా నువ్వా! నేనా! అని తలపడే పరిస్థితి నేల మీద చాలా స్పష్టంగా కనిపిస్తున్నది!



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

# మేడారం జాతర వెళ్దాం..
# తల్లుల దీవెన తీసుకుందాం.!

*దేశంలో అతిపెద్ద కుంభమేళా మేడారం జాతర చూసేందుకు ఛత్తీస్ ఘడ్,మధ్యప్రదేశ్, ఒడిశా,మహారాష్ట్ర,కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోటికి పైగా భక్తులు తరలివస్తున్నారు.ఈ ఏడాది 21 నుంచి 24 వరకు జరుగనున్న ఈ జాతరకు వచ్చే భక్తులు ఎంత సంపన్నులైన సమ్మక్క, సారలమ్మలు ఇష్టపడే అడవిలో బుసలు కొడుతూ వడివడిగా నడిచే జంపన్న వాగులో స్నానం చేసి తరువాత సమ్మక్క-సారలమ్మ దర్శనానికి వెళ్లుతారు.ఈ వేడుకలో వెదురు కర్ర ,కుంకుమ భరణినే ఉత్సాహ మూర్తులుగా కొలుస్తారు. మొదటిరోజు గద్దెకు మూడు కిలోమీటర్ల దూరంలో దట్టమైన కీకారణ్యంలో కన్నెపల్లి గ్రామం నుంచి పూజారులు సారలమ్మను గద్దెకు తీసుకొస్తారు. కిలోమీటర్ దూరంలో ఉన్న చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను కోయవారిలో కొక్కెర వంశస్థులు సంప్రదాయలతో పూజలుచేసి ఎంతో వైభవంగా తుపాకుల మోతలతో కుంకుమ రూపంలో ఉన్న వనదేవతలను గద్దెకు చేర్చుతారు.పగిడిద్దరాజులను కొత్తగూడ మండలం పూనుగొండ నుంచి, ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం నుంచి గద్దెలకు తీసుకొస్తారు.వనదేవతలైన సమ్మక్క సారలమ్మలకు విగ్రహాలు కాని,గోపురాలు కాని,పూజలో వేదమంత్రాలు,ధూప,దీప నైవేద్యాలు,అర్చనలు చేసే అడ్డబొట్టు, పొడుగుబొట్టు అయ్యగార్లు కన్పించారు. పూజలో వన మూలికలు, బెల్లం పసుపు,కుంకుమ, కొబ్బరికాయలు,బియ్యం శ్రేష్ఠంగా భావిస్తారు.ఆదిమ జాతుల ఆత్మగౌరవ పండుగగా గుర్తించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో వనదేవతల దర్శనం కోసం ఒకరోజు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.భక్తులు కానుకలను చెల్లించుకుంటారు.కోరిన మొక్కులు వనదేవతలు తీర్చినందుకు తమ ఎత్తు బంగారం ఏమాత్రం తగ్గకుండా సమర్పిస్తారు.*

మేడారం ప్రాధాన్యత సంతరించుకోవడానికిఅనేక కథనాలు వెలువడ్డాయి. క్రీ 1083 నుంచి 1323 వరకు ఓరుగల్లు కేంద్రంగా కాకతీయులు పాలించిన సమయంలో పగిడిద్దరాజు పాలించేవారు. కన్నారం పాలించిన మేడరాజుకు మేనల్లుడని చరిత్ర చెప్పుతుంది. నాడు కోయదొరలు వేటకోసం వెళ్ళినప్పుడు గోదావరి పరివాహక ప్రాంతంలో ఓ పసి పాప కోయదొరల కంటపడింది. పాపను తమ వెంట తెచ్చుకొని మార్గశిర పౌర్ణమి నాడు సమ్మక్కగా నామకరణం చేసారు. తెచ్చుకొని పెంచిన పాప పెరిగిన కొద్దీ ఆ గూడెంలో సకల సంపద,ఊరు నిండా శుభ,ఐశ్వర్యాలతో విరాజిల్లింది. మునుపెన్నడూ లేనివిధంగా ఇంతటి శుభ గడియలు రావడానికి పాపను దేవతగా పూజించారు. యుక్త వయస్సు రాగానే మేడారం ప్రాంతాన్ని పాలిస్తున్న పగిడిద్దరాజుతో వివాహం చేసారు.ఆ పుణ్యదంపతులకు సారలమ్మ,నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు,జంపన్న అనే కుమారుడు జన్మించారు.కాకతీయ కాలంలో ఆకలితో అలమటిస్తున్న రోజుల్లో శిష్టులు కట్టమని వేదించారు. పగిడిద్దరాజు కట్టలేక నిరాశ్రయుడైన క్రమంలో కోపోద్రిక్తుడైన ప్రతాపరుద్రుని నేతృత్వంలో ఏకంగా యుద్ధం ప్రకటించారు. తన కుమార్తె నాగులమ్మ,కుమారుడు జంపన్న వీరోచితపోరాటం చేసి సరిహద్దులోని సంపెంగవాగు వద్ద వీరమరణం పొందారు. మరణవార్త విని సమ్మక్క-సారలమ్మలు కదనరంగంలోకి దూకి కాకతీయుల సైన్యాన్ని మట్టుబెట్టారు. ఓటమి ఖాయం అని భావించిన సైనికుడు (కోవర్ట్) దొంగచాటున సమ్మక్కను వెనుకనుంచి బల్లెంతో పొడువగా ,ఆమె యుద్ధభూమి నుంచి రీట్రిట్ అయ్యి చిలుకలగుట్టవైపు వెళ్ళిందని,ఇదే యుద్ధంలో సారలమ్మ కూడా వీరమరణం పొందిందని చరిత్ర చెప్పడం.1955 వరకు వందల సంఖ్యలో రెండేండ్లకొకసారి మేడారాన్ని దర్శించేవారు.ఇప్పుడు కోట్ల సంఖ్యల్లో పాల్గొని ఆదివాసులే కాకుండా సమ్మక్క-సారలమ్మను వీరవనితలుగా అందరు కొలుస్తూ పూజించే పండుగే మహాకుంభమేళా మేడారం అంటే అతిశయోక్తికాదు. ఈ జాతరకు వచ్చే భక్తులు వరంగల్ వరకు రైలు మార్గంలో వచ్చి అక్కడ నుంచి మేడారానికి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు అందుబాటులో పెట్టారు.ఈ సారి గతంలో ఆయా ప్రాంతాల్లో జరుగుచున్న సమ్మక్క జాతర కాకుండా మహిళలకు ఇచ్చిన ఫ్రీ బస్ జర్నీ కారణంగా మేడారానికి తండోపతండాలుగా బయలుదేరేందుకు సిద్ధం అయ్యారు.

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర వెళు తున్నాను.స్థానికంగా నేలచిన సమ్మక్క జాతర పుణ్యమాని రెండేళ్ళకొకసారి మాఘమాసంలో నాలుగు రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించే జాతరకు కాలినడకన,ఎడ్ల బండ్లమీద పోయి సమ్మక్క, సారలమ్మ దీవెనలు పొందే పరిస్థితి. అటువంటిది అనుకోకుండా టాక్సీ కారు డ్రైవర్ గా మేడారం కు మొదటిసారిగా 1997లో మొదటిసారిగా వెళ్ళితే పస్రా నుంచి మేడారం పోయేసరికి పొద్దుకుకింది. అయినా ట్రాఫిక్ కారణంగా తల్లి గద్దెకు పోలేక దట్టమైన అడవిలో నాడు అంబాసిడర్ కారు పార్క్ చేసి వెళ్లడం జరిగింది.నా కారులో వచ్చిన వాండ్లతో తల్లిని చూడాలని తపనతో అడుగులో అడుగేసి వాండ్లు తెచ్చుకున్న లగేజి ఎడమ,కుడి చేతితో ఈడ్చుకుంటూ ముందురోజు పడ్డ వర్షంతో జర్రున జారుతున్న బాటలో ఇసుకేత్తె కింద రాలనంత జనజాతర చూసి నివ్వెరపోయినను.నేను చుసిన కొకొండ గుట్లల్లో జరిగే కంటాత్మకూర్



సమ్మక్క జాతర పెద్దదని మురిసిన సందర్భం.నేను పోయిన రోజు సమ్మక్క గద్దెకు వస్తుందని ఎగపడి ఉరుకుతున్న జనం చూసి ఇదేంటి ఆశ్చర్యపోయినాను. అక్కడ అగుపడ్డది,వినపడ్డది అరుపులు ,కేకలు, డప్పులమోతలు అదే శివసత్తుల పూనకాలతో, కోయదొరల విన్యాసాలు నన్ను కదిలించాయి. నిజంగానే దేవుడంటే నమ్మని నేను సమ్మక్క, సారలమ్మ కు భక్తుడినైనాను. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే సీతక్క మంత్రి కావడంతో సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రాధాన్యత పెరిగింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సమీక్షలు నిర్వహిస్తూ ,భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉండాలని జిల్లా పోలీస్,ఆరోగ్య శాఖతో పాటు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది.తక్కువ సమయంలో దర్శించుకునే విఐపిలకు హెలిక్యాప్టార్ సౌకర్యం కూడా కల్పించారు.అటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఇటు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారు.రేవంత్ ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్ ప్రయాణంతో మేడారం గత జాతర కంటే భక్తులు పెరిగే అవకాశం ఉంది.



**డాక్టర్ సంగని మల్లేశ్వర్**
విభాగాధిపతి, జర్నలిజం శాఖ,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
9866255355

# వనదేవత..వనదేవత..

తరతరాల గిరిజన సాంప్రదాయాల ప్రత్యక్ష సాక్షిలా చుట్టూ సమున్నత పర్వత శ్రేణులు!
అంతర్యాలలో అంతరాలెందుకన్నట్టు ఏకలవ్యుల్ని సైతం ఆత్మీయంగా పెనవేసుకున్నట్టున్న విశాల వక్ష వృక్ష "ద్రోణులు"!!
అప్పటి దాకా మహారణ్యం!!
ఆ నాలుగు రోజుల్లో అది జనారణ్యం!!
అది మాఘ పూర్ణిమ!
చల్లని చందమామకి ఎర్రని బొట్టు పెడుతుంది ఇక్కడి పౌరుషారుణిమ!!
ధూళిమేఘాలు రాల్చే చిరుజల్లుల్లా అక్కడక్కడ చిరుపల్లెలు!
జనప్రభంజనం తాకిడికి ఆగకుండా వూగిపోతున్న లేమల్లెలు!!
భక్తి శిఖరం ఎగసి ఎగసి లావాలా ప్రవహించినట్టు....
పల్లె పల్లె కదిలి కదిలి కదలి లా ప్రభవించినట్టు.....
తండోపతండాలుగా తరలుతున్న గిరిజనతండాలు!
ఈ భక్తజనకోటి పై నీ ఎర్రటి కొంగుకప్పి కాపాడుతున్న ఘనదేవతా!
వనదేవతా! నీకు శతకోటి దండాలు!!
తమకు తాముగా వచ్చి....
తమ వెంట అన్నీ తెచ్చి....
ఏ వసతినీ ఆశించిక...
ఏదీ అసహ్యమని తలంచక.....
వెదురుకొమ్మలే నివాసాల్కె....
ఎడ్ల బండలో వనప్రవాసాల్కె....
అది స్వయం సేవకి నిదర్శనం!
అడుగడుగూ శ్రమ సంస్కృతి దర్శనం!!
అందరికి అడవి మాత్రమే!
తరచిచూస్తే భిన్న సంస్కృతులని కలగలిపే అంతస్సూత్రమే!!
అరణ్యమంతా హిరణ్యసందోహమే....
బెల్లపు మడుగుల్లో అడుగుల్లు....
వ్యక్తి వరుడ్కె భక్తి వధువై కలిసి నడిచే పారాణిపాదాల వరవళ్ళు!
హృదయ నిర్మలత్వానికి నెలవిది....
మనిషిని సాదరంగా స్వీకరించే ప్రకృతి వొడియిది!
గత చరితపు వ్యథ కథనానికి జ్ఞాపిక!
గ్రామగ్రామాన సంగ్రామస్ఫూర్తికి పీఠిక!!
మేడారం....ఆదివాసీ కాశీ!
ఆనందపారవశ్యపు నిలువెత్తు రాశి!!
మేడారం....అదోక వీరనారీ కుంకుమ భరిణ!
ఇప్పటికి వినబడుతున్న అణగారిన రణవేదన!!
ఓ యోధ అస్తమయాన....
రవి మింగిన యుద్ధమేఘం%చిచి.
తిరిగి తూర్పున ప్రసవించిన రుధిర గాథ!!
మేడారం....అది ద్వైవార్షిక తిరుపతి!
సకల గిరిజనావళికది ఘనాతిథి!!
ఇక.....
మూఢనమ్మకమంటారా.....
ఎవరిది?
ఒక అఖండ విశ్వాసపు గెలుపది.



**డా.ఎ.వి.గిరిసింహారావు**
**సీనియర్ మెడికల్ ఆఫీసర్**
**9701450819**

# మహిళలపై బీజేపీ నాయకుల దాడి

**వెంచర్‌లోకి చొరబడి దౌర్జన్యం**
**పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు**
**కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు : ఏసీపీ**





**శంషాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి)** అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్‌లోకి చొరబడి ప్లాట్లు ధ్వంసం చేసి అడ్డువచ్చిన మహిళాపై దాడి చేసిన బిజెపి నాయకులపై కేసు నమోదు చేయడంతో పాటు రిమాండ్‌కు తరలించిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. శంషాబాద్ ఎసిపి కే. శ్రీనివాస్ రావు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్. శ్రీనాథ్‌తో కలిసి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన మూసా సిద్ధిఖి అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కెఎంఆర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మండల పరిధిలోని చౌదర్ గూడ గ్రామ రెవెన్యూలో పలు వెంచర్లు నిర్మించాడు. కెఎంఆర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్‌లో డాక్టర్స్ కాలనీ ఫేజ్ -3 పేరుతో 7 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో వెంచర్ నిర్మించాడు. ఇందులో నగరానికి చెందిన వ్యక్తులు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఈ ప్లాట్‌లకు చెందిన భూమి తమది అంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి అయూబ్‌తో పాటు చౌదర్ గూడ, నర్కూడ గ్రామాలకు చెందిన బిజెపి నాయకులు మల్చలం మోహన్ రావు, మెండే కుమార్, నానవాళ కుమార్, మన్నె ప్రవీణ్, మామిళ్ల మల్లేష్, నగేష్ యాదవ్, మల్చలం లింగం మరికొంత మంది నిన్న 19వ తేదీ ప్లాట్లను ధ్వంసం చేసి చుట్టూ ఫ్రీ కాస్ట్ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్లాటు ఓనర్ అయిన మహిళలు ఫెన్సింగ్ ధ్వంసం చేయొద్దు అంటూ అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై దౌర్జన్యానికి దిగారు. మహిళలను దూషిస్తూ చంపుతామని బెదిరించారు. అక్కడ గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న అక్కడే ప్లాట్లు కొనుగోలు చేసిన సుమారు 30 - 40 మంది మహిళలు అక్కడికి చేరుకున్నారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తమ ప్లాట్లు ధ్వంసం చేశారని సదరు మహిళల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఇందులో ఏ1 అయూబ్, ఏ2 మల్చలం మోహన్ రావు, ఏ3 మండే కుమార్ యాదవ్, ఏ4 నానవాళ కుమార్ యాదవ్, ఏ5 మన్నె ప్రవీణ్, ఏ5 మామిళ్ల మల్లేష్‌లను రిమాండ్‌కు తరలించారు. మరి కొంతమంది పరారీలో ఉన్నారు. అయూబ్, మల్చలం మోహన్ రావు పై ఇప్పటికే భూ వివాదలలో పలు కేసులు నమోదయ్యాయి.

## కోస్గి పట్టణ కేంద్రంలో సీఎం రేవంత్ పర్యటన



**కొడంగల్, ఫిబ్రవరి20 (జనంసాక్షి) :** కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణ కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు గావించనున్నారు. అదేవిధంగా మహిళా సమాఖ్య సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన అనంతరం జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో ముఖ్యమంత్రి సంభాషించనున్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమం సందర్భంగా వికారాబాద్ నారాయణపేట జిల్లా కలెక్టర్లు సి నారాయణరెడ్డి, కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హెలిప్యాడ్ నుండి నేరుగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడే మహిళా సంఘాల గ్రూపుల సభ్యులచే ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులచే ముఖాముఖిలో భాగంగా మాట్లాడనున్నారు.



# అక్రమంగా నిర్బంధించారు

**రాజకీయ కక్ష సాధింపులో భాగమే అక్రమ అరెస్టులు**
**పోలీసులు తెల్ల పేపర్లపై సంతకాలు పెట్టమంటున్నారు**
**జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ నాగర్ కుంట నవీన్ రెడ్డి**

**శంషాబాద్ (జనంసాక్షి) :** రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలోని మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు నాగర్ కుంట నవీన్ రెడ్డిని పోలీసులు శంషాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి షాద్ నగర్ కోర్టుకు తరలించారు. శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో విచారణ అనంతరం ఆయనను పోలీసు వాహనంలో షాద్ నగర్ కోర్టుకు తరలించారు. అయ్యాయి. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఎందుకు అరెస్టు చేశారని అధికారులను ప్రశ్నించగా వారు చెప్పలేదు. ఇదే విషయమై నవీన్ రెడ్డిని ప్రశ్నించగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎందుకు అరెస్టు చేశారు పోలీసులు చెప్పట్లేదని, అక్రమంగా అరెస్టు చేశారని, పేపర్లపై సంతకాలు పెట్టాలని బలవంత పెడుతున్నారని, ఓ ప్రజా ప్రతినిధి హస్తం ఉందంటూ నవీన్ రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం కొంతమంది రైతులు నవీన్ రెడ్డి భూ దాష్టికాలపై లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్టు తెలుస్తుంది. సైబరాబాద్ కమిషనర్ కు పెద్ద ఎత్తున బాధితులు ఫిర్యాదు చేయడంతో ఆయా కేసులపై విచారణ జరిపినట్టు తెలుస్తుంది. ఈ సందర్భంగా పలు కేసులలో ఆయా సెక్షన్లతో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

## తల్లిదండ్రులిచ్చిన స్ఫూర్తితోనే సేవ : ముజీబ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ 10 హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్. సయ్యద్ మాజీదుల్లా హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో మెహదీ నవాజ్ జంగ్ క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 600 నుండి 700 నిరుపేద అటెండర్లకు పరిశుభ్రమైన మాంసాహార ఆహారాన్ని అందచేశారు. ఈ శుభ సందర్భంలో మీడియాతో డా.ముజీబ్ కీర్తిశేషులైన తల్లిదండ్రుల పేరుమీద ట్రస్ట్ నిర్వహిస్తూ, వారి ఆశీర్వాదంతో మరి తన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల సంపూర్ణ మద్దతుతో సర్వశక్తిమంతుడు తనను ప్రతి సామాజిక కార్యక్రమాలలో ఎన్నుకున్నందుకు శిరసు వంచి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు, జిల్లా సహ అధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్, సభ్యులు కుర్రాడి శ్రీనివాస్, మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, బొల్లిగిద్ద శంకర్, ఆస్పత్రి కార్యదర్శి శివ కుమార్, కోశాధికారి శేఖర్, జిల్లా ఏపీఆర్ఓ మహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్ మరియు హబీబ్ చావుష్ పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి పార్లమెంటు మళ్లీ కాంగ్రెస్‌దే..

**చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి**



**కాప్రా, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొంది ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్గిరి పార్లమెంటు స్థానం తిరిగి కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని ధన్పాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినీ ఇండియా లాంటి మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యంతోనే సర్వతో ముఖ అభివృద్ధి సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా తనకు కన్నతల్లిలా అక్కున చేర్చుకుని రాజకీయ ఓనమాలు దిద్దించిందని గుర్తు చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి నేతృత్వంలో మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలతో కలిసి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సారా వినోద్ ముదిరాజ్ , పడమటి మల్లారెడ్డి, గంప కృష్ణ, రాకేష్, ఉపేందర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసవం ఎంపికలో అనుకూల, ప్రతికూల ఫలితాలు



**ఖైరతాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** గర్భిణీ స్త్రీలు సహజ జననం లేదా సిజేరియన్ విభాగం(సి-సెక్షన్)లను ఎంచుకోవడం అనుకూల, ప్రతికూల ఫలితాలను కలిగి ఉటాయని ప్రముఖ ప్రసుతి వైద్యురాలు చందన గాలిదేవర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్యం, శ్రేయస్సు కోసం తగిన సమాచారంతో కూడిన నిర్ణయం అత్యంత కీలకం అన్నారు. గర్భిణీలు ఎదుర్కొనే అతి పెద్ద సమస్య, తీసుకునే ముఖ్యమైన నిర్ణయా లలో ఇది ఒకటని పేర్కొన్నారు. 75 నుండి 90 శాతం ప్రసవాలు సహజ రీతిలో జరుగుతాయన్నారు. అయినప్పటికీ, సి-సెక్షన్స్ రేటు ప్రపంచ వ్యాప్తంగా క్రమంగా పెరుగుతోందన్నారు. మొత్తం జననాలలో 20 నుండి 25 శాతం వరకు సి-సెక్షన్స్ చేరుకుందన్నారు. ప్రసూతి వైద్యులు, మంత్రసానులతో సహా ఆరోగ్య సంరక్షణ ప్రదాతలతో సంప్రదిస్తే వారు సురక్షితమైన డెలివరీ పద్ధతిని నిర్ణయిస్తారని అన్నారు.


# శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి బాధ్యత తమదే..

**ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడండి**
**శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ పిలుపు**



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని, నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తప్పకుండా తనపైనే ఉందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ అన్నారు. ఈ మేరకు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అక్కడ జరిగిన వాడి వేడి చర్చల అనంతరం శేరిలింగంపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర అభివృద్ధి, అందులో భాగంగా శేర్లింగంపల్లి నియోజకవర్గ సంక్షేమంపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాలమేరకు శేరిలింగంపల్లి నియోజక వర్గం సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని, పెండింగ్ లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతుందన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైపోయిందని, చివరకు ప్రభుత్వ పార్కు స్థలాలను సైతం వదిలిపెట్టడం లేదని, గత ప్రభుత్వ హయాంలో శేరిలింగంపల్లి నియోజక వర్గం పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని జగదీశ్వర్ గౌడ్ ఆరోపించారు. శేరిలింగంపల్లి పరిధిలోని పిజెఆర్ స్టేడియంలో క్రీడల విషయంలో తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని వాలిదాసు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం అర్హులైన నిరుపేదలకు అందేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా రాష్ట్రంలోని నిరుపేద వర్గాలకు బాసటగా నిలవాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, సదరు పథకాలు అర్హులైన ప్రతినిరుపేదకు అందేలా నియోజకవర్గం పరిధి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త నిజాయితీగా కృషి చేయాలని జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. 6 గ్యారెంటీ ల హామీ పథకాన్ని అమలు చేసే దిశగా ముందడుగు వేస్తున్న ప్రభుత్వం ఇందులో భాగంగా ఇప్పటికే పలు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుండడంతోపాటు మిగిలిన అన్ని పథకాలను వంద రోజులలోపు ప్రజలకు అందించేలా ప్రజా పాలన దరఖాస్తు నమోదు కేంద్రాల ద్వారా వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టిని సారించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద వర్గాల అభ్యున్నతికి విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజునుండే 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకంద్వారా అనేక మంది నిరుపేదలు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మెరుగైన వైద్య సదుపాయాలను, ఖరీదైన చికిత్సలను అందుకోవడానికి ఆస్కారం కలిగిందని... ఆ దిశగా వైద్య, ఆరోగ్యశాఖ యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంక్రింద ప్రస్తుత ప్రభుత్వంలో 10 లక్షల రూపాయల వరకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని వర్తింపజేయడం ద్వారా పేద ప్రజలు అత్యవసర సమయాల్లో కార్పొరేట్ వైద్యాన్ని అందుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడినవారు తప్పకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మెరుగైన ఆరోగ్యాన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో అందుకోవడం ద్వారా తమ కుటుంబాలలో వెలుగులు నింపుకోవాలని ఆకాంక్షించారు. ఇక రాష్ట్రంలో అమలవుతున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో కోట్లాదిమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవడం జరిగిందని, తద్వారా ఎంతోమంది మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రజా పాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను సాగిస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రతి బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అన్ని విధాలుగా అందేలా చూస్తామని వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు నియోజకవర్గ స్థాయిలో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని ఆయన హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజక వర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు, ఆయా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దాలి : తోటకూర



**మేడిపల్లి (జనంసాక్షి) :** పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు కార్యకర్తలు నిరంతరం కృషి చెయ్యాలని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం నాడు పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అధ్వర్యంలో కార్పొరేషన్ 3 వ డివిజన్ ఇంచార్జ్ గా అలుగువెల్లి సుదర్శన్ రెడ్డిని నియమించి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే ఎంపీ ఎన్నికలలో పీర్జాదిగూడ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీ సాధించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ చైర్మన్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మజార్,రాజు తదితరులు ఉన్నారు.

## సికిందర్‌గూడలో అక్రమ నిర్మాణాలు ధ్వంసం

**కమీషనర్ బి.శరత్ చంద్ర**



**రాజేంద్రనగర్ (జనంసాక్షి) :** అక్రమ నిర్మాణాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉరుకునే ప్రసక్తే లేదని అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ బి.శరత్ చంద్ర హెచ్చరించారు. మంగళవారం బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలోని సికిందర్ గుడా గ్రామ రెవిన్యూ కు సంబందించిన సర్వే నెం.14,15,16 లలో అక్రమంగా ఏర్పాటుచేసిన లేఔట్ ను మునిసిపల్ కమీషనర్ దగ్గరుండి, మునిసిపల్ అధికారులు పోలీస్ బందోబస్తుల నడుమ ప్రహరీ గోడ, డ్రైనేజ్ లైన్ రోడ్లను ధ్వంసం చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేషన్ లో ప్రభుత్వ భూములు, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతామని, పర్మిషన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ భూములు, అక్రమ నిర్మాణాల పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# పేదింటి అమ్మాయి పెళ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత

**ఎల్బీనగర్, ఫిబ్రవరి20 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసానికి..యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, చిత్తాపురం గ్రామానికి చెందిన పేద కుటుంబం ఎస్సీ కమ్యూనిటీ మంద ఎల్లమ్మ- చంద్రయ్య ల కూతురు మౌనిక వివాహం సందర్భంగా.. వచ్చి కలిసినారు, అందులో భాగంగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి, తెలుసుకొని,అమ్మాయి వివాహం కోసం..లిఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ మరియు ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ లిశ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్త గారి చేతుల మీదుగా మంగళ సూత్రం, మెట్టెలు,చీర, గాజులు విరాళంగా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెళ్లి కూతురు వారి కుటుంబ సభ్యులు, సామాజిక కార్యకర్త నీరూ , ఐ వి ఎఫ్ కొత్తపేట కోశాధికారి రజిత, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

# పసలేని అవిశ్వాసం మళ్ళీ గెలిచేది బిఆర్ఎస్ మేయరే

**మల్లారెడ్డి చేసిన అభివృద్ధి చిరస్థాయిగా నిలుస్తుంది**
**మేయర్ పీఠం మళ్ళీ బీఆర్ఎస్ కార్పొరేటర్ ఎక్కుతారు : జవహర్‌నగర్ తెలంగాణ ఉద్యమకారులు**



**జవహర్‌నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** జవహర్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లే... బీఆర్ఎస్పై అవిశ్వాస తీర్మానం పెట్టేరే తప్ప ఒరిగిందేమీ లేదని, 28మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్కు చెందినవారేనని, మళ్ళీ బీఆర్ఎస్ కార్పొరేటరే మేయర్ పీఠం ఎక్కుతారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి చేసిన అభివృద్ధే చిరస్థాయిగా నిలుస్తుంది జవహర్ నగర్ ఉద్యమకారులు అన్నారు. మంగళవారం జవహర్ నగర్ కార్పొరేషన్ లో తెలంగాణ ఉద్యమకారుడు పిన్నోజు సుధాకరా చారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి చేసిన అభివృద్ధి ప్రజల్లో చిరస్థాయిగా నిలుస్తుందని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమకారులు ఎప్పుడు అండగా నిలుస్తారని, పార్టీలు మారేవారు చరిత్ర హీనులుగా మిగులుతారని, బీఆర్ఎస్ ప్రభుత్వం 10ఏళ్ళలో చేసిన ప్రగతి 100ఏళ్ళ ముందుకు తీసుకెళ్ళిందని అన్నారు. పార్టీలు మారే కార్పొరేటర్లు రాజీనామా చేసి వెళ్ళాలని, లేకుంటే రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి జవహర్ నగర్ ను ప్రగతిపథంలోకి తీసుకెళ్ళి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ప్రకాశ్, నర్సింహా, సతీస్ యాదవ్, కాశీం, ఎల్లస్వామి, శ్రీరాములు, గణేష్, జలేందర్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లి, కొడుకు ఉరివేసుకుని ఆత్మహత్య

**మల్కాజిగిరి, ఫిబ్రవరి20 (జనంసాక్షి) :** తల్లి,కుమారుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.నిజామాబాద్ జిల్లాకు చెందిన స్వరూప(55) లేడీస్ టైలర్ శ్రీకాంత్ (35) ఆటో డ్రైవర్ వీరిద్దరూ తల్లి, కుమారుడు బ్రతుకుతెరువు కొరకు నగరానికి వచ్చి రెండు సంవత్సరాల క్రితం మల్కాజిగిరి లోని పటేల్ నగర్ లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు.వీరు నివాసం ఉంటున్న ఇంటి నుండి మంగళవారం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా తల్లి,కొడుకు ఇద్దరూ వేరువేరు రూములలో రెండు రోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉంటారని,ఆత్మహత్యకు గల కారణాలు ఆర్థిక ఇబ్బందులై ఉండవచ్చని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
21 ఫిబ్రవరి 2024

# 2.16 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజానర్సింహ
- కర్చల్ బోగులం పల్లి ఎత్తిపోతల పథకం ప్రారంభం
- సింగితం గ్రామంలో పిఎచ్‌సి ఏర్పాటుకు శంకుస్థాపన
- కర్చల్, రాయికోడ్ ఎక్స రోడ్డులో సబ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన
- యూసుఫ్ పూర్, ధర్మాపూర్, అల్లాపూర్, శంసోద్దీన్ పూర్
- గ్రామాలకు మెటల్ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన



**రాయికోడ్ ఫిబ్రవరి 20 జనం సాక్షి:**
మండల పరిధిలో ని కర్చల్, బొగులం పల్లి ఎత్తి పోతల పథకాన్ని మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజానర్సింహా ప్రారంభించారు. సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాయికోడ్ మండలం లో 40 పనులకు 2 కోట్ల 95 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థులకు చదువు తో పాటు క్రమశిక్షణ, సత్ ప్రవర్తన కలిగి ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఎత్తిపోతల పథకం 2.16 కోట్ల తో 2640 ఎకరాలు సాగు చేసే విధంగా, వివిధ గ్రామాలకు తాగు నీరు అందించే లక్ష్యంతో అడిషనల్ గ్రావిటీ మెయిన్స్ ను ఆయన ప్రారంభోత్సవం చేశారు. నీళ్లు దగ్గరే ఉన్న సాగు నీరు, తాగు నీరు గత ప్రభుత్వాలు ఇవ్వలేదని కనీసం రైతులను పట్టించు కున్న పాపాన పోలేదని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే 2.16 కోట్ల తో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. అదే విధంగా మండలం లో వివిధ గ్రామాలకు లింక్ రోడ్లు, తారు రోడ్లు మంజూరు కావడం జరిగిందని వాటిని కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే సింగితం నుంచి కర్చల్, నల్లంపల్లి నుంచి పీపడ్ పల్లి రోడ్డు పూర్తి కావడం జరిగిందని అయన తెలిపారు. అదేవిధంగా సింగితం గ్రామంలో హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కర్చల్ గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు కు శంకుస్థాపన చేశారు. మండలంలోని యూసుఫ్ పూర్ నుంచి ధర్మాపూర్, ధర్మాపూర్ నుంచి రాయికోడ్ వరకు మెటల్ రోడ్డు వేయిటకు ఆయన శంకుస్థాపన చేశారు. మండలంలో మాడల్ స్కూల్ రోడ్డు, చిమ్నపూర్ వద్ద సబ్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్ నుంచి రాయికోడ్ వరకు రోడ్డు వేయుటకు అల్లాపూర్ నుంచి శంషాద్దీన్ పూర్ వరకు మెటల్ ఒడ్డు వేయుటకు శకుస్థాపన చేశారు.విడతల వారిగా మండలంలో పలు అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర రావు జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడ్డి, ఎస్ ఈ ఇరిగేషన్ మురళీధర్, జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవి,జడ్పిటిసి మల్లికార్జున్ పటేల్,ఎంపీపీ మమత అశోక్, మాజీ జెడ్పిటిసి అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు, యూత్ ప్రెసిడెంట్ ఏ ప్రభాకర్, గ్రామ మాజీ సర్పంచ్‌లు కేదార్నాథ్ పటేల్. సంతోష్ కుమార్, కే శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెల్లెలిపై అన్న కత్తితో దాడి

## యువతి ప్రాణం మీదికి వచ్చిన ప్రేమవ్యవహారం



**అచ్చంపేట,20 ఫిబ్రవరి, జనంసాక్షి :**
ప్రేమ వ్యవహారానికి సంబంధించి సొంత చెల్లెలినే అన్న కత్తితో పొడిచిన ఘటన మంగళవారం నాడు అచ్చంపేట మండలం గుంపన్ పల్లి తండాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చెంచు పలుగు తండాకు చెందిన కాట్రావత్ అఖిల ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా ,గుంపన్ పల్లి గ్రామానికి చెందిన సభావత్ శ్రీరామ్ ఇంటర్ సెకండియర్ చదువు మధ్యలోనే ఆపేశాడు , వీరిద్దరూ గత మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ఇదిలావుండగా ఇరువురు కుటుంబీకుల కుల పెద్దల సమక్షంలో పెళ్లి గురించి పంచాయతీ జరిగిందని, అఖిలకు 18 సంవత్సరాలకు ఆరు నెలలు తక్కువ వయస్సు ఉండటం చేత ఇరువురు పెద్దలు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఎవరి కుటుంబం దగ్గర వారు ఉండాలని నిర్ణయించారు. ఇదే క్రమంలో నాలుగు రోజుల క్రితం అఖిల చెంచు పలుగు తండా నుండి సభావత్ శ్రీరామ్ ఊరు గుం పన్ పల్లికి తను ఒంటరిగా వచ్చిందని, ఇదే విషయాన్ని అమ్మాయి తరుపు బంధువులకు, మా ఇంటి పక్కన ఉన్న మా చిన్నమ్మలకు తెలియజేశానాని సభావట్ శ్రీరామ్ తెలిపారు. ఇదే క్రమంలో అఖిల అన్న కాట్రావత్ అఖిల్ గుంపన్ పల్లి తండాకు వచ్చి అతని చెల్లి తో గొడవ పడి తన వెంట తెచ్చుకున్న కత్తితో అఖిల నడుము పక్క భాగాన పొడిచాడు. తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో ఉన్న అఖిలను హుటాహుటిన అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని సభావట్ శ్రీరామ్ తెలిపారు. బాధితురాలు అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఘటన పై దర్యాప్తు చేస్తున్నామని అచ్చంపేట ఎస్సై రాము తెలిపారు.



# వైభవంగాఎల్లమ్మ జాతర ఉత్సవాలు

- నోటికి తాళం వేసుకుని పెద్దబోనం సమర్పించిన సాయమ్మ
- పోటెత్తిన భక్తులు
- నగ్నపునకాలతో ఊగిన లింగంపల్లి

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
నారాయణపేట జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన లింగంపల్లి రేణుకా ఎల్లమ్మ జాతర మహెూత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. 12.45 గంటలకు పూజారి సాయమ్మ పుట్టం కట్టుకుని నోటికి తాళం వేసుకుని అమ్మవారికి ప్రదక్షిణ చేసి పెద్దబోనం సమర్పించారు. అనంతరం సాయమ్మ నోట తాళం ఉడిపోవడంతో భవిష్యవాణి వినిపించారు. పెద్దబోనం అనంతరం మహిళలు పునకాలతో లింగంపల్లి ఊగిపోయింది. వేలాది మంది అమ్మవారికి బోనాలు సమర్పించి కోళ్లు, మేకను బలిచి కల్లు నైవేదించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే జోగినిలుగా మారిన మహిళలు పుట్టం(వేపాకు) ధరించి నగ్నపునకా లుపునారు. జాతర ఉత్సవాలకు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారంతా గ్రామాలకు వచ్చి అమ్మవారి మొక్కలు తీర్చుకున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సారి జాతర ఏర్పాట్లను నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.

# ఎమ్మెల్యే నిధుల్లో 30 శాతం విద్యకే కేటాయింపు

- అతిత్వరలో 30 గదులతో నూతన డిగ్రీకళాశాల భవనం
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులను ప్రారంభించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**మఖ్తల్ ఫిబ్రవరి 20 (జనం సాక్షి)**
మఖ్తల్ ప్రాంతవాసుల చిరకాల కోరిన ప్రభుత్వ డిగ్రీకళాశాల తరగతులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం ప్రారంభించారు. మినీస్టేడియం ఆవరణలో తాత్కాలిక భవనంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, మఖ్తల్ ప్రాంత పిల్లలు బయటకు వెళ్లి చదువుకునే ఇబ్బంది లేకుండా మఖ్తల్ లోనే డిగ్రీ చదువుకునేలా కళాశాల తరగతులు ప్రారంభించుకున్నామని అన్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనంలోనే డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభించామని, ఇది శాశ్వత భవనం కాదని, తాత్కాలికమేనని, ఆరునెలల్లో డిగ్రీ కళాశాల కోసం భూమిపూజ చేసుకుని త్వరగా దాదాపు ముప్పై గదుల్లో నూతన కళాశాల భవన నిర్మాణం చేసుకుందామని, ఆ తర్వాత తాత్కాలిక భవనాన్ని క్రీడల కోసం వినియోగిద్దామని సూచించారు. గత ప్రభుత్వం ప్రతిసారి చిన్న ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి, డిగ్రీ కళాశాల ప్రారంభించామని గొప్పలు చెప్పుకుని అడ్మిషన్లు లేవనే సాకుతో మఖ్తల్ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వడిగ్రీ కళాశాలను దూరం చేశారని విమర్శించారు. దాదాపు ఇరవైఏళ్లకుపైగా డిగ్రీ కళాశాల లేకుండా చేశారని, చివరకు తన చేతులమీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభించుకుంటున్నామని అన్నారు. మఖ్తల్ ప్రాంతం వనపర్తి, నాగర్ కర్నూల్, కొల్లపూర్ తరహాలో ఎడ్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దాలన్నదే తన కల అని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే నిధుల నుంచి ముప్పై శాతం విద్యకే ఖర్చు చేసేందుకు తాను సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. మఖ్తల్ ప్రాంతం నుంచి విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలన్నదే తన అభిమతమని అన్నారు. మఖ్తల్ ప్రాంతం పోటీ పరీక్షల్లో కాస్త వెనకబడి ఉందని, ఇందుకు మఖ్తల్ ప్రాంతంలో ప్రభుత్వ విద్యను గత ఇరవైఏళ్లుగా నిర్లక్ష్యం చేశారని గత పాలకులపై మండిపడ్డారు. పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన అధ్యాపకులు ఉన్నారని, విద్యార్థులకు అన్ని వసతులను త్వరలోనే కల్పిస్తామని, విద్యార్థులు సైతం ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకుని కష్టపడి చదివి, మఖ్తల్ ప్రాంత ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని సూచించారు. డిగ్రీకళాశాల నూతన భవనం పూర్తయిన తర్వాత, తిరిగి క్రీడలకోసమే ప్రస్తుత భవనాన్ని వినియోగిస్తామని అన్నారు. ఆటల్లో, చదువుల్లో మఖ్తల్ ప్రాంత విద్యార్థులు నెంబర్ వన్ కావాలన్నదే తన కోరిక అన్నారు. అనంతరం డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు మఖ్తల్ లో ప్రారంభించడంతో ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మఖ్తల్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు రవికుమార్, సీనియర్ నేతలు కట్టా సురేశ్ గుప్తా, రాజప్పగౌడ, మందుల నరేందర్, కున్ని నాగేందర్, కావలి ఆంజనేయులు, నర్సింహమూర్తి, నూరుద్దీన్, కట్టా వెంకటేశ్, బి.వెంకటేశ్, అబ్దుల్ రెహమాన్, ఫయాజ్, నగేశ్, వాకిటి శ్యామ్, చందాపూర్ వెంకట్రాములు, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవి, నర్సింహా, లాలా, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కోస్గి బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరండి

## ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి బుధవారం కోస్గిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తున్న శుభ తరుణంలో జిల్లాలోని రైతులు,అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం.పర్నిక రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 3.00గంటలకు కోస్గి పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులతో పాటు పేట -కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి తోపాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజానర్సింహా, స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొంటారన్నారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గెలిచినా రెండు నెలల లోపే జివో 69 ను అమలు చేయడం జరిగిందన్నారు.వలసల నివారించి,బీడు భూములకు సాగునీరు అందిస్తూ,పచ్చని పంట పొలాలతో జిల్లాను సస్య శ్యామలం చేసేందుకు గాను ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మించడం జరుగుతుందన్నారు.పేట ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ నేడు(బుధవారం )కొడంగల్ నియోజకవర్గం లోని కోస్గి పట్టణంలో జరిగే భారీ బహిరంగ సభకు రైతులు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# విండో చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

- కోఆప్షన్ ఎన్నిక నిర్వహించాలి
- విండో డైరెక్టర్ల డిమాండ్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
అవినీతికి పాల్పడి కోఅప్షన్ ఎన్నిక నిర్వహించకుండా తప్పించుకుంటన్న నారాయణపేట సింగిల్ విండో చైర్మన్ నర్సింహ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని మెజారిటీ డైరెక్టర్లు డిమాండ్ చేశారు. మంగళ వారం కోఆప్షన్ సభ్యుని ఎన్నిక నిర్వహిస్తామని డైరెక్టర్లకు ఎజెండా పంపి సమావేశానికి డైరెక్టర్లు హాజరయ్యామని కానీ తన బండారం బయట పడుతుందని సమావేశానికి రాకుండా ముగ్గురు డైరెక్టర్లను హాజరు కాకుండా చేసి సమావేశం వాయిదా పడేలా కుట్ర పన్నాడని ఆరోపించారు. దుకాణాల అద్దె డబ్బులో కోటి50లక్షల కుంభకొనానికి పాల్పడ్డారని దీనిపై కలెక్టర్ విచారణ జరుపతున్నారని తెలిపారు. సమావేశం నిర్వహిస్తే పదవికే దొక వస్తుందని సమావేశం నిర్వహించకుండా తప్పించు కుంటున్నాదని అన్నారు.వెంటనే సమావేశం నిర్వహించి కొఆప్షన్ ఎన్నిక తో పాటు చనిపోయిన డైరెక్టర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకునేలా సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విండో కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్.మల్లేష్, కే. నర్సింహులు, సుశీల, భింశప్ప, నర్శప్ప, నాయక్ పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేను సన్మానించిన బికేఎస్ నాయకులు

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
నారాయణపేటబికొడంగల్ ఎత్తిపోతల పథకం మంజూరు చేయించినందున బికేఎస్ నాయకులు, జలసాధన సమితి నాయకులు మంగళ వారం కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డిని సివిఆర్ భవన్‌లో సన్మానించారు. శాలువాతో సన్మానించి పుల మొక్క అందించారు. 69జి ఓ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వెంకోబా, అనంత రెడ్డి, రంగారెడ్డి, నర్సింహులు, 7వ కౌన్సిలర్ ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయించే వారిపై ఎన్‌డిపిఎస్ కేసు నమోదు చేయాలి

- జిల్లా ఎస్పీ శ్రీమతి రక్షిత కె మూర్తి
- పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలి




**వీపనగండ్ల, ఫిబ్రవరి 20 (జనం సాక్షి)**
వీపనగండ్ల మండల పోలీస్ స్టేషన్ ను మంగళవారం జిల్లా ఎస్పీ శ్రీమతి రక్షిత కే మూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సై నందికర్ కు సలహాలు, సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు గురించి ఎస్సై నందికర్ ను అడిగి తెలుసుకున్నారు. నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి పురోగతిపై సంబంధిత ఎస్సై శ్రీ నందికర్ ను అడిగి కేసుల ఫైల్స్ ను పరిశీలించారు.పోలీస్ పోలీస్ స్టేషన్లో కేసులు తగ్గించడానికి ప్రయత్నం చేయాలన్నారు. అదేవిధంగా పెండింగ్ కేసులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. క్రైమ్, మహిళలకు వ్యతిరేక కేసులను, బాలికలు తప్పిపోవడం, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 తదితర కేసులను, మిస్సింగ్ కేసులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి త్వరితగతిన మిస్సింగ్ కేసులను పరిష్కరించాలన్నారు. అరెస్టులు, చాట్ షీట్స్, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా చూసుకోవాలని, ఇలాంటి కేసులకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అన్నీ ఆధారాలు సేకరించి చార్జిషీట్ ఫైల్ చేసి నేరస్తులకు శిక్ష పడేలా చూడాల న్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను వెంటనే సిసిటిఎన్ఎస్‌లో పొందు పరచాలని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసులల వ్యవహరిస్తూ గ్రామాలలో శాంతి భద్రతలను కాపాడాలని, రాత్రిపూట గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు ధైర్యం ఇవ్వాలన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్లు

**నారాయణపేట జిల్లా బ్యూరో( జనం సాక్షి):**
కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణ కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం (నేడు)పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం నారాయణపేట, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు కోయ శ్రీ హర్ష, నారాయణరెడ్డిలు నారాయణ పేట ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుధవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు గావించనున్నారు. అదేవిధంగా మహిళా సమాఖ్య సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన అనంతరం జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో ముఖ్యమంత్రి సంభాషించనున్నారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ నుండి నేరుగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమం సందర్భంగా కొస్గి పట్టణంలోని ఫుట్ బాల్ గ్రౌండ్‌లో శిలా ఫలకాలు, స్టాళ్లను ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై కలెక్టర్లు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడే వేదిక, మహిళా సంఘాల సభ్యులు సమావేశం ఏర్పాట్ల ను పగడ్బందీగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నారాయణ పేట, వికారాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, మయాంక్ మిత్తల్, అశోక్ కుమార్, రాహుల్ శర్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పాలమూరు యూనివర్సిటీ మా బిడ్డ




- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
పాలమూరు యూనివర్సిటీ మా బిడ్డ అని, యూనివర్సిటీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తాము తీసుకుంటామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం ప్రధాన మంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు ఎంతో శుభదినమని , ప్రతి ఒక్కరూ సంతోషించాల్సిన సందర్భమని ఆయన చెప్పారు. ఆనాడు ఉద్యమ సమయంలో పాలమూరు విశ్వవిద్యాలయం పురుడు పోసుకున్నదని నాడు తెలంగాణ రాష్ట్రంలో తక్కువ విశ్వవిద్యాలయాలు ఉన్నందుకు మన తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు భారీగా నష్టం జరుగుతుందని పోరాటం చేసి మాకు కూడా విశ్వవిద్యాలయాలు కావాలని నాడు ఉద్యమం చేస్తే, ఆ సమయంలో శాతవాహన విశ్వవిద్యాలయం మరియు మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంతో పాటు పాలమూరు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు . నాటి తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో నాటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఒప్పించి పాలమూరు విశ్వవిద్యాలయానికి తీసుకొచ్చి భారీగా నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఆ సమయంలో నాటి విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి కిరణ్ కుమార్ రెడ్డితో పాలమూరు విశ్వవిద్యాలయంలో సభను ఏర్పాటు చేయడం జరిగింఎన్నారు. ఆ సమయంలో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని విశ్వవిద్యాలయం కోసం 14 కోట్ల రూపాయలు అడిగితే, వారు 18 కోట్ల రూపాయల ను మంజూరు చేశారని ఈ నిధులు మంజూరు విషయంలో నాటి రాష్ట్ర మంత్రి శ్రీమతి డికె అరుణ సహకారం కూడా ఉందని ఆయన తెలిపారు. ఈనాడు 'ప్రధాన మంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్" పథకానికి ఎంపిక కావడం శుభ పరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వెనుకబడిన మహబూబ్ నగర్ జిల్లా ఈ రోజు రాష్ట్రంలోనే కాకుండా దేశం లో కూడా మన పాలమూరు విశ్వవిద్యాలయం పేరు నిలవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు . ఇందుకు కారణమైన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. దేశ వ్యాప్తంగా 1114 విశ్వవిద్యాలయాలు ఈ యొక్క పథకానికి అప్లై చేసుకుంటే అందులో కేవలం 25 విశ్వవిద్యాలయాలు 100 కోట్లు నిధులకు ఎంపిక కావడం అందులో మన పాలమూరు విశ్వవిద్యాలయం ఉండడం సంతోషదాయకమన్నరు . "ప్రధానమంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్ పథకం" కు పాలమూరు విశ్వవిద్యాలయం ఎంపిక కావడం లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కృషి ఎంతో ఉందిని, అలాగే కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రదాన్, కిషన్ రెడ్డి కృషి ఉందని, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వివిధ శాఖల అధికారులు మరియు విశ్వవిద్యాలయ అధ్యాపకుల కృషి ఫలితమని వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎంపి మన్నె శ్రీనివాస్ రెడ్డి , జిల్లా కలెక్టర్ జి .రవి నాయక్, పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎల్ బి లక్ష్మీకాంత్ రాథోడ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కల్వరాలలో సిసి రోడ్లు

## 70 లక్షల రూపాయల నిధులతో కల్వరాల గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కసరత్తు

**వీపనగండ్ల ఫిబ్రవరి 21 (జనం సాక్షి)**
వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక పురావస్తు మరియు సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామంలో 70 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్లు వేయిస్తున్నారని గ్రామ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా జెసిబి సహాయంతో మట్టి తవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్వరాల నరసింహ, దండుగుల సుధాకర్, చిక్కేపల్లీ వెంకటయ్య, భాస్కర్ గౌడ్, మండ్ల రాముడు, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

# మేడారంలో సందడే సందడి



- భారీగా తరలివస్తున్న భక్తులు
- నేటినుంచి నాలుగురోజుల జాతర
- పూనుగొండ్ల పగిడిద్దరాజు గుడిలో ప్రత్యేక పూజలు
- గద్దెల వద్దకు బయలుదేరిన పగిడిద్దరాజు
- భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం





**మహబూబాబాద్, ములుగు, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):**
సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. వనదేవరుడు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును, ఆయన తనయుడు జంపన్నను మంగళవారం మేడారం తీసుకెళ్లేందుకు పూజారులు ఏర్పాట్లు చేశారు. గిరిజన సంప్రదాయాలు, శివసత్తుల పూనకాల మధ్య మహబూ బాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని దేవాలయం నుంచి పగిడిద్దరాజును, ములుగు జిల్లా కన్నెపల్లి నుంచి జంపన్నను మేడారం తీసుకెళ్లనున్నారు. బుధవారం నాడు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దె పైకి తీసుకురానున్న నేపథ్యంలో... అమ్మవార్లను దర్శించ ుకునేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మవార్లకు తులాభరం తో బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా వడిబియ్యం, చీర, సారెతో పూజలు చేశారు. భక్తులు పూనకాలతో పరవశిస్తు అమ్మవార్ల దీవెనల కోసం గద్దెల వద్దకు చేరుకుంటున్నారు మేడారం జనసందోహంతో ఆధ్యాత్మిక భక్తి భావనతో పులకించి పోతోంది. మహబూ బాబాద్ జిల్లాలోని గంగారం మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజు గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. పగిడిద్దరాజును తీసుకుని కోయ పూజారులు అటవీ మార్గంలో కాలినడకన మేడారంకు బయలుదేరి వెళ్లనున్నారు. రాత్రికి పగిడిద్దరాజు మేడారంకు రానున్నారు. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క - సారలమ్మ మేడారం జాతర ఈనెల 21 నుంచి నాలుగు రోజుల పాటు ఘనంగా జరుగనుంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకోసారి జరుగుతుంది. జాతరకు ఒకరోజు ముందే పగిడిద్దరాజును మేడారంకు తీసుకువస్తారు. అనంతరం సారలమ్మ, గోవిందరాజును గ్దదెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 22న సమ్మక్క దేవతను గద్దెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 23న భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఫిబ్రవరి 24న దేవతల వనప్రవేశం ఉండగా... ఫిబ్రవరి 28వ జాతర పూజలు ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.మంగళవారం ఉదయం పూనుగొండ్ల సమీపంలోని దేవుడి గుట్ట నుంచి పగిడిద్ద రాజును తీసుకొచ్చి దేవాలయంలో ప్రతిష్ఠిస్తారు. శాంతి పూజా కార్యక్రమాల అనంతరం పెన్క వంశీయులు పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా సిద్ధం చేసారు. ఆ పడగ రూపాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం పూనుగొండ్ల అడవుల నుంచి మేడారానికి కాలినడకన తీసుకెళ్లే కార్యక్రమం మొదలు పెట్టారు. పూజారి జగ్గారావుతోపాటు మరో పదిమంది పూజారులు, పలువురు భక్తులు పగడిద్దరాజు వెంట బయలు దేరుతారు. మధ్యలో గోవింద రావుపేట మండలం కర్లపల్లి లక్ష్మీపురం లోని పెన్క వంశీయుల వద్ద మంగళవారం రాత్రి విడిది కల్పిస్తారు. బుధవారం ఉదయాన్నే బయలుదేరి రాత్రి సారలమ్మ చేరుకునే సమయానికి పగిడిద్దరాజును మేడారం గద్దెకు చేరుస్తామని ప్రధాన పూజారులు చెప్పారు. సమ్మక్క తనయుడు, సారలమ్మ సోదరుడైన జంపన్నను కన్నెపల్లి నుంచి పోలెబోయిన వంశస్థులు మేడారం తీసుకు రానున్నారు. పూజారి పోలెబోయిన సత్యం ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మంగళవారం సాయంత్రం 5 గంటలకు కన్నెపల్లి నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు మేడారానికి చేరుకుంటారు. ఆ వెంటనే లక్షల మంది భక్తుల మధ్య జంపన్నను గద్దెపై ప్రతిష్ఠిస్తారు. మహాజాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలనుంచి లక్షలాదిగా వచ్చే భక్తులతో మేడారం కుంభమేలాను తలపిస్తుంది. నాలుగు రోజులపాటు గిరిజన సంప్రదాయాల ప్రకారం దీనిని నిర్వహిస్తారు. ఈనెల 21న కన్నెపల్లి నుంచి సారలమ్మను, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులను పూజారులు తీసుకొచ్చి గ్దదెలపై ప్రతిష్ఠిస్తారు. దీంతో తొలిరోజు ఘట్టం పూర్తవుతుంది. 22న కీలక ఘట్టమైన సమ్మక్కను చిలుకలగుట్ట మీద నుంచి తీసుకొచ్చి గ్దదెపై ప్రతిష్ఠిస్తారు. కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్క ఆగమనాన్ని చూసి భక్తులు పులకించిపోతారు. పోలీసులు, జిల్లా అది ,కారుల సమక్షంలో గాల్లోకి కాల్పులు జరిపి ఘన స్వాగతం పలుకుతారు. 23న సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న గ్దదెలపై కొలువై భక్తులకు దర్శనమిస్తారు. 24న దేవతల వనప్రవేశం ఉంటుంది.

**అందుబాటులోకి 'మై మేడారం' యాప్**

మేడారం జాతరకు వెళుతున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాల వివరాలను తెలిపేందుకు ప్రత్యేకంగా 'మై మేడారం' పేరుతో యాప్‌ను రూపొందించినట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మీడియాకు తెలిపింది. జాతరలో కుటుంబ సభ్యులు తప్పిపోయినా, ఇతరత్రా ఏదైనా సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించేందుకు, తాగునీరు, వైద్యసేవలు, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, స్నాన ఘాట్‌లు తదితర వివరాలన్నీ యాప్‌లో తెలుసుకోవచ్చని వివరించింది.

**నాలుగురోజులు సెలవులు**

మేడారం మహా జాతర మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుంది. ప్రతి రెండేండ్లకోసారి జరిగే ఈ గిరిజన పండుగకు సుమారు రెండు కోట్ల మంది తరలి రానున్నారు. వనదేవతల ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. దీంతో ములుగు జిల్లాలో జాతర జరుగనున్న నాలుగు రోజుల పాటు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ నెల 21, 22, 23, 24 తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కార్యాలయాలు పనిచేయవని తెలిపింది. ఈమేరకు జిల్లా కలెక్టరు ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు రోజులపాటు విద్యాసంస్థలను మూసి వేయాలని ఆదేశించారు.

**మేడారంలో అత్యవసర ఆస్పత్రి**
**టీటీడీ కళ్యాణ మండపంలో 50 బెడ్స్ దవాఖాన**
**30 చోట్ల ఉచిత హెల్త్‌క్యాంప్‌లు**

మేడారం జాతరకు భక్తులు క్యూ కట్టారు ఇప్పటికే 50 లక్షలకు పైగా మంది భక్తులు మేడారం దర్శించుకున్నారు. బుధవారం నుంచి మేడారం మహాజాతర మొదలు కాబోతుండటంతో భక్తులు పోటెత్తనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా వైద్యఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో 50 బెడ్స్ దవాఖాన ఏర్పాటు చేశారు. 30 చోట్ల ఉచిత హెల్త్‌క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. భక్తులకు 24 గంటల పాటు వైద్య సౌకర్యం అందించనున్నారు. అన్ని చోట్లా కలిపి 150 మంది స్పెషలిస్టు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. జాతర పరిసర ప్రాంతాల్లో 4 బెడ్స్‌తో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో చోట ముగ్గురు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. డాక్టర్లు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి రెండు వేల మందికి పైగా జాతరలో డ్యూటీలు నిర్వహిస్తారని డీఎంఅండ్‌హెచ్‌వో అప్పయ్య ప్రకటించారు. అత్యవసరంగా రోగులను తరలించేందుకు 108 అంబులెన్సులు 15 అందుబాటులో ఉంచారు. అలాగే టెంపరరీ బ్లడ్ బ్యాంక్ కూడా ఏర్పాటు చేశారు. మహజాతర సందర్భంగా సరిపోయే బెడ్స్,మెడిసిన్, ఇంజెక్షన్ లను అందుబాటులో ఉంచారు అధికారులు. జాతర సమయంలో ప్రతి రోజు 300 మందికి పైగా ఔట్ పేషంట్లకు ట్రీట్మెంట్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఫిడ్స్ , స్పృహ తప్పి పోవడం , ఆల్కహాల్ ఇంటాక్సిక్, తల గాయాలతో హెల్త్ క్యాంపస్ కు వస్తున్నారు బాధితులు.ఎమ్జంగ÷న్సీ కేసులను ములుగు టౌన్ కు తరలిస్తున్నారు వైద్యులు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుండటంతో భక్తులు తమ జాగ్రత్తలో ఉండాలని సూచిస్తున్నారు వైద్యులు. మేడారం జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. మౌలిక వసతులు, నిర్వహణ కోసం రూ.105 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే.

**అమ్మవార్లకు రూపం లేదు**
**గద్దెల ఏర్పాటు వద్దనే పూజలు**

సమ్మక్క, సారలమ్మలకు రూపం లేదు. సమ్మక్క గద్దెను ఆనుకునే భారీ నెమలి నార చెట్టు ఉండేది. గతంలో ఈ నారెపుచెట్టుకే పసుపు కుంకుమ పెట్టి సమ్మక్కగా భావించే వారు. వడ్డెలు (పూజారులు) చిలకల గట్టు నుంచి కుంకుమ భరిణె తీసుకొచ్చి నార చెట్టు వద్దే ఉంచి పూజలు చేసేవారు. చెట్టు, పుట్టలే గిరిజనులకు సమ్మక్క సారక్కలు. ఇప్పటికీ ఆదివాసీ గూడేంలో మేడారం గ్దదెలను పోలిన ఇంటి అరుగులు ఉంటాయి. కాల క్రమేణా గ్దదెల మీద సమ్మక్క సారక్కలు సింహం, పులి మీద ఉన్నట్లుగా ఫోటోలు ముద్రించి జాతరలో అమ్మకాలు చేశారు. ఆ ఫోటోలే భక్తుల మదిలో నిలిచిపోయాయి. భక్తుల సంఖ్య పెరగడంతో గద్దెల ప్రాంగణంలో బండలు వేశారు. సమ్మక్క సారలమ్మ గద్దెలపై భాగంలోనూ పాలిష్ బండలు అమర్చారు. 1990 కన్నా ముందు జాతర కొచ్చే గిరిజనులు, గ్రామీణులు నేరుగా గ్దదెలపైకి వెళ్లి తాము తెచ్చిన బంగారం, వడిబియ్యం, ఇతరకానుకలు సమర్పించుకునే వారు. భక్తులు అమ్మవార్ల గ్దదెలను స్వయంగా తాకి సంతృప్తిగా మొక్కులు తీర్చుకునేవారు. రానురాను భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో జాతర సమయంలో గ్దదెల చుట్టూ కట్టెలతో బారికేడ్లు కట్టారు. బారికేడ్ల బయట నుంచి అమ్మవార్లను దర్శించుకుని తాము తెచ్చిన బెల్లం, కుడకలు,వడిబియ్యం దూరంనుంచే గద్దెలపైకి వేసేవారు. ఆ సమయంలో కట్టెల బారికేడ్ల వద్ద బందోబస్తులో ఉండే పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, ఆదివాసీ గిరిజన సంఘం కార్యకర్తలకు కొబ్బరికాయలు, బెల్లం తగిలి గాయాలయ్యేవి. ఈ ప్రమాదాలను నివారించేందుకు 2002 లో అప్పటి జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మ గ్దదెల చుట్టూ ఎత్తైన గ్రిల్స్ లను నిర్మించాలని నిర్ణయించింది. ప్రస్తుతం గద్దెల చుట్టూ ఉన్న ఎత్తైన గ్రిల్స్ అప్పుడు ఏర్పాటు చేసినవే. 90వ దశకం ముందు కేవలం మూడు అడుగుల ఎత్తులో ఉన్న గద్దెలపై తొమ్మిది అడుగుల ఎత్తులో సమ్మక్క ప్రతిరూపం ఉండేది. జాతర రెండో రోజు నెమలి నార చెట్టు పై నాగు పాము వస్తుందని ఆదివాసులు చెబుతారు. ఈ చెట్టు బెరడు తీసుకుని వాటి పొడి పిల్లలకు పాలలో వేసి తాగిస్తే ఆరోగ్యంగా ఉంటారనే నమ్మకంతో భక్తులంతా ఆ చెట్టు బెరడు తీసుకెళ్లేవారు. ఆ భారీ వృక్షం క్రమంగా ఎండిపోవడంతో ప్రస్తుతం తిరిగి మరో చెట్టుని ఫెన్సింగ్ వేసి జాగ్రత్తగా పెంచుతున్నారు. అమ్మవార్ల బొమ్మలు జాతర్లలో అమ్ముతున్నప్పటికీ చాలా మంది నెమలినార చెట్టు ను సమ్మక్క దేవతగా భావిస్తారు. సారలమ్మ ప్రతిరూపమైన గద్దె దాదాపు పదిహేను అడుగుల ఎత్తులో ఉండేది. దీనిచుట్టూ ఏవిధమైన అలంకారాలుండేవి కావు. క్రమక్రమంగా గద్దెలకు తాము తెచ్చిన చీరలతో అలంకరించడం ప్రారంభించారు. ఇలా తొలినాళ్లలో చాలా నిరాడంబరంగా ఉండే సమ్మక్క సారలమ్మ ల గ్దదెలు, క్రమక్రమంగా ఎత్తైన అరుగుల నిర్మాణం, అనంతర కాలంలో వీటి చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు

# జనగామా ను అభివృద్ధి చేసి చూపిస్తా!

- జనగామ అభివృద్ధి పనుల కోసం 25కోట్ల నిధులు మంజూరి..
- జనగామ బతుకమ్మ కుంట లో ఓపెన్ జిమ్..
- చేర్యాలకు గోదావరి నీరు తెచ్చి అభివృద్ధి చేసిందే నేను..
- పల్లాకు దొంగ ఓట్ల పల్లా అని ముద్దు పేరు..
- 18000 ఓట్ల బోగస్ ఓట్లతో గెలిచావ్..
- నైతిక విజయం నాదే! కొమ్మూరి..
- దొంగ ఓట్లతో గెలిచిన నువ్వు చర్చ కు సిద్ధమా అని సవాల్!
- ఎన్నికల్లో మోసం చేసి గెలిచావ్, కబ్జారాయుడివి!
- కొమ్మూరి ప్రతాప్ రెడ్డి..




**జనగామ బ్యూరో, ఫిబ్రవరి 20(జనంసాక్షి ):**
జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా మీద నిప్పులు చెరుగుతూ జనగామ అభివృద్ధి పై మాట్లాడారు. పల్లా దొంగ ఓట్లతో గెలిచారని, అనురాగ్ యూనివర్సిటీ నుండి విద్యార్థుల ను జనగామ కు ఎలక్షన్ సమయం లో తీసుకొచ్చి ఓట్లు నమోదు చేయించుకొని గెలిచాడని, కబ్జారాయుడని, అన్నారు.తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీ అని, కేసీర్ కాదని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులను తీసుకొచ్చి 18000 బోగస్ ఓట్లతో గెలిచావన్నారు. కాంగ్రెస్ పార్టీ కి చెందిన 6000 ఓట్లను తీసేసావ్ అని, మొత్తం 24000 ఓట్ల మోసం అని, నా మీద 16000 ఓట్ల మెజారిటీ తో గెలిచావ్ అని నైతిక విజయం నాదే అన్నారు. ఈ విషయం లో చర్చకు సిద్దామని సవాల్ విసిరారు. జనగామ లో 2014 కి ముందు ఏ ఉద్యమం లో పల్లా పాల్గొనలేదని, నేను ఎప్పటి నుండో ఉద్యమ కారుడినని అన్నారు. తదుపరి జనగామ పట్టణ పల్లె ప్రాంతంలో అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, త్రాగు, సాగునీరుకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.ప్రజలకు ఆదర్శంగా ఉండవలసిన ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నాడని, 25 కోట్లతో పట్టణాన్ని సుందరీకరణ చేసేందుకు అభివృద్ధి పనులు చేస్తామన్నారు. 3కోట్ల 90లక్షల రూపాయలు జనగామ పట్టణ, వివిధ మండల అభివృద్ధి కై కేటాయిం చారాని, ఇందులో జనగామ పట్టణానికి 1కోటి 40 లక్షలని, వీటిని రోడ్లకు, మౌలిక వసతులకు వాడుతాన న్నారు. పాఠశాలకు సంబందించిన వాటిలో ముఖ్యంగా మరుగుదొడ్లకు ఎక్కువ ప్రాదాన్యత ఇచ్చానన్నారు. ఇందుకు కోటి రూపాయలు మంజూరు అయ్యయన్నారు. ఇంతకు ముందు చేర్యాలకు గోదావరి నీరు తెచ్చిందే నేనని, దానివల్లనే భూముల రేట్లు పెరిగాయని అన్నారు. ఇప్పుడు ఇంకా అభివృద్ధి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో జనగామ సీనియర్ నాయకులు పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, సర్వల నర్సింగరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిరా, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శివరాజ్ యాదవ్ ,16వ వార్డు కౌన్సిలర్ గాదేపాక రామచంద్రం,వంగాల కల్యాణి,బొట్ల నర్సింగరావు,మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్దిరాములు,డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి,లింగాల నర్సిరెడ్డి, జమాల్ షరీఫ్,వేముల మల్లేశం,గొలుసుల దుర్గేష్,అండాలు, మున్నీ బేగం,సంజీవ రెడ్డి, మచ్చ ప్రవీణ్, మిద్దెపాక స్టాలిన్,తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**రేగొండ (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో మౌలిక వసతులను కల్పించి గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం రేగొండ మండలం పరిధిలోని రంగయ్యపల్లి సిసి రోడ్డు పనులకు 20 లక్షలు, రేపాక సిసి రోడ్డు పనులకు 30 లక్షలు, నాగుర్లపల్లి సిసి రోడ్డు పనులకు 10 లక్షలు, రాయపల్లి సిసి రోడ్డు పనులకు 10 లక్షలు, రేపాకపల్లి సిసి రోడ్డు పనులకు 20 లక్షలు, రేగొండ మండల కేంద్రంలో 50 లక్షల సిసి రోడ్డు,నారాయణపురం సీసీ రోడ్డుకు 10 లక్షలు పనులకు ఎమ్మెల్యే పర్యటన చేపట్టి అభివృద్ధి పనులకు శంకుస్థాపనల ప్రారంభోత్సవాలు చేశారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలికారు. అనంతరం రేగొండ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేయడం జరిగింది. మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ గ్రామాల అభ్యున్నత కోసం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు ప్రజలను మాయమాటలతో నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు అన్ని వర్గాల ప్రజలను పార్టీలకు అతీతంగా సంక్షేమం ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు నిత్యం గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యల సాధన కోసం కృషి చేయాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడితే ఉపేక్షించేది లేదని హెచ్చరిం చారు. అభివృద్ధి పనుల కోసం ప్రజలు అధికారులకు సహకరించి అభివృద్ధి పనులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇప్ప కాయల నర్సయ్య,ఎంపీపీ పున్నమ్ లక్ష్మీ రవి, యూత్ అధ్యక్షుడు కనకం రమేష్,పట్టెం శంకర్,దేవేందర్,వినోద్ కుమార్, భలేరావు మనోహర్ రావు, ఓంకార్, శ్రీను, సమ్మయ్య, పానీ,అశోక్,భద్రయ్య,ఉపేందర్, షబీర్,సంతోష్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారాల ఇలవేల్పు సేవాలాల్ మహారాజ్

## స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## ఘనంగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు



**స్టేషన్ ఘన్పూర్ , ఫిబ్రవరి 20 , (జనంసాక్షి) :**
బంజారాల ఇలవేల్పు సేవాలాల్ మహారాజ్ అనిమాజీ ఉప ముఖ్య మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని శివునిపెల్లి కెఆర్‌గార్డెన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే అధికారికంగా నిర్వహించబడు తున్న శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి ఉత్సవాలు నియోజకవర్గకమిటీ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగాహాజరై కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కడియం శ్రీహరి మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు రాజకీయాలకతీతంగా జరుపుకోవడం సంతోషంగా ఉంద న్నారు. బంజారాలు, గిరిజనులు తమ పిల్లలను తప్పక చదివించాలని, వారిని గొప్ప ప్రయోజకులుగా తయారు చేయడంలో తల్లిదండ్రులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ప్రపంచంలో బంజారా లు ఎక్కడ ఉన్నా ఒకే భాష మాట్లాడతారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తండాలను గ్రామపంచాయతీ లుగాఏర్పా టుచేసి తండాలను ఎంతో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ అన్ని మతాలను గౌరవిస్తూ అన్ని పండుగలను అధికారికంగా నిర్వహించడం జరి గింది అన్నారు. కెసిఆర్ నాయకత్వంలో 2018 నుంచి సేవాలాల్ మహారాజ్ జయంతి అధికారికంగా నిర్వహిం చడం జరుగుతుందన్నారు. మహానుభావుల జయంతి ఉత్సవాలు అధికారంగా నిర్వహించిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి నియోజ కవర్గానికి బంజారా భవన్లు మంజూరు చేయడం జరి గిందనిఅన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా తాను మంత్రిగా ఉండి నియోజక వర్గానికి పెద్ద ఎత్తున నిధులుతీసుకువచ్చి నియోజకవర్గప్రజల అభివృద్ధితో పాటు తండాలకు బిటి రోడ్లు, సిసి రోడ్లు,పాఠశాల భవ నాలు నిర్మించడం జరిగింది అన్నారు. మద్యానికి బాని సై ఎందరో తమ కుటుంబా లను ఆగం చేసుకుంటున్నా రని, బంజారాలు మద్యం తాగుడుకు దూరంగా ఉండి తమపిల్లలను ఉన్నత చదువులు చదివించా లన్నారు. ఈసమావేశంలో ఆర్డీవో వాసం రామ్మూర్తి, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు, డిటి విజయ్, ఆర్ఐ అర్జున్, చిల్పూర్ మండలంవైస్ ఎంపీపీ భూఖ్య సరిత నరసింహ, ఎంపీ టీసీలు బూర్ల లతా శంకర్, మునిగల రాజు, గన్ను నరసింహులు, గుర్రం రాజు, నాయకులు బూర్ల శంకర్, కోతి రాములు, సుధాకర్, వెంకటస్వామి, కనకయ్య, జీడి ప్రసాద్, బూరు నరేందర్, తెల్లాకుల రామకృష్ణ, బంజారా నాయకులు రాజేష్ నాయక్, లకావత్ చిరంజీవి నాయక్, భూక్య రమేష్ నాయక్, బానోత్ వసంత్ నాయక్,భూక్య స్వామినాయక్,రాజేష్ నాయ క్,శ్రీనివాస్ నాయక్, రవీందర్, అరుణ్ నాయక్, రవి, సంజీవ నాయక్, హుస్సేన్ నాయక్, రాజకుమార్ తది తరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి బంజారాలతో కలిసి భోజనం చేశారు.



## సత్య సంకల్ప సేవా సంస్థ పోస్టర్‌లను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..

**ఖమ్మం టౌన్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):**
రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా సత్య సంకల్ప సేవా సంస్థ పోస్టర్ లు ఆవిష్కరించడం జరిగింది . శీనన్న చేతుల మీదుగా మా సేవా సంస్థ పోస్టర్ ఆవిష్కరించడం మాకు చాలా ఆనందంగా ఉందని సత్య సంకల్ప సేవా సంస్థ నేషనల్ ఫౌండర్ & చైర్మన్ రెంటపల్లి మాధవి లత, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొత్తకొండ ఉమాదేవి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్, నేషనల్ జనరల్ సెక్రెటరీ కుప్పిరాల స్వప్న , నేషనల్ జాయింట్ సెక్రెటరీ కోల ముత్యాల అరుణ, ట్రెజరర్ కొంగర నర్మదా , నేషనల్ ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ కుపిరాల విజయ్ కుమార్ , నేషనల్ కోఆర్డినేటర్ పుచ్చకాయల ప్రమీల, డిస్టిక్ కో ఆర్డినేటర్ ఉమాదేవి , భూక్య మౌనిక హర్షం వ్యక్తం చేశారు. పేద , నిరుపేద ప్రజలకు సహాయం చేయడానికి , ఒంటరి మహిళలకు ఉపాధి కల్పించడానికి మరియు మానవ హక్కుల పరిరక్షణ కోసం మరియు పలు సేవా కార్యక్రమాలు కోసం ఈ సంస్థ ఎంతో దోహదపడుతుందన్నారు.



## నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మంటౌన్,ఫిబ్రవరి 20 (జనంసాక్షి):**
ఖమ్మం నగరంలో మాజి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మంగళవారం పర్యటించారు.ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, శుభకార్యాలకు హాజరై ఆశీర్వాదాలు, పరామర్శలు తదితర కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఇటివలే వివాహం జరిగిన ఖమ్మం కార్పొరేటర్ చామకురి వెంకన్న కుమార్తె ప్రశాంతి - లక్ష్మణ రావు లను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కలిసి నూతన దంపతులను ఆశీర్వదించారు.మమత ఆసుపత్రిలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న ఏపూరి కృష్ణారావు ని కలిసి పరామర్శించారు. ఖమ్మం గాంధీ చౌక్ లోని శ్రీ వరప్రదాత షిరిడీ సాయిబాబా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని బాబా ఆశీర్వాదం తీసుకున్నారు.కార్యక్రమంలో కూరాకుల నాగభూషణం, భీరెడ్డి నాగచంద్రా రెడ్డి, కార్పొరేటర్ పసుమర్తి రాంమోహన్, వేములపల్లి వెంకన్న, కన్నం ప్రసన్న కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, గుత్తా రవి, గౌరోజు వసంత్, బిక్కసాని జస్వంత్, బండారు శ్రీనివాస్, పరమేష్ తదితరులు ఉన్నారు.

## కోర్టు ఆదేశాలతో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై కేసు నమోదు

**హుజూర్ నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):**
హుజూర్ నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జారీ చేసిన ఆదేశాలతో భవానిపురం లోని దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ ఎం.డి. బంగారు రాజు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నాగమల్లేశ్వరరావు తదితర 09 మంది పై పాలకీడు పోలీస్ స్టేషన్ నందు వివిధ సెక్షన్ల కింద క్రైమ్ నెంబర్ 28 / 2024 ద్వారా కేసు నమోదు చేసినట్లు బాధితుల తరపున న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాల్లోకి వెళితే పాలకీడు మండలంలోని రావి పహాడ్ గ్రామానికి చెందిన కల్లేటి వెంకయ్యకు అప్పటి ప్రభుత్వం 1975 సంవత్సరంలో రావిపాడు రెవిన్యూ లోని సర్వే నెంబర్లు 31/7, 31 / 18 నందు తన జీవనోపాధి నిమిత్తం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. అప్పటినుండి అతను, అతని కుటుంబ సభ్యులు, ఆ వ్యవసాయ భూమిని పోడుకొట్టుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధిని పొందుతున్నారు. అక్కడికి సమీపంలోని దక్కన్ ఫ్యాక్టరీ యాజమాన్యం తన ఫ్యాక్టరీని విస్తరింప చేయుట కొరకు ఈ భూమి వారికి అనుకూలంగా ఉన్నందున ఎలాగైనా దాన్ని కాజేయాలని రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూమిని ప్రభుత్వానికి స్వాధీన పరుస్తున్నట్లుగా వేరే వ్యక్తి చేత దరఖాస్తు తీసుకొని ఆ భూమిని దక్కన్ ఫ్యాక్టరీకి కేటాయిస్తున్నట్లుగా రికార్డులు తయారు చేశారు. కానీ భూమి సదరు కల్లేటి వెంకయ్య వారసుల స్వాధీన అనుభవంలో ఇప్పటికీ ఉన్నది. దక్కన్ ఫ్యాక్టరీ యాజమాన్యం తరచుగా వీరిని ఆటంక పరుస్తూ భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకొనుట కొరకు ప్రయత్నం చేయుచుండగా కల్లేటి వెంకయ్య వారసులైన అతని కుమారులు, కుమార్తెలు కల్లేటి పెద్ద సైదులు, కల్లేటి చిన్న సైదులు, గడగంట్ల సైదమ్మ, నీలం గురవమ్మ, గడగంట్ల లక్ష్మి అనువారలు పాలకీడు పోలీస్ స్టేషన్లో దక్కన్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయకపోవడంతో సూర్యాపేట ఎస్పీ, కోదాడ డిఎస్పి, హుజూర్నగర్ సి.ఐ లకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదును పంపారు. అయినప్పటికీ పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయకపోవడంతో వారు తమ న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయించి కంప్లైంట్ దాఖలు చేశారు. కంప్లైంట్ ను పరిశీలించిన న్యాయస్థానం పాలకీడు పోలీసులను దక్కన్ యాజమాన్యంపై కేసు నమోదు చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల ప్రకారం పాలకీడు పోలీసులు దక్కన్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు కార్యక్రమం విజయవంతం చేయండి




దేవరకొండ ఫిబ్రవరి 20 జనంసాక్షి
అప్పుడే పుట్టిన పసికందులను వదిలి వేయడం, బాల్యవివాహాలు జరిపించ డం, బాల కార్మికులకు పనిలో ఉంచటం మరియు స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నల్గొండ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి సూచనల మేరకు ఈ నెల 21వ తేదీ నఉదయం 10 గంటలకు చందంపేట మండలం కొత్త కంబాలపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే న్యాయ విజ్ఞాన సదస్సుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి సూచనల మేరకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# మధిర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సూరంశెట్టి కిషోర్?



### కలిసి వచ్చిన రిజర్వేషన్

### పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రకటన

**మధిర ఆర్‌సి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :**
మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ కి దక్కనుంది. రాష్ట్రంలో ఉన్న 197 మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేయటం జరుగుతుందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రకటించడంతో పాటు టిఆర్ఎస్ ప్రభుత్వంలో నియమించిన మధిర మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్ ఏర్పాటు చేసి మధిర మార్కెట్ కమిటీ బిసి సామాజిక వర్గానికి కేటాయించింది. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న సూరం శెట్టి కిషోర్ కి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ దక్కనుంది. నియోజకవర్గంలో మధిర ఎర్రుపాలెం బోనకల్లు మండలాల పరిధిలో మధిర మార్కెట్ కమిటీ ఉంది. అదే విధంగా నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అతిపెద్ద నామినేటెడ్ పదవి. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ ఏర్పాటు చేసింది. అంతే కాకుండా ఐదు విడతలకు ఒకేసారి రిజర్వేషన్లు ప్రకటించారు. మొదటి విడత జనరల్ కి కేటాయించగా, రెండోవడత, మూడో విడత, నాలుగో విడత బీసీకి కేటాయించారు. ఐదో విడత జనరల్ మహిళకు కేటాయించారు. బిఆర్ఎస్ పాలనలో మార్కెట్ కి రెండు పాలకవర్గాలు పూర్తయి, మూడవ పాలకవర్గం కొనసాగుతూ రద్దు అయినది.గతంలో తీసిన రిజర్వేషన్ల ప్రకారం నాల్గోసారి కూడా బీసీ సామాజిక వర్గానికి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వు చేయబడింది. కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీల రిజర్వేషన్లు ఎత్తివేయకుండా యధావిధిగా చేసినందుకు సిద్ధమైంది. దీనిలో భాగంగానే మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బీసీ సామాజిక వర్గానికి కేటాయించారు. దీని ప్రకారం ప్రస్తుతం మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా ఉన్న సూరంశెట్టి కిషోర్ కి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వివరించబోతుంది. సూరం శెట్టి కిషోర్ 10 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా మండలంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి పార్టీ క్యాడర్ను కాపాడారు. బిఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టినా, వారికి మనోధైర్యాన్ని కల్పించి అండగా నిలిచారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక పోలీస్ అధికారి ద్వారా టిఆర్ఎస్ పార్టీలో చేరితే మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్పిస్తానని టిఆర్ఎస్ నాయకులు సూరం శెట్టి కిషోర్ వద్దకు రాయబారం కూడా పంపాను. రాయబారానికి వచ్చిన పోలీస్ అధికారిపై సూరంశెట్టి కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఉద్యోగం కోసం వచ్చిన వ్యక్తివి ఉద్యోగం చేసుకో ఇంకొకసారి రాజకీయాలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించి పంపించారు. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా, అధికారం ఉన్నా, లేకపోయినా పార్టీ కోసమే పని చేసి మల్లు భట్టి విక్రమార్క వెంట నడిచారు. భట్టి విక్రమార్క నాలుగు సార్లు గెలుపులో సూరం శెట్టి కిషోర్ కృషి ఎంతో ఉంది. అంతేకాకుండా ప్రతి గ్రామంలో గ్రామస్థాయి నాయకులతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సూరంశెట్టి కిషోర్ కుటుంబం దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉన్నారు. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి సూరం శెట్టి కిషోర్ ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎంపిక చేస్తారని పార్టీ శ్రేణుల్లో జోరుగా వినిపిస్తుంది.

# తుది ఓటరు జాబితా విడుదల

### అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):**
భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా తుది ఓటరు జాబితారూపొందించి విడుదల చేయడం జరిగిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్రాజ్ అన్నారు. సోమ వారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్.డి.ఓ.లు, తహశిల్దార్లతో ఓటరు జాబితా, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, స్వీప్ ఓటింగ్ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా ఫారం 6, 7, 8 ల ద్వారా అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి, సమగ్ర విచారణ జరిపి, పరిష్కరించి ఆన్లైన్లో వివరాలు నమోదు చేసి తుది ఓటర్ల జాబితాను ప్రకటించడం జరిగిందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని, మృతి చెందిన వారి వివరాలు జాబితాను తొలగించేందుకు నోటీసులు జారీ చేసి విచారణ అనంతరంతొలగించడం జరిగిందని, 18 సంవత్సరముల వయస్సు కలిగిన నూతన ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించి పూర్తిగా పరిశీలించి జాబితాలో నమోదుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, సర్వీస్ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఓటరు టర్న్ అవుట్ పెరిగే విధంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ఓటరు నమోదుకు జనవరి 1, 2024 ప్రామాణికంగా తీసుకొని 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పిస్తూ జాబితా రూపొందించడం జరిగిందని, శాసనసభ సెగ్మెంట్ల వారిగా నూతనంగా నమోదు అయిన ఓటర్ల జాబితా వివరాలను మరోసారి ధృవీకరించు కోవాలని తెలిపారు. ఎన్నికల సంబంధిత అంశాలపై స్థానిక ప్రజాప్రతి నిధులకు సమాచారం అందించాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించు కునేలా అవ గాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ ఎస్.ఎస్.ఆర్-2024లో భాగంగా నూతన ఓటరు నమోదు, పేరు, చిరునామా మార్పులు, మరణించిన వారి వివరాలు తొలగింపుపై భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి చర్యలు తీసుకొని సమగ్రమైన జాబితా రూపొందించడం జరిగిందని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఖమ్మం, కల్లూరు ఆర్డిఓలు జి.గణేష్, అశోకచక్రవర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, కలెక్టరేట్ ఏ.ఓ అరుణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాంబాబు, ఖమ్మం అర్బన్ తహశిల్దార్లు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో యరగొర్ల హనుమంతరావు యాదవ్



**ఖమ్మం, ఫిబ్రవరి 20, (జనం సాక్షి):**
ఖమ్మం మార్కెట్ కమిటీ రిజర్వేషన్ దామాషా ప్రకారం బి.సి జనరల్ కావడం తో హనుమంత రావు పేరు తెరపైకి వచ్చింది. రఘునాథపాలెం మండలం వి వెంకటాయపాలెం గ్రామానికి చెందిన యరగొర్ల హనుమంతరావు మొదటి నుండి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వీరాభిమాని. ఆయన వ్యక్తిగతంగా సౌమ్యుడు, నిజాయితీ పరుడుగా స్థానికంగా మంచి పేరుండటం కలిసి వచ్చే అంశం. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వీ వెంకటాయపాలెం యంపిటీసిగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. మండలంలో బీఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాలను కైవసం చేసుకున్న నేపథ్యం లో వెంకటాయపాలెం ఎంపీటీసీ స్థానాన్ని మాత్రం తనకున్న మంచి పేరుతో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందటం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతే కాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో వెంకటాయపాలెం గ్రామంలో సొంత డబ్బులు ఖర్చు పెట్టి భారీ ర్యాలీ నిర్వహించడంతో మంత్రి తుమ్మలకు బారీ మెజారిటీ వచ్చింది. దీంతో హనుమంతరావు అభ్యర్థిత్వం పట్ల తుమ్మల కూడా సానుకూలంగా వున్నట్లు తెలుస్తోంది. హనుమంతరావు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని అభిమానులు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రమాదాల నివారణకు ఇంధన సంస్థల మాక్ డ్రిల్

### మాక్ డ్రిల్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
పెట్రోలియం, గ్యాస్ పైప్ లైన్ నిర్వహణ, ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులు, ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ప్రముఖ ఇంధన సంస్థలు హిందూస్తాన్ పెట్రోలియం, గెయిల్ ఇండియా లిమిటెడ్, పిఐఎల్ పెట్రోలియం సంస్థల అధ్వర్యంలో సూర్యాపేట మండల పరిధిలోని కేసారం గ్రామ శివారులో నిర్వహించిన మాక్ డ్రిల్ ను జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పరిశీలించారు. ఆ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రమాదాల ముందస్తు సూచికకు గాను నిత్యం పర్యవేక్షణ,పూర్తి అత్యాధునిక సెన్సార్ సిస్టంతో అలారం ఏర్పాటు ఉందన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వ్యవసాయ పనులు, రోడ్ పనులు, బోర్ వెల్ పనులు, పట్టి తవ్వకాల సమయంలో ఇంధన పైప్ లైన్స్ లీక్ అవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు.దీనిపై సంస్థలు పూర్తిగా నిఘా ఉంచాలని అన్నారు. ప్రజలు, రైతులు,వ్యాపారులు మొదలగువారు పనుల నిమిత్తం పైప్ లైన్ వెళ్ళే మార్గంలో, వ్యవసాయ భూముల్లో తవ్వకాలు జరిపే టప్పుడు, బోర్‌లు, డ్రిల్లింగ్ వేసేటప్పుడు సంస్థలకు సమా చారం అందించి ప్రమాదాల జరగకుండా జాగ్రత్తపడాలని అన్నారు.ఈ మాక్‌డ్రిల్ నందు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, ఆ సంస్థల ప్రతినిధులు కిషోర్, దుర్గా ప్రసాద్, గేయిల్ సంస్థ డీజీఎం యోగేష్, చీఫ్ మేనేజర్ వెంగళ్రావు, హెచ్పీసీఎల్ డీజిఎం అంకయ్య, ఆపరేషన్స్ ఆఫీసర్ గౌతమ్ రాజ్, ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ శిక్షణకు వెళ్తున్న 158 స్టైఫండరీ పోలీసు కానిస్టేబుళ్లు

### పోలీస్ శాఖలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని కలిగి వుండాలి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మంజిల్లా బ్యూరో,ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :**
తెలంగాణ పోలీస్ నియామక మండలి ద్వారా ఎంపికైన వారిలో తొమ్మిది నెలల శిక్షణ కోసం పోలీస్ శిక్షణ కేంద్రాలకు వెళ్ళుతున్న 158 మంది సివిల్/ఏఆర్ స్టైఫండరీ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ళకు పోలీస్ ఐడెంటిఫికేషన్ కార్డు, కిట్ అ?ర్టికల్స్ ను పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించే రీతిలో ఇచ్చే తొమ్మిది నెలల పోలీస్ శిక్షణ కాలాన్ని చక్కని అవకాశంగా భావించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు.శిక్షణ ప్రారంభంలో కుటుంబ సభ్యులతో గడిపిన క్షణాలు గుర్తు చేసుకొని భావోద్వేగాలకు గురికాకుండా మానసిక బలం కలిగి వుండాలని సూచించారు. ఏదైనా సమస్య వుంటే తోటి వారితో పంచుకోవడం ద్వారా మానసిక ప్రశాంత కలిగి వుంటుందని అన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి సమస్య వచ్చిన సమర్థవంతంగా ఎదుర్కోనేలా తొమ్మిది నెలలలో శిక్షణ పొందలన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పోలీస్ శాఖలోని వివిధ విభాగాలలో ఎంపికైన అభ్యర్థులకు పోలీస్ కానిస్టేబుల్ నియామక పత్రాలు అందజేసిన నేపథ్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ నుండి శిక్షణకు వెళ్తున్న158 మందిలో 54 మంది సివిల్ ట్రైనీ కానిస్టేబుళ్ళు, 55 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్ళు వున్నారన్నారు. అలాగే 33 మంది మహిళ సివిల్ కానిస్టేబుళ్ళు,16 మంది మహిళా ఆర్మ్‌డ్ రిజర్వ్ ట్రైనీ కానిస్టేబుళ్ళు వున్నారన్నారు. వీరందరికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీతో పాటు, పిటిసి వరంగల్, సిటిసీ సైబరాబాద్, 8వ బెటాలియన్‌ల్లో తొమ్మిది నెలల శిక్షణ ఇవ్వనునట్లు తెలిపారుకార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ గణేష్, %ూా% అక్తరూనీసాబేగంలు కామరాజు , శ్రీశైలం, అప్పలనాయుడు, సిఐ అంజలి, సిఐస్వామి, సిఐవెంకన్న,సెక్షన్ సూపరిండెంట్ జానకి రామ్ పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ పై ఎమ్మెల్యే ఆగ్రహం

### విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారం అందించుకుంటే కఠిన చర్యలు

### కస్తూర్బా ఆశ్రమ పాఠశాలని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, ఫిబ్రవరి 19 (జనంసాక్షి):**
టేకులపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాల్సిన ప్రిన్సిపాల్ ఇష్టానుసారంగా నాణ్యతలేని భోజనాన్ని నీళ్ల చారుతో, దొడ్డు బియ్యం అన్నంతో ప్రతిరోజు అందిస్తున్న క్రమంలో ఆ పాఠశాల విద్యార్థులతో విద్యార్థి సంఘం ఆందోళనకు దిగడంతో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హుటాహుటిన పాఠశాలకు చేరుకుని జరిగిన విషయాన్ని బాలికలతో తెలుసుకున్నారు. విద్యార్థులు తెలిపిన వివరాలతో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చక్కటి మెనూని అందిస్తుంటే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పనిచేస్తున్న వర్కర్స్ అందరిని మార్చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బాలికలకు నాణ్యమైన భోజనం పట్ల గాని, సౌకర్యాల పట్ల గాని, విద్య పట్ల గాని, బాలికలను అగౌరపరిచి మాట్లాడిన గాని కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా పాఠశాలలో విద్యుత్ సమస్య కారణంగా తమ చదువులకు ఆటంకం ఏర్పడుతుందని వెంటనే ఈ సమస్యపై స్పందించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో నిరంతరం విద్యుత్ సరఫరా చేసే విధంగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని మండల విద్యుత్ ఏఈ హాట్కార్ దేవా అని ఆదేశించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో గల మరుగుదొడ్లు,కిచెన్ షెడ్డు,పాఠశాల ఆవరణను పరిశీలించారు.

## మత సామరస్యానికి ప్రతీక 55వ హజరత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉరుసు



**చింతపల్లి ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** జిల్లా లో రెండో జానపహాడ్‌గా, హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే హజరత్ అబ్బాస్ ఉర్సు ఉత్సవాలకు దర్గా ముస్తాబైంది. చింతపల్లి మండ లం పీకే మల్లేపల్లిలో గల ఈదర్గాలో ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చింతపల్లి మండలం పీకే మల్లేపల్లిలో గల ఈ దర్గాలో ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉర్సు ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. బుధవారం రాత్రి 11 గంటలకు దర్గా ముత్తవెల్లి చాంద్‌పాష గృహం నుంచి గంధం (సందల్) ఒంటెపై భక్తజన సందోహంతో ఊరేగింపుగా వచ్చి దేవుడికి చెల్లించ నున్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా తో పాటు మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుంటారు. దర్గాను దర్శించుకున్న వారికి కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.


**దర్గా వద్ద జరుగనున్న కార్యక్రమాలు**

21న బుధవారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు గంధం ఊరేగింపు
22న దర్గా వద్ద అన్నదానం, గుట్టపై ఓం శ్రీ గిరి మక్కా మహేశ్వరస్వామి వారి కల్యాణం
23న భక్తులతో తిరాకులు(దీపారాధన), న్యా దులు (కందుర్లు) మొక్కులు చెల్లిస్తారు.కావునా భక్తులంతా విచ్చేసి తిలకించగలరని కోరుతున్నారు..

# ప్రజా సంక్షేమాన్ని వీడి ప్రైవేట్ సేవలో ప్రభుత్వాలు

## పన్నుల భారం, అధిక ధరల నుండి దక్కని రక్షణ

### సేవారంగం నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :**
కార్పొరేట్ల కొమ్ము కాస్తే అది ప్రజలకు భారంగానే మారుతుంది. రోడ్లు వేయటం, ప్రాజెక్టులు కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికం రంగాల నిర్వహణ అన్నీ భారంగానే మారతాయి. అందుకే ప్రభుత్వాలు కార్పొరేట్లకు లాభం చేకూర్చే వైపు కాకుండా ప్రజల సంక్షేమం వైపు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. కార్పోరేట్లకు చేసే మేలు వల్ల సామాజిక బాధ్యత గురించి, సామాజిక అంశాల గురించి, ఆ మాటకొస్తే మానవత్వం గురించి మాట్లాడలేరు. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు, ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రభుత్వమే అమలు చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని చూడాలి. ప్రజల కష్టాల్ని, భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చించాలి. పన్నుల భారం నుండి, అధిక ధరల నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ప్రజలకి ప్రభుత్వానికి వారిధిగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యా యులకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కుల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల్లో ఏదైనా అంశం మీద అసంతృప్తి ఏర్పడితే దాన్ని చర్చల ద్వారా తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. చర్చించడం అన్న విధానాన్ని నిరంతరా యంగా ప్రజలముందుకు తీసుకుని రావాలి. ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేస్తున్న కారణంగా, పాలకుల తప్పులకు బాధ్యులు ఎవరన్నది చెప్పాలి.

1980 తరువాత భారతదేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడింది. విదేశీ మారక నిల్వలు కరిగిపోవడం, బంగారాన్ని సైతం కుదువ పెట్టాల్సి రావడం, అప్పుల కోసం ప్రపంచ దేశాల మీద ఆధార పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో భారతదేశం అప్పు కోసం ప్రపంచ బ్యాంకు తలుపు తట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి తెచ్చుకున్న అప్పు ఫలితంగా ప్రభుత్వం సంక్షేమ బాధ్యత నుంచి పక్కకు తప్పుకోవటం, ప్రజలకు కావలసిన ప్రతి అవసరాన్ని సరుకుగగా చూడడం మొదలు పెట్టింది. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు 32 సంవత్సరాల కాలంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా మారిపోయింది. ఆఖరికి ప్రభుత్వ రంగ కంపెనీలను అమ్మడం కోసం, కార్పొరేట్లకు అప్పచెప్పటం కోసం కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసిందంటే పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం వల్ల కార్పొరేట్లకు అవసరమైన పెట్టుబడుల వెతుకులాటలో వుండగా.... భారతదేశ ప్రభుత్వరంగ పరిశ్రమలతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న వివిధ రకాల నిల్వలు, పెన్షన్ ఫండు నిల్వల మీద ప్రపంచ బ్యాంక్ కన్ను పడింది. పరిశ్రమలతో పాటు ఈ దేశంలో ఉన్న సహజ సంపదల మీద కూడా ప్రపంచ బ్యాంకు చూపు పడింది.

అప్పుకెళ్లిన ప్రతిసారీ సంస్కరణల పేరుతో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుని ప్రైవేటు రంగానికి కేటాయింపులు చేసేలా ఒత్తిడి తెచ్చింది. దాని ఫలితంగానే నేడు మనకు సర్వదరిద్రాలు వచ్చాయి. దీనిలో భాగంగానే ప్రజలకిచ్చే సబ్సిడీలపై కోతను విధిస్తోంది. ధరలు పెంచు తోంది. రైతాంగ వ్యతిరేక చట్టాలు తెస్తోంది. కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్స్‌గా మార్చేసింది.

భూమి, గనులు, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గాలి, నీరు, పాలు... ఒక్కటేమిటి ఇప్పటి వరకు సహజ సంపదలుగా, ప్రభుత్వరంగ సంస్థలుగా ఉన్న అన్నీ... ప్రైవేటు సేవలుగా మారుతున్నాయి. అన్ని రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకొని, కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెబుతోంది. దీనివల్ల భవిష్యత్తు లో యూజర్ చార్జీల పేరుతో వందలాది రూపాయలు వసూలు చేసే పని జరుగుతున్నది. ఎంటర్‌టైన్ మెంట్‌కు కూడా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. ప్రతిదాన్నీ ప్రభుత్వం సరుకుగా మార్చివేస్తున్నది.

## రతన్ టాటా బయోగ్రఫీ బుక్ లాంచ్?

భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన పారిశ్రామికవేత్తలలో ఒకరైన 'రతన్ టాటా' జీవిత చరిత్ర పుస్తకం రూపంలో రానున్నట్లు చాలా రోజుల నుంచి చెబుతూనే ఉన్నారు. పుస్తక రచయిత 'మాథ్యూ' నవంబర్ 2022లో పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. 2022లో రతన్ టాటా బయోగ్రఫీ బుక్ విడుదలవుతుందని ఎదురుచూసే అభిమానులకు అప్పుడు నిరాశే ఎదురైంది. ఆ తరువాత బుక్ లాంచ్ తేదీని 2023 మార్చి నెలకు మార్చారు, మళ్ళీ ఓసారి 2024 ఫిబ్రవరి అన్నారు. ఈ నెలలో కూడా బుక్ లాంచ్ సాధ్యం కాదని తేలిపోయింది. మళ్ళీ ఎప్పుడు విడుదల చేస్తారు అనే విషయానికి సంబంధించిన అధికారిక సమాచారం అందుబాటులో లేదు. కానీ మార్చి 30 నాటికి లాంచ్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రముఖ వ్యాపార వేత్తగా ఎదిగి.. దాతృత్వానికి మారుపేరుగా నిలిచినా రతన్ టాటాకు సోషల్ మీడియాలో ఫాలోవర్స్ సంఖ్య భారీగా ఉంది.

## కొచ్చర్ దంపతుల అరెస్ట్ చట్ట విరుద్ధం : బాంబే హైకోర్టు



ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ ఐసీఐసీఐ మాజీ ఎండీ కం సీఈఓ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లకు బాంబే హైకోర్టు రిలీఫ్ కల్పించింది. లోన్ ఫ్రాడ్ కేసులో కొచ్చర్ దంపతులను సీబీఐ అరెస్ట్ చేయడం చట్ట విరుద్ధమని వ్యాఖ్యానించింది. చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్‌లను అరెస్ట్ చేసే విషయంలో చట్టం పట్ల సీబీఐ అధికారులకు గౌరవం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇది అధికార దుర్వినియోగమేనని కొచ్చర్ దంపతుల అరెస్ట్ చట్ట విరుద్ధం అని జస్టిస్‌లు అనుజా ప్రభుదేశాయ్, ఎఆర్ బోర్కర్ లతో కూడిన డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది. గతేడాది జనవరిలో మరో బెంచ్ దీపక్ కొచ్చర్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. విచారణకు సహకరించడం లేదన్న సీబీఐ వాదనను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరిం చింది. నిందితులకు మౌనంగా ఉండే హక్కు ఉంటుందని తెలిపింది. వీడియోకాన్-ఐసీఐసీఐ బ్యాంకు రుణం కేసులో 2022 డిసెంబర్ 23న చందాకొచ్చర్, దీపక్ కొచ్చర్ లను సీబీఐ అరెస్ట్ చేసింది. తనను అరెస్ట్ చేయడానికి వ్యతిరేకంగా దీపక్ కొచ్చర్ హైకోర్టును ఆశ్రయించారు. 2023 జనవరి 9న న్యాయస్థానం కొచ్చర్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. సాధారణ అరెస్టలను నివారించడానికే సీఆర్పీసీలో కొత్తగా 41ఏ సెక్షన్ జత చేశారని దేశ సర్వోన్నత న్యాయ స్థానం గుర్తు చేసింది.ఈ నెల ఆరో తేదీన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది.

## మెదడులో చిప్ పనిచేస్తోంది..

న్యూరాలింక్ ఇటీవల మనిషి మెదడులో చిప్ అమర్చింది. ఆ చిప్ కలిగిన మనిషి ఇప్పుడు పూర్తిగా కోలుకుంటున్నట్లు, వారి ఆలోచనల ద్వారా కంప్యూటర్ మౌస్‌ను నియంత్రించగలుగుతున్నట్లు స్టార్టప్ వ్యవస్థాపకుడు 'ఇలాన్ మస్క్' వెల్లడించారు. మెదడులో చిప్ కలిగిన వ్యక్తి పూర్తిగా కోలుకుంటున్నట్లు మాత్రమే కాకుండా.. పురోగతి కూడా కనిపిస్తోందని తెలిపారు. ఆ వ్యక్తి కేవలం ఆలోచించడం ద్వారా స్క్రీన్ చుట్టూ మౌస్ కదిలించగలడని, వీలైనన్ని ఎక్కువ మౌస్ బటన్ క్లిక్‌లను పొందడానికి ఇప్పుడు న్యూరాలింక్ ప్రయత్నిస్తోందని మస్క్ వెల్లడించారు.
సెప్టెంబరులో హ్యూమన్ ట్రయల్ రిక్రూట్‌మెంట్ కోసం ఆమోదం పొందిన తర్వాత సంస్థ గత నెలలో మొదటిసారి మనిషి మెదడులో చిప్‌ను విజయవంతంగా అమర్చింది. మెదడులోకి ఒక ప్రాంతంలో ఆపరేషన్ చేసి చిప్ అమర్చినట్లు వెల్లడించారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 530 | ₹ 64 |
| వరంగల్ | ₹ 532 | ₹ 64 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| | |
|---|---|
| ₹62,670 (24 క్యారెట్లు) | ₹57,450 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹58,000 (22 క్యారెట్లు) | ₹46,230 (18 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹76,500

# మళ్లీ ఆల్‌టైమ్ రికార్డ్

- జీవితకాల గరిష్ఠానికి చేరిన నిఫ్టీ..!
- 73వేల మార్క్‌ను దాటిన సెన్సెక్స్..!



వరుసగా ఆరో సెషన్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ మళ్లీ 73వేల మార్క్‌ను దాటగా.. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ మరోసారి జీవితకాల గరిష్ఠానికి చేరుకున్నది. సెన్సెక్స్ మంగళవారం ఉదయం నష్టాల్లో మొదలైంది. అంతర్జాతీయ మార్కెట్లు, ఆసియా మార్కెట్లలోని ప్రతికూల పవనాలతో నష్టాల్లో మొదలయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే ఉదయం సెన్సెక్స్ 72,727.87 పాయింట్ల వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఆ తర్వాత కోలుకున్నది.
చివరికు వరకు లాభాల్లో కొనసాగింది. ఒక దశలో 72,510.24 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయిన సెన్సెక్స్.. 73,130.69 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 349.24 పాయింట్ల లాభంతో 73,057.40 వద్ద ముగిసింది. నిఫ్టీ కిత్రం సెషన్‌తో పోలిస్తే 22,099.20 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత పడుతూ లేస్తూ వచ్చిన సూచీలు.. 22,045.85 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసి నిఫ్టీ.. 22,215.60 పాయింట్ల గరిష్ఠాన్ని తాకి గత రికార్డును బ్రేక్ చేసింది.
చివరకు 74.70 పాయింట్ల లాభంతో 22,196.95 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 1,661 షేర్లు పురోగమించగా.. 1,667 షేర్లు క్షీణించాయి. 65 మాత్రం మారలేదు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ అత్యధికంగా లాభపడ్డాయి. హీరో మోటోకార్ప్, కోల్ ఇండియా, బజాజ్ ఆటో, ఐషర్ మోటార్స్, టీసీఎస్ నష్టపోయాయి. సెక్టోరల్‌లో బ్యాంక్, మీడియా, పవర్, రియాల్టీ 0.8 నుంచి 2శాతం చొప్పున వృద్ధి చెందాయి. ఆటో, ఐటీ, మెటల్ దాదాపు ఒక శాతం క్షీణించాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి.

## జాతీయం అంతర్జాతీయం

### విపక్ష కూటమి పార్టీలతో సీట్ల సర్దుబాటుపై కీలక దశకు చేరిన చర్చలు

విపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు టీఎంసీ, ఆప్‌లతో కాంగ్రెస్ సీట్ల సర్దుబాటు చర్చల్లో ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ఈ అంశంపై కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. విపక్ష కూటమి భాగస్వామ్య పక్షాలతో కాంగ్రెస్ పార్టీ సీట్ల సర్దుబాటు విషయంలో సంప్రదింపులు సాగుతున్నాయని, త్వరలోనే పరిష్కారం లభిస్తుందని చర్చలు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేస్తుందనే వివరాలు ఏ క్షణమైనా ఖరారవుతాయని కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ వెల్లడించారు. పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే సంప్రదింపుల కోసం జాతీయ అలయన్స్ కమిటీని ఏర్పాటు చేశారని, ఆ కమిటీ తన విధులను నిర్వర్తిస్తోందని చెప్పారు. చర్చలు జరుగుతున్నాయని పరిష్కారం దిశగా చర్చలు తుది దశకు చేరాయని చెప్పారు.

## పరువు నష్ట కేసులో రాహుల్‌కు ఊరట

- అమిత్‌షా వ్యాఖ్యల కేసులో బెయిల్
- సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నేత



**లక్నో,ఫిబ్రవరి20 (జనంసాక్షి) :**కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆరేళ్ల క్రితం నాటి ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా యూపీలోనే ఉన్న రాహుల్ కేసు విచారణ నిమిత్తం మంగళవారం కోర్టు ఎదుట హాజరయ్యారు. 2018 మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన రాహుల్.. కేంద్రమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. నాడు బెంగళూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయాల్లో స్వచ్ఛంగా, నిజాయతీగా ఉంటామని చెప్పే భాజపా. ఓ హత్య కేసులో నిందితుడిని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుందని ఆరోపించారు. ఆ సమయంలో అమిత్ షా.. భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలోనే యూపీకి చెందిన భాజపా నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టులో రాహుల్‌పై ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో పలుమార్లు న్యాయస్థానం ఆయనకు సమన్లు జారీ చేయగా రాహుల్ స్పందించలేదు. తాజాగా విచారణకు హాజరవ్వగా.. కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కర్ణాటక ఎన్నికల సందర్భంగా బెంగళూరులో హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో విజయ్ మిశ్రా అనే వ్యక్తి సుల్తాన్‌పూర్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ కేసులో సుల్తాన్ పూర్ లోని జిల్లా సివిల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. మంగళవారం ఈకేసు విచారణకు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం భారత్ జోడ్ న్యాయ్ యాత్రలో పాల్గొనేందుకు అమేథికి వెళ్లారు రాహుల్ గాంధీ. భారత్ జోడో న్యాయ్ యాత్ర మంగళవారంలో 38 వా రోజుకు చేరుకుంది. అమేధీ జిల్లాలో పురంత్ గంజ్ లతిరిగి ప్రారంభం అవుతుంది. ఈ యాత్ర రాయ్ మంగళవారం రాయ్ బరేలీ, లక్నో మీదుగా సాగనుంది. ఫిబ్రవరి 24 న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఉత్తరప్రదేశ్ లోని మొరదాబాద్ నుంచి ఈ యాత్రలో చేరనున్నారు.



## మరాఠా కోటాను స్వాగతించిన ఉద్ధవ్ ఠాక్రే

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీలో మరాఠా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడాన్ని శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే స్వాగతించారు. మరాఠా రిజర్వేషన్ల కోసం త్యాగాలు చేసిన మరాఠాలను ఆయన అభినందించారు. సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును పరిశీలించిన తర్వాత ఇది అసెంబ్లీలో ఆమోదం పొందినా కోర్టులో పెండింగ్‌లోనే ఉందని వ్యాఖ్యానించారు. విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించే మరాఠా కోటా బిల్లు ఆమోదం పొందినందుకు తాను ప్రభుత్వాన్ని అభినందిస్తున్నానని ఠాక్రే పేర్కొన్నారు. మరాఠా కోటా కోరుతూ నిరసన చేపట్టిన అంతర్వాలి గ్రామంలో లాఠీచార్జ్ చేశారని దీని గురించి తాను ఈరోజు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని అన్నారు. ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఈ రిజర్వేషన్ అమలవుతుందని అన్నారు. ప్రభుత్వానికి మరాఠా కోటా విషయంలో తాము మద్దతిస్తామని, అయితే కోటా కింద ఎంతమందికి ఉద్యోగాలు లభించాయనేది ప్రభుత్వం వెల్లడించాలని అన్నారు. ఈ దిశగా కొంత సమయం వరకూ తాము వేచిఉండాల్సిన అవసరం ఉందని శివసేన (యూబీటీ) చీఫ్ ఠాక్రే వ్యాఖ్యానించారు.

## దమ్ముంటే అమేథీ నుంచే పోటీ చేయండి

### రాహుల్‌కు స్మృతి ఇరానీ సవాల్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :**
దమ్ముంటే అమేథీలో పోటీ చేయాలని, వయనాడ్‌ను వదలాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి .. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ సవాల్ విసిరారు. వయనాడ్ నియోజకవర్గాన్ని వదిలేసి.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేవలం అమేథీలోనే రాహుల్ పోటీ చేయాలని ఆమె అన్నారు. ఒకవేళ రాహుల్ నమ్మకంగా ఉంటే, వయనాడ్‌లో ఆయన పోటీ చేయాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ సీటుపై ఆయన అమేథీ నుంచి మాత్రమే పోటీ చేయాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సవాల్ విసిరారు. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ ఛాలెంజ్ చేశారు. యూపీలోని అమేథీ సీటు నుంచి గతంలో స్మృతి ఇరానీపై రాహుల్ గాంధీ ఓడిపోయారు. 2019 జనరల్ ఎలక్షన్స్‌లో 50 వేల ఓట్ల తేడాతో స్మృతి ఇరానీ గెలుపొందారు. అయితే ఆ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ సీటు నుంచి రాహుల్ విజయం సాధించారు. ఆ స్థానం నుంచి ఆయన 4.3 లక్షల ఓట్ల తేడాతో నెగ్గారు. గతంలో అమేథీ స్థానం నుంచి రాహుల్ గాంధీ మూడు సార్లు విజయం సాధించారు. 2004 నుంచి ఆయన ఆ స్థానం నుంచి గెలిచారు. కానీ 2019లో స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. అయితే రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్న విషయం ఇంకా తెలియలేదు. అమేథీ నుంచా లేక వయనాడ్ నుంచి రాహుల్ పోటీ చేస్తారా లేదా అన్న క్లారిటీ లేదు.


## తలపాగా ధరించిన ప్రతి ఒక్కరిపై ఖలిస్తానీ ముద్ర వేస్తున్న కాషాయ పార్టీ : మమతా బెనర్జీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20 (జనంసాక్షి)** :బీజేపీ సమాజంలో విభజన చిచ్చు రేపుతూ రాజ్యాంగ పరిమితులను యధేచ్ఛగా ఉల్లంఘిస్తోందని పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. మన సిక్కు సోదరుల ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాషాయ పార్టీ చేస్తున్న ప్రయత్నాలను ఆమె ఖండించారు. బెంగాల్ బీజేపీ ఎమ్మెల్యే అగ్నిమిత్ర పాల్ వీడియోను షేర్ చేస్తూ దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

తలపాగా ధరించిన ప్రతి ఒక్కరినీ బీజేపీ ఖలిస్తానీ ముద్ర వేస్తుందని మండిపడ్డారు. బీజేపీ నేతలను సందేశ్‌ఖలి వెళుతుండగా అడ్డగించిన సిక్కు పోలీస్ అధికారితో ఎమ్మెల్యే అగ్నిమిత్ర పాల్ వాదించిన క్రమంలో మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేశారు. జాతి కోసం అసమాన త్యాగాలు చేసిన మన సిక్కు సోదరుల పట్ల బీజేపీ వ్యవహరించిన తీరును తాను ఖండిస్తున్నానని, ఆ పార్టీ తలపాగా ధరించిన ప్రతి వ్యక్తిపైనా ఖలిస్తానీ ముద్ర వేస్తుందని మండిపడ్డారు.

## చదువులకు ఊతమిచ్చేలా వైఎస్సార్ కళ్యాణమస్తు

- చదువుతో పాటు..వయసు నిబంధన పెట్టాం
- బాల్య వివాహాలను కూడా అడ్డుకున్న ఘనత
- 10,132 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు చెక్కులు
- బటన్ నొక్కి నిధులు విడుదల చేసిన సిఎం జగన్




**అమరావతి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :**
అక్టోబరు-డిసెంబరు 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 10,132 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు కింద చెక్కులను సిఎం జగన్ అందించారు. వైఎస్సార్ షాదీ తోఫా క్రింద రూ.78.53 కోట్ల ఆర్థిక సాయాన్ని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేసారు. ఈ సందర్భంగా సీఎం వైయస్.జగన్ మాట్లాడుతూ దేవుడి దయతో ఈరోజు మరో మరో మంచి కార్యక్రమం జరుగుతుంది. దాదాపుగా 10,132 మంది జంటలకు మంచి చేసే కార్యక్రమం. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కార్యక్రమంలో... పిల్లలను చదవించే విషయంలో ఒక అడుగు ముందుకు వేసి, ఆ చదువులను ప్రోత్సహిస్తూ వధూవరులు ఇద్దరూ పదోతరగతి పాసై ఉండాలన్న నిబంధన పెట్టాం. అదే మాదిరిగా పిల్లల బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ ఖర్చులకోసం వసతి దీవెన కార్య క్రమం కింద డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి కోర్సులు చదివే వారికి ఆ విద్యా సంవత్సరంలో ప్రతి ఏప్రిల్‌లో ఒక్కోక్కరికి రూ.20వేల వరకు ఇస్తున్నాం. ఈ రెండు స్కీంలు ఉన్నాయి కాబట్టి చదువులను ప్రోత్సహిస్తూ.. ప్రతి అమ్మాయి, అబ్బాయి గ్రాడ్యుయేట్స్ అయ్యే విధంగా అడుగులు వేయించగలుగుతున్నామని అన్నారు. కుటుంబంలో తల్లి చదువుకుని ఉంటే గతంలో ఎస్సీలకు రూ.40వేలకే పరిమితమైన పథకాన్ని రూ.1లక్ష వరకు తీసుకునిపోయాం. అదే కులాంతర వివాహం అయితే రూ.1.20 లక్షల వరకూ పెంచాం. ఎస్టీలకు గతంలో రూ.50 మాత్రమే ఉంటే దాన్ని కూడా రూ.1లక్ష వరకు పెంచడంతోపాటు, కులాంత వివాహానికి రూ.1.20లక్షలకు పెంచాం. గతంలో బీసీలకు కేవలలం రూ.35వేలు మాత్రమే ఇస్తున్న పరిస్థితుల నుంచి రూ.50వేలకు, కులాంతర వివాహం అయితే రూ.75 వేలకు తీసుకుని పోయాం.దివ్యాంగులకు అయితే ఏకంగా రూ.1.50 లక్షల వరకు తీసుకుని పోయాం. వాళ్ల కుటుంబాలలో తల్లిదండ్రులు ఏ ఒక్కరూ అప్పులుపాలయ్యే పరిస్థితి రాకూడదని సబ్‌స్టాన్సియల్ అమౌంట్ పెంచి ఇస్తున్నాం. చదువులను ప్రోత్సహించే దిశగా తల్లిదండ్రులలను అడుగులు వేయిస్తాయన్న నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని చేస్తున్నాం.గతంలో అరకొరగా ఇస్తున్న పరిస్థితులు ఉండేవి. దాదాపు 17,709 మంది పిల్లలకు ఇచ్చే అరకొర కూడా దాదాపు రూ.70 కోట్లు ఎగరగొట్టిన పరిస్థితులు గతంలో ఉంటే.. ఈ రోజు ఏ ఒక్కరు మిస్ కాకూడదని అని ఆ క్వార్టర్ అయిన వెంటనే ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. ఇది ఐదో విడత కార్యక్రమం. అక్టోబరు, నవంబరు, డిసెంబరు క్వార్టర్‌కి సంబంధించినది ఈ రోజు దాదాపు రూ.78 కోట్లు ఇస్తున్నాం.ఇంతవరకు 56,194 జంటలకు, వారి కుటుంబాలకు మంచి చేస్తూ రూ.427 కోట్లు ఈ ఒక్క పథకానికే పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ మరో ముందడుగు వేస్తున్నంతకు చాలా సంతోషం. దీనివల్ల అందరికీ మంచి జరగాలని, ముఖ్యంగా ఈ క్వార్టర్‌లో ఏకమైన పిల్లలకు వారి తల్లిదండ్రులకు ఇంకా మంచి జరగాలని, వాళ్లందరికీ ఆల్ ది బెస్ట్ తెలియజేస్తున్నాను. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి కూడా ఇంకా మంచి జరగాలని, మంచి చేసే అవకాశం దేవుడు ఇంకా ఎక్కువ ఇవ్వాలని మనసారా కోరుకుంటూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నానని సీఎం జగన్ వివరించారు.

## పెరిగిన దిగుమతులు

### దారికొస్తున్న వంటనూనెల ధరలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :**
దేశంలో వంటనూనెల ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గత కొంత కాలంగా ధరలు దిగొచ్చాయి. ప్రస్తుతం ఆయిల్ నిల్వలు బాగా పెరగ డంతో ధరలు తగ్గుముఖం పట్టినట్టు సమాచారం. రష్యా, ఉక్రెయిన్ దేశాల నుంచి దిగుమతులు జోరుగా సాగుతున్నాయి. కాని కార్పొరేట్ సంస్థల చేతుల్లో ఆయిల్ వ్యాపా రం చిక్కుకుపోవడం వల్ల ధరలను ఆయా సంస్థలే శాసించడం గమనార్హం. దేశ ఆర్థిక రంగాన్ని ఓ కుదుపుకుదిపి, ఎల్ఐసీ, బ్యాంక్‌లను కుదేలయ్యేట్టు చేసిన అదానీ కూడా ఆయిల్ రంగాన్ని ఏలేస్తున్నారు.జెమిని, ఫ్రీడమ్, రుచి వంటి సుమారు ఏడెనిమిది సంస్థల చేతుల్లో ఆయిల్ వ్యాపారం ఉంది. గతంలో కరోనాకు ముందు వరకూ సన్‌ఫ్లవర్ లీటర్ ఆయిల్ రూ.90 ఉండేది. ఒకానొక సమయంలో రూ.200 దాటేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వాల ఉదాసీనవైఖరి, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాయడం వంటి కారణాల వల్ల ఆయిల్ ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. కొంతకాలం ఉక్రెయిన్ యుద్ధం వల్ల దిగుమతులు ఆగిపోయాయనే కారణాలు చెప్పారు. సన్‌ఫ్లవర్, పామాయిల్ వంటి ముడిసరుకు ప్రతి రోజూ దిగుమతి అవుతూనే వస్తోంది. నిత్యావసర సరుకు కాబట్టి, కార్పొరేట్ సంస్థలు ఇష్టానుసారం ధరలు పెంచేశాయి. కానీ ప్రజల నుంచి, ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసన రావడంతో పాటు ప్రభుత్వాలకు ఈ ఆయిల్ జిడ్డు అంటుకునే పరిస్థితి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆరు నెలల నుంచి కొద్దిగా ధరలు తగ్గాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ఫ్రీడమ్ ధర రూ.118లకు తగ్గింది.పామాయిల్ ధర రూ.95 వరకూ ఉంది. మరో రకం రూ.92 వరకూ ఉంది. కేంద్ర ప్రభుత్వం నిబంధనలు తొలగించడంతో ఎవరి ఇష్టం వారిదైంది. ప్రభుత్వాలేమీ పట్టించుకునే పరిస్థితి లేదు.దీంతో వివిధ కంపెనీలు వివిధ బ్రాండ్లతో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్కో బ్రాండ్‌కు ఒక్కో ధర కనిపిస్తోంది. ఒక సంస్థ ఒక ధర నిర్ణయిస్తే, మరో సంస్థ కొంచెం తగ్గించి ధర పెడుతుంది. ఇది పెద్దగా తేడా ఉండదు. వాస్తవానికి సరుకు ప్రజల అవసరాలకంటే ఎక్కువగా ఉన్నప్పుడు ధరలు తగ్గడం మార్కెట్ సూత్రం. కానీ ఇక్కడ కొరత ఉన్నప్పుడు మాత్రమే ధర పెంచేస్తున్నారు. నిల్వలు పెరిగినా ధరలు మాత్రం ఎక్కువగా తగ్గించడంలేదు. ప్రస్తుతం అందు బాటులో ఉన్న వంటనూనెల నిల్వలను బట్టి, మరింతగా ఆయిల్ ధరలు తగ్గవలసి ఉందని మార్కెట్ పరిశీలకుల అంచనా. అయితే గతంతో పోలిస్తే మాత్రం ధరలు తగ్గాయనే అంటున్నారు.



## టెస్కాబ్ చైర్మన్ ను సన్మానించిన సింగిల్ విండో చైర్మన్‌లు

**ముస్తాబాద్ (జనంసాక్షి):** బ్యాంకర్స్ ఇనిస్ట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ గా టెస్కాబ్ అధ్యక్షులు కొండూరు రవిందర్ రావు ఎన్నికైన సందర్భముగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం లో సత్కారం చేయడమైనది పోతుగల్ సింగిల్ విండో చైర్మెన్ తన్నీరు బాపురావు. ముస్తాబాద్ సింగిల్ విండో చైర్మన్ అన్నం రాజేందర్ రెడ్డి. వివిధ జిల్లా చైర్మన్లు పాల్గొన్నారు

## శ్రీసమక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన..

**అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్**



**రామగుండం(జనంసాక్షి) :** జిల్లాలో నిర్వహించే శ్రీ సమక్క-సారలమ్మల జాతర పనులు పరిశీలించామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా విజయవంతంగా జాతర నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. మంగళవారం రామగుండంలోని గోదావరి నది ప్రాంగణంలో చేసిన జాతర ఏర్పాట్లను, అంతర్గాం మండలంలోని గోలివాడలో చేసిన జాతర ఏర్పాట్లను పరిశిలించిన అదనపు కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, గోదావరిఖని, అంతర్గాం ప్రాంతంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి శ్రీ సమక్క సారలమ్మల జాతరను నిర్వహిస్తున్నారని తెలిపారు. జాతరను విజయవంతంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారని అన్నారు. జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పెండింగ్ లో ఉన్న చిన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. సమక్క, సారలమ్మ గద్దెలను, రోడ్లు, తాగునీటి వసతులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని, జాతర సమయంలో నది లోపలికి వెళ్లకుండా ఏర్పాట్లు చేయాలని గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచుకోవాలని, జాతర సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


# వలసకార్మికుల బతుకులు బుగ్గిపాలు

### కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం • ఘటనలో 40 పూరిగుడిసెలు దగ్ధం

### కార్మికకుటుంబాలన్నీ మేడారం జాతర వెళ్లడంతో తప్పిన ప్రాణనష్టం

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి): కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. జగిత్యాల రహదారిలోని సుభాష్‌నగర్‌లో వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు సుమారు 40 కుటుంబాలు పూరిగుడిసెలు వేసుకుని నివాసముంటున్నారు. ఈ ప్రాంతంలో మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో గుడిసెల్లో ఉన్న 8 గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఒక్కసారిగా ప్రమాదతీవ్రత పెరిగింది. గుడిసెల్లోని వారందరూ మేడారం జాతరకు వెళ్లారు. అయితే ఈ క్రమంలో జాతరకు వెళ్లేముందు వారి ఆనవాయితీ ప్రకారం ప్రతీ ఇంట్లో దీపం వెలిగించి జాతరకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఏదో ఒక దీపం వల్ల ప్రమాదవశాత్తు గుడిసె అంటుకోవడంతో అది అన్ని గుడిసెలకు వ్యాపించి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ ఘటనకు గుడిసెల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. పూరిళ్లలోని కార్మిక కుటుంబాలు మేడారం జాతరకు వెళ్లడంతో ప్రాణనష్టం తప్పింది.

**అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి:ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వము వెంటనే ఆదుకొని వారికి పక్కా ఇళ్లతో పాటు తక్షణ ఆర్థిక సాయం కింద లక్ష రూపాయలు అందచే యాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేసారు. సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితు లను పరామర్శించారు. మాట్లాడుతూ... రెక్కడితే గాని డొక్కాడని పరిస్థితి వారిదని ప్రవేట్ స్థలాల్లో పూరి గుడిసెలు వేసుకుని జీవనం కొన సాగిస్తు న్నారని ఘటన సమయంలో గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పిందని భారీ ఎత్తున ఆస్తి ష్టంవాటిల్లిందని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం



కాకుండా ప్రభుత్వం వెంటనే స్లమ్ ఏరియా లపై దృష్టి పెట్టి పక్క ఇల్లు నిర్మించి ఇయ్యాలని తక్షణ ఆర్థిక సాయం కింద ఒక లక్ష రూపాయలు గుడిసె లు కాలిపోయిన బాధితులకు అందజేసి ప్రభుత్వం అండగా ఉండాలని అన్నారు. దనగర మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు మేచినేని వనజ అశోక్ రావు, తోటరాములు, నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఘటన వెనక అనేక అనుమానాలు

**గుడిసెలకు కిరాయి ఎవరు వసూలు చేస్తున్నారు..?**

**వివాదాస్పద స్థలంలో కరెంట్, నీళ్ల సౌకర్యం ఎలా వచ్చింది ?**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి)**

ఆదర్శ నగర్ ప్రాంతంలో పూరి గుడిసెలు దగ్ధమైన విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయని ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి , పూరి గుడిసెల నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడి గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం ఆదర్శ్ నగర్ లో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పూరి గుడిసెల ప్రాంతాన్ని బిజెపి శ్రేణులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పూరి గుడిసెలు ఉన్న ప్రాంతం భూ వివాదం లో ఉందని అలాంటప్పుడు గుడిసెలకు కిరాయి ఎవరు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. అలాగే వివాదాస్పద స్థలానికి కరెంటు , నీళ్లు ఏ విధంగా సరఫరా అవుతున్నాయన్నారు. వీటికి అనుమతులు ఇచ్చారా..? లేక ఇల్లీగల్ గా వాడుతున్నారా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలన్నారు. వివాదాస్పద స్థలంలో నివసిస్తున్న నిరుపేదలు మేడారం జాతరకు వెళ్లిన సమయం చూసి భూ కబ్జాదారులు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఈ విషయంలో నిజాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం పోలీస్ యంత్రాంగం పై ఉందన్నారు. ఘటనపై వాస్తవాలను నిగ్గు తేల్చాలని, నిరుపేద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని బిజెపి జిల్లా పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, ఎర్రం మహేష్, కార్పొరేటర్లు కోలగని శ్రీనివాస్, దుర్శెట్టి అనూప్, పెద్దపల్లి జితేందర్, రాపర్తి ప్రసాద్, బండ రమణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, కటకం లోకేష్, అనిల్, ప్రసన్న , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## గణిత ఒలింపియాడ్‌లో సత్తాచాటిన పారమిత విద్యార్థులు

**కరీంనగర్ (జనంసాక్షి):** ఇటీవల శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రామానుజన్ గణిత ఒలింపియాడ్ లో స్థానిక పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ను కనబరిచి అవార్డులను కైవసం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా, రెండవ లెవల్ లో నిర్వహించిన ఒలింపియాడ్ లో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి మొదటి, రెండవ, నాల్గవ ర్యాంకులు, ఆరుగురు విద్యార్థులు జిలాస్థాయి ర్యాంకులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహతా తెలిపారు. ఫిబ్రవరి 19, 2024 వ తేదీన హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో అవార్డులు గెలుపొందిన విద్యార్థులలో చవట లక్ష్మీ హాసిని (10వ తరగతి) రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు, పబ్బతి విద్వాన్ (7వ తరగతి), రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు, చవట వెంకట మోక్షిత్ (8వ తరగతి) రాష్ట్రస్థాయిలో 4 వ ర్యాంకు సాధించగా ఆరుగురు విద్యార్థులు జె.శ్రేష్ఠ (6వ తరగతి) , జి.సంతోష్(7వ తరగతి), సి.హెచ్. శ్రీశాంత్ , కె.అగస్త్య(8 వ తరగతి) , యస్.రూప నిగమ(9వ తరగతి) . యం.సిరిశాంభవి (10వ తరగతి) విద్యార్థులు జిల్లాస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డులను గెలుపొందిన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ , గైడ్ టీచర్ పవన్ సింగతి, గణిత ఉపాధ్యాయులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళలకు చేయూత

**జిల్లా మహిళా సాధికారిక కో-ఆర్డినేటర్ దయా అరుణ**




**రామగుండం, ఫిబ్రవరి 20, (జనంసాక్షి) :** ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళలకు చేయూత లభిస్తుందని జిల్లా మహిళా సాధికారిక కో-ఆర్డినేటర్ దయా అరుణ తెలిపారు. మంగళవారం జిల్లా మహిళా సాధికారిక కో-ఆర్డినేటర్ దయా అరుణ రామగుండం లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వి.ఓ.ఏ. సమావేశంలో ఫైనాన్షియల్ లిట్రసి నిపుణులు ఎస్.సంధ్య తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.వో.ఎ లను ఉద్దేశించి జిల్లా మహిళా సాధికారిక కో-ఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ, మహిళలకు ఆర్థిక ద్రవ్యోల్బణంపై అవగాహన కల్పించడం జరుగుతుందని, ఆర్థికపరమైన అంశాలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల పైన అవగాహన కల్పిస్తూ, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే బాలికల చదువు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా సఖి సేవలు, అంగన్వాడి సేవలు, చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్స్ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ రవి, ఏపిఎం నవ్య,మహిళ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## మొన్న ఒక నోటీసు.. నిన్న మరొక నోటీసు..

# ఇదీ అధికారుల పనితీరు..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** వేములవాడ అర్బన్ మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ పై కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు ముగ్గురు ఈనెల 13 న అవిశ్వాస తీర్మానం పత్రాన్ని అధికారులకు అందజేశారు. మార్చి 5 న అవిశ్వాస తీర్మానం కొరకు కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని అర్బన్ మండలంలోని ఆరుగురు ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేశారు. కానీ అవిశ్వాసం పెట్టిన వైస్ ఎంపీపీకి అవిశ్వాస పత్రం లేఖను లేకుండా సోమవారము ఒక నోటీసు ఇవ్వగా, ఆయన దానిపై రాతపూర్వకంగా రాసి ఇవ్వగా,



19 న ఇచ్చిన నోటీసు..



20 న ఇచ్చిన నోటీసు

మంగళవారం అధికారులు మరో నోటీసు పంపారు. అవిశ్వాస తీర్మానానికి నోటీసులు అందజేసే అధికారులు పూర్తిస్థాయి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించకుండా వైస్ ఎంపీపీకి ఇవ్వడం చర్చనీయాంశం అయింది. ఆవిశ్వాస తీర్మానానికి 14 రోజుల కార్యాలయ పని దినాలలో ఇవ్వాల్సి ఉండగా మంగళవారము ఇవ్వడంతో ఆవిశ్వాస తీర్మానము ఉత్కంఠ భరితంగా మారనుంది. వైస్ ఎంపీపీ అవిశ్వాస తీర్మానంలో ఎవరు నెగ్గుతారో మార్చి 5 వరకు వేచి చూడాల్సిందే మరి..

## రాజ్యసభకు సోనియా, నడ్డా ఎన్నిక

అత్యంత సంపన్నుడు. వజ్రాల వ్యాపారి అయిన ధోలకియా తన ఆస్తి విలువ రూ.279 కోట్లుగా డిక్లేర్ చేశారు. జేపీ నడ్డా రూ.9.36 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారు. ఈ అభ్యర్థులు ఎవరిపైనా ఎఫ్ఐఆర్‌లు కానీ, క్రిమినల్ విచారణలకు కానీ లేవని అఫిడవిట్‌లో డిక్లేర్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు మంగళవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోనియా గాంధీతో పాటు భారతీయ జనతా పార్టీ నేతలు చున్నీలాల్ గారసియా, మదన్ రాథోడ్‌లు రాజస్థాన్ నుంచి ఎగువ సభకు ఎన్నికైనట్టు అసెంబ్లీ సెక్రటరీ మహావీర్ ప్రసాద్ శర్మ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. పోటీలో ఇతర అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో ఈ ముగ్గురు నేతలు పోటీలేకుండానే ఏకగ్రీవంగా పెద్దలసభకు ఎన్నికయ్యారు. షెడ్యూల్ ప్రకారం 56 రాజ్యసభ స్థానాలకు ఈనెల 27న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ విడుదలతో ప్రారంభమైంది. 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ ఓటింగ్ జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల్లో 50 మంది సభ్యుల పదవీకాలం ఏప్రిల్ 2న ముగియనుండగా, భారతీయ జనతా పార్టీ నుంచి నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా, కాంగ్రెస్ నుంచి ఒక అభ్యర్థి పోటీకి దిగారు. రాష్ట్రం నుంచి మొత్తం ఐదు రాజ్యసభ స్థానాలకు ఐదుగురే పోటీ చేయడంతో వీరంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మధ్యప్రదేశ్ విజేతల్లో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ (బీజేపీ), -మధ్యప్రదేశ్ బీజేపీ మహిళా విభాగం అధ్యక్షురాలు మాయా నరోలియా (బీజేపీ), వాల్మీకి థామ్ ఆశ్రమం అధిపతి ఉమేష్ నాథ్ మహరాజ్ (బీజేపీ), కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు బన్సీలాల్ గుర్జర్ (బీజేపీ), -మధ్యప్రదేశ్ కాంగ్రెస్ విభాగం కోశాధికారి అశోక్ సింగ్ (కాంగ్రెస్) ఉన్నారు.

## హామీలు అమలు చేయాల్సిందే..

నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తలను ఇబ్బంది పెట్టినా, కార్యకర్తల మీద అక్రమ కేసులు పెట్టినా ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. గంటలో షాద్‌నగర్‌లో ఉంటా అన్నారు. తన ఇల్లు కొంచెం ఇటుసైడే ఉంటదని, మిమ్మల్ని ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే మీ ఫోన్ కాల్ తో గంటసేపట్లో వచ్చేస్తానని భరోసా ఇచ్చారు. అక్రమ కేసులు పెట్టినా అధైర్యపడొద్దని.. కార్యకర్తల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. తెలంగాణ కోసం సిరిపురం యాదయ్య ప్రాణాలు త్యాగం చేసిన రోజు నేడు. నిప్పు అంటించుకొని అమరుడు అయ్యాడు. ఎంతో మంది ఉద్యమకారుల పోరాట ఫలితం నేటి తెలంగాణ రాష్ట్రం అన్నారు. ఈ సందర్భంగా అమరులు అందరికీ హరీష్ రావు జోహార్లు. చావు నోట్లో తల పెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించారు. కానీ రాష్ట్ర సాధనలో ఏ పాత్రలేని వ్యక్తి నేడు తెలంగాణ సీఎం అయ్యారంటూ రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అమరవీరులకు ఒక్క నాడు పువ్వు పెట్టని వ్యక్తి, ఒక్కనాడు జై తెలంగాణ అని వ్యక్తి సీఎం కావడం బాధాకరం అన్నారు. తెలంగాణ ఉద్యమంలో షాద్ నగర్ ఎంతో క్రియాశీలకంగా పాల్గొంది. బీఆర్ఎస్ పార్టీకి కూడా అండగా నిలిచిందన్నారు. కానీ మొన్న జరిగిన ఎన్నికల్లో 7 వేల ఓట్లతో ఓడిపోయాం, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు వారికి ఓటు వేశారని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

## 'ఇండియా' కూటమిలో సీట్లపంపకంపై త్వరలో క్లారిటీ

కాంగ్రెస్‌కు 17 సీట్లు ఆఫర్ చేస్తామని సమాజ్‌వాదీ పార్టీ చేసిన ప్రకటన పైనా ఆయన స్పందించారు. తమకు ఎక్కువ సీట్లు వస్తాయని భావిస్తున్నామని.. దేనికైనా పరిష్కారం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇదిలాఉండగా.. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల నేతల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని.. సోమవారం రాత్రి ఆఖరి రౌండ్ చర్చలు జరిగినట్లు సమాచారం. జనవరిలోనే 16 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించిన సమాజ్‌వాదీ పార్టీ నిన్న రాత్రి మరో 11 మందితో లోక్‌సభ అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే.

# బాధితులకు సత్వరమే న్యాయం జరగాలి

**విజిలెన్స్ అండ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి... హాజరైన సిపి అభిషేక్ మహంతి**



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో విజిలెన్స్ అండ్ ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. దీనికి పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తో పాటు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుల్లో పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని పేర్కొన్నారు. న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని తద్వారా నిందితులపై చర్యలు తీసుకొని బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. తప్పుడు కేసులను ప్రోత్సహించవద్దని ఒకటికి రెండుసార్లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నెలలో ఒక రోజు సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. కరీంనగర్ జిల్లాకు మంచి పేరు ఉందని ఈ పేరును ఇలాగే నిలబెట్టేందుకు అందరూ సహకరించాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి మాట్లాడుతూ... పోలీసు అధికారులు చట్ట ప్రకారం నడుచుకోవాలని, అట్రాసిటీ కేసులను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు విచారణ చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు అంశాలను కలెక్టర్, సిపి దృష్టికి తీసుకొచ్చారు. కేసులను త్వరగా దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని పరిహారం తొందరగా అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డిఓ కె.మహేశ్వర్, సోషల్ వెల్ఫేర్ డిడి నతానియల్, ఎస్సీ, ఎస్టీ, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆంజనేయులు, మేడి మహేష్ , రవి నాయక్ , నర్సింగ్ బాబు, కరీంనగర్ టౌన్ ఏసిపి నరేందర్, కరీంనగర్ రూరల్ ఏసిపి వెంకటరమణ, హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి, డిసిఆర్బి ఎస్ఐ నరేష్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సెంటర్ కొరకు మంథని జేఎన్టియు పరిశీలన

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

రామగిరి(జనంసాక్షి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రామగిరిలో ఉన్న జే.ఎన్.టి.యు ను ఎన్నికల కౌంటింగ్ కేంద్రం నిమిత్తం అదనపు కలెక్టర్ లు జే.అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి పరిశీలించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం మంథని జెఎన్టియూ ను కలెక్టర్ పరిశీలించి, మంథని జేఎన్టీయూలో అందుబాటులో ఉన్న గదులు, హాళ్ళ వివరాలను కలెక్టర్ ప్రిన్సిపాల్ ను అడిగి



తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ కేంద్రాలను మంథని జేఎన్టీయూలో ఏర్పాటు కోసం అవసరమైన మేర కౌంటింగ్ హాళ్ళు, స్ట్రాంగ్ రూమ్ ల ఏర్పాటుకు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా ఒక గది, కళాశాలలో అందుబాటులో ఉన్న గదుల వివరాలతో కూడిన నివేదికను ఎన్నికల సంఘం సీఈఓ కు నివేదిక సమర్పించడం జరుగుతుందని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, ఎన్నికల డి.టి. ప్రవీణ్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. 'కృష్ణవేణివికాస్'లో ఫ్లెడ్జింగ్ ఫీస్ట్

**గోదావరిఖని, ఫిబ్రవరి 20, (జనంసాక్షి) :** స్థానిక మార్కండేయ కాలనీలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్లో స్థానిక కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్లెడ్జింగ్ ఫీస్ట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి నాగండ్ల రవికుమార్ జూనియర్ కళాశాలను స్థాపించి రాష్ట్రస్థాయిలో 467/ 470 మార్కులు తీసుకురావడం గర్వంగా ఉందన్నారు. జేఈఈ,నీట్‌లలో మంచి ర్యాంకులను తీసుకురావడం పట్ల రమేశ్ హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రవికుమార్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అన్ని రంగాల్లో మంచి ప్రావీణ్యం సాధించాలని పేర్కొన్నారు. ముందుగా కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్ ఏసీపీ రమేష్‌ను పూలతో పాదాభివందనం చేశారు. స్టేట్ అండ్ కళాశాల టాపర్స్ తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యా ర్థిని, విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-3 సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇ.లక్ష్మీనారాయణ,గాంధీ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ కరస్పాండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్, డైరెక్టర్ జమున-రవికుమార్, ప్రిన్సిపల్ ఎం.వెంకన్న,అకాడమిక్ ప్రిన్సిపల్ ఎస్.తిరుపతిరెడ్డి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.





# జైస్వాల్ 'పుల్' షాట్?

## చిన్ననాటి కోచ్ ఆరిఫ్ హుస్సేన్ వ్యాఖ్య



ముంబై : టీమ్ ఇండియా యువ సంచలనం యశస్వి జైస్వాల్ అమ్ములపొదిలోని 'పుల్' షాట్‌కు ఓ ప్రత్యేకత ఉందని అతడి చిన్ననాటి కోచ్ ఆరిఫ్ హుస్సేన్ వ్యాఖ్యానించాడు. ఈ సందర్భంగా అతడికి సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. 'యశస్వి లో ఏదో ప్రత్యేకత ఉందని మేం బలంగా నమ్మేవాళ్లం. దీంతో అతడి ప్రతిభకు పదునుపెట్టాలని భావించి ముంబయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. అతడికి ప్రయాణ ఖర్చులు, శిక్షణను అందించాం. ఆ ఫలితాలు ఇప్పుడు మన కళ్ల ముందు కనిపిస్తున్నాయి. అతడు చురుకైన ఆటగాడని మొదట్లోనే గుర్తించాం. 2007-08లో నా అకాడమిలో చేర్చుకొన్నాను. ఏడాదిలోపే సీనియర్ జట్టులో స్థానం సాధించాడు. అక్కడ అన్ని అవకాశాలను అందించాం' అని వివరించాడు. యశస్విని తీర్చిదిద్దడంలో ముంబయి క్రికెట్ అసోసియేషన్ పాత్ర చాలా ఉందని ఆరిఫ్ వెల్లడించాడు. 'నేడు అతడు ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. దీనిని కొనసాగిస్తాడని ఆశిస్తున్నాను. మొదట్లో చాలా శ్రద్ధగా కృషి చేసి చాలా అంశాలు నేర్చుకొన్నాడు. నాయకత్వ లక్షణాలు చూపాడు. జైస్వాల్‌లో ఏదో ప్రత్యేకత ఉంది. ఎన్నడూ భయపడి వెనక్కి తగ్గలేదు. అతడికి 'పుల్' ఫ్యామిలీ షాట్ వంటిది. దీనికి కారణం అతని సోదరుడు తేజస్వి దీనిని అద్భుతంగా ఆడతాడు. ఈ యువ ఆటగాడు కూడా త్వరలోనే ఉన్నత శిఖరాలకు చేరుకొంటాడని ఆశిస్తున్నా' అని సగర్వంగా చెప్పాడు. యశస్వి టెస్ట్ కెరీర్‌ను ఘనంగా మొదలుపెట్టాడు. ఏడు మ్యాచ్‌ల్లో 861 పరుగులు సాధించాడు. వీటిల్లో రెండు ద్విశతకాలు, ఒక శతకం, రెండు అర్ధ శతకాలు ఉన్నాయి. ఇక ఇంగ్లాండ్‌పై స్వదేశంలో చెలరేగిపోయాడు. కేవలం ఆరు ఇన్నింగ్స్‌ల్లో 545 పరుగులు చేశాడు. రెండు డబుల్ సెంచరీలూ ఈ సిరీస్‌లో సాధించనవే. అంతేకాదు ఇటీవల 12 సిక్సర్ల సాయంతో చేసిన 214 పరుగులతో వసీం అక్రం రికార్డును సమం చేశాడు. జైస్వాల్‌ను పాక్ దిగ్గజ స్పిన్నర్ డానిష్ కనేరియా పొగడ్తలతో ముంచెత్తాడు. అతడు తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ 'గంగూలీ, సెహ్వాగ్ ప్రతిభను కలబోసినట్లు యశస్వి ఆటతీరు ఉంటుంది. వీరూ లెఫ్ట్‌హ్యాండ్ వెర్షన్‌ను చూసినట్లనిపిస్తుంది.

# జైస్వాల్ మీ నుంచి నేర్చుకున్నాడా..? : నాసిర్ హుస్సేన్




స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో టీమిండియా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ వరుసగా రెండు డబుల్ సెంచరీలు చేస్తే ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకున్న ఇంగ్లండ్ బ్యాటర్ బెన్ డకెట్‌కు ఆ జట్టు మాజీ సారథి నాసిర్ హుస్సేన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. జైస్వాల్ బజ్‌బాల్ నుంచి నేర్చుకోలేదని, అతడి పెంపకం నుంచే అది వచ్చిందని కొనియాడాడు. చిన్ననాటి నుంచి జైస్వాల్ పడ్డ కష్టం, అతడు ఎదుర్కొన్న సవాళ్లు..అతడిని ఈ స్థాయికి చేర్చాయని ప్రశంసలు కురిపించాడు. జైస్వాల్ బజ్‌బాల్ నుంచి నేర్చుకున్నదేమీ లేదని, కానీ ఇంగ్లండ్ ఆటగాళ్లు అతడి నుంచి నేర్చుకోవాలని హుస్సేన్ సూచించాడు.

రాజ్‌కోట్ టెస్టులో ఓడిన తర్వాత అయినా ఇంగ్లండ్ ఆటగాళ్లు తమలో తాము ఆత్మపరిశీలన చేసుకుంటే మంచిదని హుస్సేన్ హితవు పలికాడు. బయిట ఏం మాట్లాడినా డ్రెస్సింగ్ రూమ్స్‌కు వెళ్లిన తర్వాత తమ ఆటలో ఉన్న లోపాలను గుర్తించి వాటిని పునరావృతం చేయకుండా ఉంటే మంచిదని సూచించాడు. బజ్‌బాల్ ఆట ఆడుతున్నా ఈ ఆటతీరులో కూడా నేర్చుకోవాల్సిన విషయాలు బోలెడన్ని ఉన్నాయని హుస్సేన్ అన్నాడు. గతేడాది ఇంగ్లండ్.. స్వదేశంలో జరిగిన యాషెస్ సిరీస్‌లో కూడా ఇలాగే వెనుకబడి ఉన్నప్పుడు వాళ్ల స్ట్రాటజీని మార్చుకుని అద్భుతంగా పుంజుకుందని, ఇప్పుడు కూడా అలాగే చేయాలని హుస్సేన్ తెలిపాడు.

# ఆస్ట్రేలియా ఓపెన్ విన్నర్‌కు షాక్

## దుబాయ్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట



ఈ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన ఆస్ట్రేలియా ఓపెన్‌ను వరుసగా రెండోసారి గెలిచిన బెలారస్ బామ అరీనా సబలెంకకు దుబాయ్ ఛాంపియన్‌షిప్స్ తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. ఆస్ట్రేలియా ఓపెన్ నెగ్గాక మూడు వారాలకు మళ్లీ రాకెట్ పట్టిన రెండో సీడ్ సబలెంక.. తన పాత శత్రువు, క్రొయేషియాకు చెందిన 31వ ర్యాంకర్ డొనా వేకిక్ చేతిలో ఓటమిపాలైంది. దుబాయ్ వేదికగా జరుగుతున్న దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ - 2024లో భాగంగా మంగళవారం ముగిసిన మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంక.. 7-6 (5), 3-6, 0-6 తేడాతో వెకిక్ చేతిలో ఓటమిపాలైంది. సబలెంక కెరీర్ ఆరంభంలో ఆమె పదే పదే వేకిక్ చేతిలో పరాజయం పాలయ్యేది. నేటి మ్యాచ్‌తో కలిపి ఈ ఇద్దరూ 8 సార్లు తలపడితే అందులో వేకిక్ ఏకంగా ఆరుసార్లు గెలిచి ఆధిక్యంలో ఉంది. తొలి రౌండ్‌లో నెగ్గిన సబలెంక.. రెండో రౌండ్‌లో లయ తప్పింది. ఇక మూడో రౌండ్‌లో సంపూర్ణ ఆధిక్యం ప్రదర్శించిన వేకిక్.. ఆస్ట్రేలియా ఓపెన్ ఛాంప్‌ను తొలి రౌండ్‌లోనే ఇంటికి పంపించింది.

# బెన్‌స్టోక్స్ వస్తే బౌలింగ్ రాటుదేలుతుంది

## ఇంగ్లాండ్ కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్



**ముంబై,ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** టీమ్‌ఇండియాతో జరిగే చివరి రెండు టెస్టుల్లో బెన్ స్టోక్స్ బౌలింగ్ చేస్తే జట్టు మరింత బలంగా మారుతుందని ఇంగ్లాండ్ కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ అన్నాడు. కానీ సవాళ్లతో కూడిన ఉపఖండ పిచ్‌లపై అతడు బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడని అనుకోవడంలేదన్నాడు. గతేడాది స్టోక్స్ మోకాలికి శస్త్ర చికిత్స జరిగింది. దీని నుంచి పూర్తిగా కోలు కునేందుకు తాత్కాలికంగా బౌలింగ్‌కు విరామం ఇచ్చాడు. గత మూడు టెస్టుల్లో ఆ లోటు స్పష్టంగా కనిపించింది. రాంచిలో జరగనున్న నాలుగో టెస్టుకు ముందు పిచ్ పరిస్థితి అంచనా వేసిన తర్వాతే స్టోక్స్ బౌలింగ్ చేయడంపై, తుది జట్టు ఎంపికపై నిర్ణయానికి వస్తామని మెకల్లమ్ తెలిపాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌కు అందుబాటులో ఉంటే జట్టు మరింత బలంగా మారుతుంది. అతడు చాలా తెలివైనవాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయ గలిగే ఫిట్‌నెస్ ఉండి ఎక్కువ ఓవర్లు వేసేలా శరీరం సహకరిస్తేనే అతడు బౌలింగ్‌కు దిగుతాడు. రాంచీ పిచ్‌ను అంచనా వేసిన తర్వాత తుది జట్టు ఎంపిక ఉంటుంది. ఒలి రాబిన్‌సన్ , అట్కిన్‌సన్ లాంటి ఆటగాళ్లతో మాకు బౌలింగ్ ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. నాలుగో టెస్టుకు స్పిన్ పిచ్‌ను సిద్ధం చేస్తారని అనుకుంటున్నాను. ఇప్పుడున్న జట్టుతో సంతృప్తిగా ఉన్నాం. గత మూడు టెస్టుల్లో మా ఆటగాళ్లు మంచి ప్రదర్శనే చేశారు. చివరి రెండు టెస్టుల్లో తిరిగి పుంజు కుంటాం' అని అన్నాడు. మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ముందంజలో నిలిచింది. వరుస ఓటములతో వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకులో ఇంగ్లాండ్ ఎనమిదో స్థానానికి పడిపోయింది. స్వదేశంలోని లార్డ్స్ మైదానంలో వచ్చే ఏడాది జరగనున్న ఫైనల్‌ల్లో ఆడాలనుకుంటే ఆ జట్టు తిరిగి పుంజుకోవాల్సిందే.

# క్లాసికల్ చెస్‌లో కొత్త చరిత్ర

- పోలండ్ గ్రాండ్‌మాస్టర్‌కు చుక్కలు చూపిన 8 ఏండ్ల బుడ్డోడు..



భారత సంతతికి చెందిన 8 ఏండ్ల భారతీయ సంతతి బాలుడు.. పోలండ్ గ్రాండ్‌మాస్టర్, 37 ఏండ్ల జసెక్ స్టొపాకు చుక్కలు చూపించాడు. స్విట్జర్లాండ్ వేదికగా జరుగుతున్న బర్గ్‌డోర్ఫర్ స్టాడ్‌థాస్ ఓపెన్‌లో సింగపూర్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న భారత సంతతికి చెందిన అశ్వథ్ కౌశిక్.. తన కంటే వయసులో సుమారు ఐదు రెట్లు పెద్ద అయిన జసెక్‌ను మట్టికరిపించాడు. ప్రపంచ క్లాసిక్ చెస్ విభాగంలో ఇది ఒక రికార్డు. అశ్వత్ వయసు 8 ఏండ్ల ఆరు నెలల 11 రోజులు. గతంలో ఈ రికార్డు సెర్బియాకు చెందిన లియోనిడ్ ఇవానోవిక్ పేరిట ఉండేది. ఈ ఏడాది ఇదే నెల (ఫిబ్రవరి)లో 12వ తేదీన 8 ఏండ్ల 11 నెలల ఇవానోవిక్.. బల్గేరియాకు చెందిన 60 ఏండ్ల గ్రాండ్‌మాస్టర్ మిల్కో పొప్‌చెవ్‌ను బెల్గ్రేడ్ ఓపెన్‌లో ఓడించడమే ఇంతవరకు రికార్డు. తాజాగా అశ్వథ్.. ఈ రికార్డును అధిగమించి అత్యంత పిన్న వయసులో గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ప్రస్తుతం ఫిడే ర్యాంకింగ్స్‌లో 37,338వ ర్యాంకు కలిగిన అశ్వథ్.. భారత్ సంతతి బాలుడే. 2017లో అశ్వథ్ కుటుంబం సింగపూర్ వలసవెళ్లింది. జసెక్‌ను ఓడించిన తర్వాత సింగపూర్ చెస్ ఫెడరేషన్ సీఈవో, మాజీ గ్రాండ్‌మాస్టర్ కెవిన్ గో అశ్వథ్‌పై ప్రశంసలు కురిపించాడు. అతడి విజయం ఎంతో మంది చిన్నపిల్లలకు స్ఫూర్తినిస్తుందని అన్నాడు. అశ్వథ్ విజయంపై అతడి తండ్రి శ్రీరామ్ కౌశిక్ ట్విటర్ (ఎక్స్) వేదికగా స్పందిస్తూ.. తన జీవితంలో ఇది అత్యంత గర్వించదగ్గ క్షణాల్లో ఒకటని రాసుకొచ్చాడు.

# శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగా రికార్డు

## టీ20 క్రికెట్‌లో వంద వికెట్లు సాధించిన బ్యాటర్



**కొలంబో, ఫిబ్రవరి 20 :** శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగా టీ20 క్రికెట్‌లో రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 100 వికెట్లు తీసిన రెండో శ్రీలంక బౌలర్‌గా నిలిచాడు. అతనికంటే ముందు లసిత్ మలింగా 76 టీ20ల్లో ఈ ఫీట్ సాధించగా హసరంగా కేవలం 63 మ్యాచుల్లోనే 100 వికెట్లు సాధించాడు. దీంతో మలింగాను అధిగమించి వేగంగా 100 వికెట్లు తీసిన శ్రీలంక బౌలర్‌గా అవతరించాడు. అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భాగంగా ఫిబ్రవరి 19న జరిగిన రెండో టీ20లో రెండు వికెట్లు పడగొట్టిన హసరంగా మొత్తం 101 వికెట్లతో నిలిచాడు. అంతర్జాతీయ ఆటగాళ్లలో అఫ్గనిస్థాన్ బౌలర్ రషీద్‌ఖాన్ 53 మ్యాచుల్లోనే ఈ రికార్డు నెలకొల్పి ప్రస్తుతం వేగంగా 100 వికెట్లు తీసిన మొదటి బౌలర్‌గా కొనసాగు తుండగా హసరంగా రెండో స్థానంలో నిలిచాడు. ఇప్పటివరకు 11 మంది ఆటగాళ్లు టీ20ల్లో 100 వికెట్ల మైలురాయిని చేరుకున్నారు.

# నాలుగో టెస్ట్‌కు టీమిండియా సన్నద్ధం

**రాంచి,ఫిబ్రవరి 20:** ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టుకు భారత జట్టులో రెండు మార్పులు జరుగనున్నాయి. ఈనెల 23న రాంచిలో ప్రారంభమయ్యే మ్యాచ్‌లో ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశముంది. అయిదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో బుమ్రా అత్యధిక వికెట్ల (17)తో సత్తాచాటాడు. రెండో టెస్టులో ఒంటిచేత్తో జట్టుకు విజయాన్ని అందించాడు. గాయం కారణంగా రెండు, మూడు టెస్టులకు దూరమైన కేఎల్ రాహుల్ నాలుగో మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నాడు. 'భారత జట్టు మంగళవారం రాంచి బయల్దేరింది. బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశముంది. రాహుల్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తున్నాడు. రాంచి టెస్టుకు అతను అందుబాటులో ఉండొచ్చు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.


సినిమా

# పాత జ్ఞాపకాలు అమోఘం


## బికినీ ఫోటోలను విడుదల చేసిన ఇలియానా

గోవా బ్యూటీ ఇలియానాకు బీచ్ అన్నా, బాత్ టబ్ అన్నా ప్రాణం. కుదిరితే బీచ్ దగ్గర విహరిస్తుంటుంది. లేదా ఇంట్లో ఉన్న బాత్ టబ్‌నే బీచ్ గా భావిస్తూ నీటితో ఆడుతుంటుంది. కెరీర్ బిగినింగ్ నుంచి జీరో సైజ్ బాడీని మెయినటెన్ చేస్తున్న కథానాయిక ఈమె. గతేడాది ఆగస్ట్ ఒకటో తేదీని ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం అమ్మతనాన్ని ఆస్వాదిస్తోంది. తాజాగా ఇలియానా పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతోంది. ఆమె గర్భవతిగా ఉన్న సమయంలో బికినీ ధరించి బాత్రూమ్‌లో దిగిన ఫొటో ఒకటి ఇన్స్టాలో షేర్ చేసింది. ఈ మిర్రర్ సెల్ఫీ బ్లాక్ అండ్ వైట్‌లో ఉండటం విశేషం. బ్లాక్ బికినీలో ఓ చేత్తో తన బేబీ బంప్‌ను చూపిస్తూ సెల్ఫీ దిగింది. 'ఏడాది కిందట. నాలుగు నెలల ప్రెగ్నెంట్‌గా ఉన్న సమయంలో ఇలా' అనే క్యాప్షన్‌తో ఇలియానా ఈ ఫొటో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం తన పార్టనర్‌తో అమెరికాలో ఉన్న ఆమె గర్భవతిగా ఉన్నప్పటి ఫొటోలు చూసుకుంటూ ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటోంది. ఆమె ఈ మధ్య తన పార్ట్‌నర్ మైఖేల్ డోలాన్‌తో కలిసి వాలెంటైన్స్ డే సెలబ్రేట్ చేసుకుంది. ప్రస్తుతం ఇలియానా హిందీలో రెండు చిత్రాల్లో నటిస్తోంది.

# ఆకట్టుకుంటున్న ఆపరేషన్ వాలెంటైన్ ట్రైలర్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్ శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో మానుషి చిల్లర్ హీరోయిన్‌గా నటించింది. భారత వైమానిక దళ ధైర్య సాహసాలు, త్యాగాలను ఆవిష్కరిస్తూ యథార్థ సంఘటనల ఆధారం గా 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాన్ని తెరకెక్కించారు. మార్చి 1వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబో తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం ట్రైలన్‌ను విడుదల చేసింది తెలుగులో ఈ మూవీ ట్రైలర్‌ను టాలీవుడ్ పవర్ స్టార్ రామ్ చరణ్ విడుదల చేయగా.. హిందీలో సల్మాన్ ఖాన్ రిలీజ్ చేశారు. రామ్ చరణ్ ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేస్తూ తన తమ్ముడు వరుణ్ తేజ్‌పై ప్రశంసలు కురిపించారు. 'ఎప్పు డూ ప్రయోగాలు చేస్తూ గర్వించేలా చేస్తుంటావ్. ఈ సారి ఇండియా అంతా గర్వపడే సినిమా చేశావ్' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ ట్రైలర్‌లోని సీన్లు, విజువల్స్, యాక్షన్ సీన్స్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకోవాల్సిందే. ఎయిర్‌ఫోర్స్ అధికారిగా వరుణ్ తేజ్ చేసిన సాహసాలు ఈట్రైలర్‌లో కళ్లకు కట్టినట్లు చూపించారు. ముఖ్యంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ శిబిరంపై జరిగిన దాడిన, తర్వాత భారత వైమానిక సైన్యం తిరుగుబాటు వంటి సన్నివేశాలతో ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా ఉంది. ఈ చిత్రంలో వరుణ్ ఐఏఎఫ్ అధికారిగా నటిస్తుండగా, రాడార్ ఆఫీసర్‌గా మానుషి చిల్లర్ కనిపించనుంది. మంచినటిగా గుర్తింపు తెచ్చుకున్న రుహానీశర్మ కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్, రినైసన్స్ పతాకాలపై సందీప్ ముద్దా ఈ చిత్రాన్ని నిర్మించారు.



# నేడు గోవాలో నటి రకుల్ పెళ్లి

## హాజరు కానున్న పలువురు ప్రముఖులు

గత రెండేళ్లలో బాలీవుడ్‌లో ఎన్నో సెలబ్రిటీల పెళ్లిళ్లు జరిగాయి. ఇక ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ కూడా ఆ జాబితాలో చేరనుంది. హీరో, ప్రొడ్యూసర్ అయిన జాకీ భగ్నానీని రకుల్ ప్రేమించి పెళ్లి చేసుకో నుంది. ఫిబ్రవరి 21న గోవాలో రకుల్, జాకీ డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇక దానికోసం రెండు రోజుల ముందే అక్కడికి చేరుకున్నారు. రకుల్, జాకీ.. ఇద్దరికీ బాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉంది. అందుకే హిందీ సినీ పరిశ్రమలో వీరిద్దరికీ క్లోజ్ అయిన నటీనటులు ఈ వివాహానికి హాజరు కానున్నారు. అంతే కాకుండా ఒక సీనియర్ నటి ఈ పెళ్లిలో డ్యాన్స్ చేయడంతో పాటు తనకు కాబోయే భార్య రకుల్‌కు ఒక స్పెషల్ సర్‌ప్రైజ్‌ను కూడా ప్లాన్ చేశాడట జాకీ. రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ మూడేళ్ల క్రితం తమ ప్రేమ గురించి సోషల్ మీడియాలో ప్రకటించారు. అప్పటినుండి వీరి పెళ్లి ఎప్పుడా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తు న్నారు. చివరగా గోవాలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుంది అని రూమర్ మొదల య్యింది. అది రూమర్ కాదు.. నిజమే అని కన్ఫర్మ్ అయ్యింది. ఇక ఈ పెళ్లిలో తనకు కాబోయే భార్య రకుల్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్‌ను ప్లాన్ చేశాడట జాకీ భగ్నానీ. అక్కడ తన కోసం పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నాడని సమాచా రం. వారి లవ్ స్టోరీపై ఒక ప్రత్యేకంగా పాటను రాయించాడట జాకీ. మయూర్ పూరీ అనే రైటర్‌తో రకుల్, తన ప్రేమకథను 'బిన్ తేరే' అనే పాటను తయారు చేయించా డట. ఈ పాటపై పెళ్లిలో జాకీ స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఉంటుందని సమాచారం. బిన్ తేరే' పాటకు తనిష్క్ బాగ్చీ సంగీతాన్ని అందించగా.. జాహ్రా ఎస్ ఖాన్, రోమిల తో పాటు జాకీ స్వయంగా దీనిని పాడాడు.



# కొత్త పూజాను చూస్తారంటున్న హెగ్డే

గత ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన సల్మాన్ 'కిసీ కా భాయ్ కిసీకి జాన్' తర్వాత పూజా హెగ్డే సినిమా ఒక్కటి కూడా విడుదల కాలేదు. దాదాపు ఏడాది నుంచి తమ అభిమాన తార వెండితెరపై కనిపించకపోవడం పూజా అభిమానులను ఆవేదనకు గురి చేస్తున్న అంశం. అయితే.. ఈ బాధ ఈ ఏడాది అక్టోబర్ 11 వరకేనని, ఆరోజు షాహిద్‌కపూర్‌తో తాను నటిస్తున్న 'దేవ' విడుదల కానున్నదని, అందులో కొత్త పూజాని చూస్తారని మంగళూరు భామ పూజా హెగ్డే అంటున్నారు. తన కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను 'దేవ'లో చేస్తున్నట్టు పూజ చెప్పారు. ఓ హై ప్రొఫైల్ కేస్ ఇన్విస్టిగేషన్ నేపథ్యంలో ఈ సినిమా కథ నడుస్తుందని, కథనం షాక్‌కు గురిచేస్తుందని, తన పాత్ర తీరుతెన్నులు ఆడియన్స్‌ని షాక్‌కి లోనుచేస్తాయని పూజా తెలిపారు.



# డాన్ 3లో కియారా

రామ్ చరణ్ తో 'గేమ్ చెంజర్' సినిమా చేస్తున్న బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఇప్పుడు మరో పెద్ద ఛాన్స్ కొట్టేసింది. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ తీయబోయే 'డాన్ 3' సినిమాలో కియారా అద్వానీ చేస్తున్నట్టుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. ఇందులో రణవీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తుండగా, అతనికి జోడీగా కియారా అద్వానీ చేస్తున్నట్టుగా చిత్ర నిర్వాహకులు ప్రకటించారు. ఇది ఇంతకు ముందు తీసిన 'డాన్' సినిమాకి రెండో సీక్వెల్ గా రావటం విశేషం. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ సామాజిక మాధ్యమం ద్వారా ఈ విషయాన్ని చెపుతూ, మా డాన్ యూనివర్స్‌కి స్వాగతం అంటూ కియారా అద్వానీ కి చెప్పారు. కియారా మొదటిసారిగా రణవీర్‌సింగ్‌తో ఈ సినిమాలో నటిస్తున్నారు, ఇంతకు ముందు ఆమె రణవీర్ సింగ్ తో చెయ్యలేదు. ఇంతకు ముందు వచ్చిన రెండు సినిమాలలో షా రుఖ్ ఖాన్, ప్రియాంక చోప్రా నటించారు, ఇప్పుడు రణవీర్ సింగ్ ఈ మూడో సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు.ఇది ఒక యాక్షన్ సినిమాగా తెరకెక్కనుందని అంటున్నారు, ఇందులో కియారా అద్వానీ ఒక యాక్షన్ పాత్రలో కనిపించ నున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కియారా ఇంకో యాక్షన్ సినిమాలో కూడా నటిస్తున్నారు. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కలిపి నటిస్తున్న 'వార్ 2'లో కూడా కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. ఇంతవరకు యాక్షన్ పాత్రలు చెయ్యని కియారా ఇప్పుడు ఈ 'డాన్ 3', 'వార్ 2' లతో, యాక్షన్ జానర్‌లో కూడా తన ప్రతిభ చూపించుకోవడానికే అవకాశం దక్కింది. అలాగే తెలుగులో 'గేమ్ చెంజర్' లో రామ్ చరణ్ పక్కన నటిస్తోంది. దీనికి శంకర్ దర్శకుడు. ఈ సినిమా తెలుగుతో పాటు అన్ని భాషల్లో విడుదలవుతోంది.

# బాబు నెం1 బుల్ షిట్ గయ్

## 8న విడుదలకు సన్నాహాలు

బిగ్ బాస్ ఫేం, యంగ్ ట్యాలెంటెడ్ అర్జున్ కళ్యాణ్, కుషితకల్లపు హీరో హీరోయిన్స్‌గా లక్ష్మణ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బాబు నెం1 బుల్ షిట్ గయ్'. డీడీ క్రియేషన్స్ బ్యానర్ పై దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్ ను బేబీ చిత్ర నిర్మాత ఎస్. కె. ఎన్ , దర్శకుడు సాయిరాజేష్, నిర్మాత వివేక్ కూచిభోట్ల విడుదల చేశారు. సాయిరాజేష్ మాట్లాడుతూ 'ఈ సినిమా ట్రైలర్ అద్భుతంగా అనిపించింది. ఒకే ట్రైలర్ లో విభిన్న ఎమోషన్స్ ని చూపించడం బావుంది. సినిమాకి చాలా మంచి పాజిటివ్ బజ్ వుంది. అర్జున్ కళ్యాణ్ లో ఎప్పుడూ ఫైర్‌తో ఉంటాడు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరారు. హీరో అర్జున్ కళ్యాణ్ మాట్లాడుతూ : యూనిక్ కాన్సెప్ట్ తో థ్రిల్లర్, డ్రామాగా రూపొందిన చిత్రమిది. చాలా కష్టపడి మూడు భాషల్లో ఈ సినిమా చేశాం. ఈ ప్రాజెక్ట్ నెక్స్ లెవల్ కి తీసుకెళుతుందని నమ్ముతున్న. చాలా డిఫరెంట్ గా చేశాం. ప్రేక్షకుల తప్పకుండా ఆదరించాలి' అని అన్నారు. అర్జున్ కళ్యాణ్, కుషితకల్లపు చాలా హార్డ్ వర్క్ చేశారు. మంచి సినిమా అవుతుందని దర్శకుడు లక్ష్మణ వర్మ అన్నారు.



# జీపీలకు నిధుల కటకట

● ప్రత్యేకాధికారుల పాలనలో పర్యవేక్షణ కరువు




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : రాష్ట్రంలో జీపీలకు నిధుల కొరత ఏర్పడింది. గత నెల 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఆ వెంటనే ప్రభుత్వం ఎన్నికలకు నిర్వహించకుండా ప్రత్యేకాధికారునలు నియమించారు. ఒక్కో అధికారికి రెండుమూడు గ్రామాకు బాధ్యతలు అప్పగించడంతో పర్యవేక్షణ కరువవుతోంది. ప్రత్యేక అధికారులు తూతూ మంత్రంగా జిపి లను సందర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీలలో ఆర్థిక వనరులు లేకపోవడంతో గ్రామపంచాయతీ కార్యదర్శులు సతమతమవుతూ ఇబ్బందుల పాలవుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతి రాజ్ చట్టం 2018 గ్రామ పంచాయతీ పంచాయతీ కార్యదర్శిని బానిసకంటే హీనంగా మార్చివేసినది. యాభైకి పైగా విధులు చట్టంలో కార్యదర్శికి కేటాయించబడి వున్నాయి. యాభైకి పైగా పంచాయతీ రిజిస్టరుల నిర్వహణ బాధ్యతలు కూడ వారే నిర్వహించాలి. పంచాయతీ రాజ్ చట్టంలో గ్రామ కార్యదర్శికి కేటాయించిన విధులలో అత్యధిక శాతం విధులు ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్నాయి.

మండల పరిషత్ కార్యాలయ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీలో ప్రతి ఆర్థిక పరమైన పనుల నిర్వహణలో గ్రామ కార్యదర్శులపైన ఒత్తిడి చేస్తు వారు పనులు సకాలంలో చేయకపోతే సస్పెన్షన్, షోకాజ్ నోటీసులని బెదిరింపులకు గురిచేస్తూ పనులను చేపిస్తున్నారు. గ్రామ కార్యదర్శికి వచ్చే ప్రతి నెల జీతంలో కొంత వేతనాన్ని గ్రామ పంచాయతీ నిర్వహణలో ఖర్చులు చేస్తూ వున్నారు.గ్రామ పంచాయతీలలో సర్పంచుల పదవి ముగిసినప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ ఆర్థిక భారం మొత్తం వారి భుజస్కంధాలపై పడింది. గ్రామ పంచాయతీలో స్టేట్ ఫైనాన్స్ నిధులు 16 నెలలుగా రాకపోవడంతో కార్యదర్శులు అప్పులు చేస్తూ పంచాయతీల ఆర్థిక భారాన్ని మోస్తూ విధులు నిర్వహిస్తున్నారు.

సానిటేషన్ కోసం ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టర్లు కేటాయించగా, రాష్ట్రవ్యాప్తంగా 30 శాతం గ్రామ పంచాయతీలకు బ్యాంకు లోన్ల ద్వారా ట్రాక్టర్లను అంటగట్టారు. వాటికి నెలవారీగా బ్యాంకు కిస్తీలు చెల్లించడంలో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్లలో వాటికి డీజిల్ డబ్బులు, విద్యుత్ బల్బులు తాగునీటి నిర్వహణ ఖర్చులు కార్యదర్శులు భరిస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి మరింత దారుణం.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులలో తొంబై శాతంపైగా గ్రామ కార్యదర్శులు అప్పుల పాలవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్త పంచాయతీ రాజ్ చట్టం తెచ్చి పంచాయతీ కార్యదర్శులకు మోయలేని భారమైన విధులు కేటాయించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టంను సవరించి కార్యదర్శి పని భారం తగ్గించి, ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలి. గ్రామ పంచాయతీలకు ప్రతి నెల నిధులు విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# రాజ్యసభ సభ్యునిగా రవిచంద్ర ఎన్నిక



ఖమ్మం (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రం నుంచి ఎమ్మెల్యేల కోటాలో రాజ్యసభ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ నుంచి వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎంపీగా ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి ధృవీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

# ప్రాచీన వారసత్వ సంపదను భావి తరాలకు అందిద్దాం

● మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం, ఫిబ్రవరి20 (జనం సాక్షి) : మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో సుమారు 90 లక్షల రూపాయలతో చేపడుతున్న అతిపురాతనమైన మెట్లభావి (కోనేరు) పునరుద్ధరణ పనులను మాజీ మంత్రి వర్యులు,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళవారం నాడు పరిశీలించి పలు సూచనలు చేశారు.పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గములో పురాతన,ప్రాచీన కట్టడాలు కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

# సకల జనులంతా చల్లంగా ఉండాలి





● రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త-స్వప్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త-స్వప్న దంపతులు, వారి కుటుంబ సభ్యులు శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి, మైసమ్మ తల్లి, ఉప్పలమ్మ తల్లికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. హైదరాబాద్‌లోని గౌరెల్లి ,పెద్ద అంబర్‌పేటలోని గోదాంలలో (వారి వ్యాపార సముదాయంలో) ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి అమ్మవారికి, మైసమ్మ తల్లి, ఉప్పలమ్మ తల్లి అమ్మవారిని వారి కుటుంబ సమేతంగా దర్శించుకొని, మైసమ్మ ఎల్లమ్మ ఉప్పలమ్మకు బోనాలు సమర్పించారు. తదనంతరం ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు రైతులు అందరూ బాగుండాలని, సుఖసంతోషాలతో జీవించాలని రాష్ట్ర ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు రైతులు, అంతా పాడి పంటలతో విలసిల్లాలని అందరూ ఆనందంగా వుండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ పూజా కార్యక్రమంలో టూరిజం పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు, వారి కుమారులు ఉప్పల సాయికిరణ్, ఉప్పల సాయి తేజ గార్లు బంధుమిత్రులు బంధుమిత్రులు, మహిళా కార్మికులు,తదితరులు ఉన్నారు.

# ఐఈఆర్పీలను రెగ్యులరైజ్ చేయాలి

● ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించాలి

● కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఐఈఆర్పీలను రెగ్యులరైజ్ చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనంతో దుర్భర జీవితం గడుపుతున్నారని, ఐఈఆర్పీలుగా సేవలందిస్తున్న ఇన్క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్పీ) లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా రాష్ట్రంలోని మానసిక వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులకు విద్యను అందిస్తూ తమ సేవలను అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వీరిని రెగ్యులరైజ్ చేయడానికి ప్రయత్నాలు జరిగాయని, అందుకు అవసరమైన పోస్టులను రెగ్యులర్ డీఎస్సీలో పొందుపర్చకుండా ఇతర ప్రక్రియ ప్రారంభమైందని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిం దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ వేయాలని చూస్తున్న తరుణంలో వీరిని రెగ్యుల రైజ్ చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1523 పోస్టులను మానసిక వైకల్యం ఉన్న వారికి బోధించడానికి సేవలు అందిస్తున్నారని అన్నారు. గతంలో అతి తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉండే వారని ప్రస్తుతం వారి సంఖ్య 70వేలకు చేరింద న్నారు. వారందరికి 996 మంది ఐఈఆర్పీలు బోధిస్తున్నారని, వీరిని రెగ్యులరైజ్ చేసి మిగిలిన పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయాలని సూచిం చారు. కాంట్రాక్టు విధానంలో పనిచేసిన జూని యర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ లను రెగ్యులరైజ్ చేసినందున వీరిని కూడా రెగ్యులరైజ్ చేయడానికి ఎలాంటి అడ్డంకులు ఉండకపో వచ్చని ఆయన పేర్కొన్నారు. మానసిక వైకల్యం ఉన్న వారికి విద్యను బోధించడం సాధారణ విషయం కాదని, వారిని మానవీయ కోణంలో సైతం ప్రభుత్వం ఆలోచించి రెగ్యులరైజ్ చేయా లని విజ్ఞప్తి చేశారు. సాధారణ విద్యార్థులకు బోధించడం సహజమైన విషయమని, మానసిక వైకల్యంతో బాధ పడే బోధించడం అంతసులువైన పని కాదనే విష యాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఐఈఆర్పీలు తక్కువ వేతనంతో గత కొన్ని సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని, వారు రెగ్యులర్ వారితో డీఎస్సీలో పోటీ పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని, అనేక మంది వయస్సు పైబడి నందున వారిని ప్రత్యేక కేటగిరిగా పరిగణించి రెగ్యులరైజ్ చేయాలన్నారు. వీరి రెగ్యులరైజ్‌పై కాంగ్రెస్ పార్టీ కూడా హామీ ఇచ్చి ఉన్నందున ఆ హామీని నెరవేర్చాలని సూచిం చారు. ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఎంపికై, రోస్టర్ విధానం పాటించి ఐఈఆర్పీలను ఎంపిక చేసినందున రిజర్వేషన్లలో ఇతర ప్రభుత్వ ప్రక్రి యను ఫాలో అయి వీరి నియామకాలు జరిగాయన్నారు.

# జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్ రూ.7,937 కోట్లకు ఏకగ్రీవంగా ఆమోదం

● శానిటేషన్, అడ్వర్టైజ్మెంట్స్ పై హౌస్ కమిటీ ఏర్పాటు



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20(జనంసాక్షి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూపొందించిన అంచనా బడ్జెట్ రూ.7,937 కోట్లకు కౌన్సిల్ లో మంగళవారం ఆమోదించింది. సోమవారం వాయిదా పడ్డ హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ సాధారణ సమావేశం తిరిగి మంగళవారం ఉదయం మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో మొత్తం రూ.7,937 కోట్ల అంచనా బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. సమావేశంలో అందరూ బడ్జెట్ ను ఏకగ్రీవంగా ఆమోదించి నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రకటించారు.మొత్తం బడ్జెట్ రూ.7,937 కోట్లు కాగా అందులో రెవెన్యూ ఆదాయం రూ.5,938 కోట్లు, రెవెన్యూ వ్యయం 3458 కోట్లు,రెవెన్యూ మిగులు రూ.2840 కోట్లు, క్యాపిటల్ రిసిప్ట్ రూ.4479, కేపిటల్ వ్యయం రూ.4,479 కోట్లు, మొత్తం ఖర్చు రూ.7,937 కోట్లుగా పేర్కొన్నారు.

**కార్పొరేటర్ల ఫోనుకు అధికారులు స్పందించాలి**

ఉదయం సభ ప్రారంభంలో మిగిలిన శానిటేషన్, టౌన్ ప్లానింగ్, స్పోర్ట్స్, ప్రాపర్టీ టాక్స్ అంశాలపై ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ తమ డివిజన్ లలో క్రీడా ప్రాంగణాల నిర్వహణ సక్రమంగా లేదని, సత్వరం వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. సంబంధిత అధికారుల అలసత్వం పై పలువురు కార్పొరేటర్లు అసంతృప్తిని వ్యక్తం చేశారు. జోనల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు కార్పొరేటర్ల సమస్యల విషయమై ఫోన్ చేసినప్పుడు స్పందించాలని, ఇట్టి విషయమై సమీక్షించాలని మేయర్ కమిషనర్ కు సూచించారు.

**రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని కమర్షియల్ గా మార్చుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి**

జిహెచ్ఎంసికి మేజర్ ఆదాయ వనరు పన్ను వసూళ్లని, బల్దియాలో ఆస్తి పన్ను సక్రమంగా వసూలు చేయాలని, బకాయిలపై దృష్టి సారించాలని కార్పొరేటర్లు కోరారు. ఆన్లైన్ సెల్ఫ్ అసెస్మెంట్ ఆఫ్ ప్రాపర్టీ టాక్స్ విధానంపై వివరణ కోరగా సంబంధిత అధికారులు వివరించారు. ఆస్తిపన్ను చెల్లింపులకు వన్ టైం సెటిల్మెంట్ పథకం మళ్లీ అమలు చేయాలని, అందుకు కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కార్పొరేటర్లు మేయర్ ను కోరారు.రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని రాత్రికి రాత్రే కమర్షియల్ గా మారుస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఓయో హెూటల్స్, హాస్టల్,పార్కింగ్ సెల్లార్ ల పై విచారణ చేసి టాక్స్ పై చర్యలు తీసుకుంటాం : కమిషనర్ రోనాల్డ్ రోస్**

జిహెచ్ఎంసికి వచ్చే ఆదాయంలో పెద్ద మొత్తం ఆదాయ పన్ను వసూళ్ల ద్వారానే సమకూరుతుందని అన్నారు. రోజురోజుకు సిటీ పెరుగుతుందని, జిహెచ్ఎంసి రెవెన్యూ పెంచుకునేలా తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ కు ఏ విధంగా ట్యాక్స్ ఫిక్స్ చేయాలన్నది చట్టంలో ఉందన్నారు. నాన్ రెసిడెన్షియల్ చాలా కేటగిరీలున్నాయి. జి ఏ ఎస్ మ్యాపింగ్ ద్వారా డోర్ నెంబర్ రేషనలైజేషన్ చేయడం జరుగుతుంది. తద్వారా ఆదాయం పెంచడం కోసం కృషి చేస్తామన్నారు. టాక్స్ వసూళ్లలో కొన్ని సమస్యలున్నాయి. సమీక్షలో పరిష్కార మార్గాలను వెతుకుతున్నామన్నారు. రెసిడెంట్స్, నాన్ రెసిడెంట్ పై టాక్స్ వేర్వేరు రేట్లు ఉన్నాయి. రేట్ల మార్పు పై 2017, 2019 లో జిఓ లు విడుదలయ్యాయి. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన డిగ్నిటీ హౌసెస్ కు డోర్ నెంబర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో విరుద్ధంగా ఓయో హెూటల్స్ హాస్టల్ ల పై విచారణ చేసి టాక్స్ పై చర్యలు తీసుకుంటామన్నారు. టాక్స్ వసూళ్లలో చట్టప్రకారం వెళుతున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే పెనాల్టీ వేస్తామన్నారు. పార్కింగ్ కోసం ఉన్న సెల్లార్లలో ఇతర అవసరాల కోసం వాడితే కఠిన చర్యలు తీసుకుంటాం. సిటిలో సెల్లర్ లను పార్కింగ్ పై పోలీస్, జిహెచ్ఎంసి జాయింట్ సర్వే చేస్తామన్నారు. శానిటేషన్ కు సంబంధించి జిహెచ్ఎంసి లోని అన్ని డివిజన్లలో సమస్యలు ఉన్నాయని ఆయా కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. శానిటేషన్ విషయమై సంబంధిత అడిషనల్ కమిషనర్ సమాధానం ఇచ్చారు. స్వీపింగ్ మిషన్ ల నిర్వహణ వివరించారు.

# భారత్‌లో సింగరేణీయుల ప్రతిభ

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)





భారత దేశంలో లోని కార్మిక శాఖలోని ఈఎస్ఐసిలో రీజినల్ డైరెక్టర్ లుగా డిప్యూటేషన్ మీద ఉన్న ఇద్దరు అధికారులు పలు అవార్డు లను కార్మిక శాఖ నుంచి పొందారు. ఈఎస్ఐసి చెన్నై, (తమిళనాడు) ఫరిదాబాద్ (హర్యానా)లలో రీజినల్ డైరెక్టర్, కమిషనర్‌గా ఉన్న సింగరేణి డీజీఎం పర్సనల్ ఏజెఎం మురళీధర్‌రావ్, డిజిఎం, అడిషనల్ కమిషనర్, రిజినల్ డైరెక్టర్ జీవి. కిరణ్ కుమార్‌లు ఈఎస్ఐసి బిగ్ కేటగిరి ఇన్ మీడియం విన్నర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 24న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర కార్మిక, ఉపాధి, క్లైమేట్ చేంజ్ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ద్వారా వీరిద్దరూ అవార్డ్స్ పొందనున్నారు. సింగరేణియులైన ఈ ఇద్దరు అధికారులు, సంస్థ నుంచి డెప్యూటేషన్ మీద కూడా వెళ్లి ఘనత సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# త్వరలో 200 యూనిట్లు, రూ.500లకే గ్యాస్ పథకాల స్వీకారం

● ఏడు లక్షల కోట్ల అప్పలకు 20 వేల కోట్లు కట్టవలసిన పరిస్థితి

● తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబు



మొయినాబాద్, ఫిబ్రవరి 20, (జనంసాక్షి) : త్వరలో 200 యూనిట్లు, రూ.500లకే గ్యాస్ పథకాలు త్వరలో ప్రారంభిస్తామని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ అప్పుల పాలు చేసిపోయారని, ఏడు లక్షల కోట్ల అప్పులకు 20 వేల కోట్ల వడ్డీ కట్టవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ సమీపంలోని జేపీఎల్ కన్వెన్షన్‌లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ విస్తృతస్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు చెల్ల నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలోని చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, తాండూరు, పరిగి, వికారాబాద్, శేరిలింగంపల్లి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు పాల్గొని ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. ఏడు లక్షల కోట్ల అప్పులకు 20 వేల కోట్ల వడ్డీ కట్టే పరిస్థితి ఉందన్నారు. త్వరలో జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అర్హులైన వారందరికి చేరవేస్తామని మ్యానిఫెస్టోలో ఇచ్చిన పథకాల అమలు ఈ కమిటీల సమన్వాయంతో జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్కు లేదన్నారు. ఒకటి రెండు రోజుల్లో ఉచిత 200 యూనిట్ల విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ పథకాలకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్ఆర్ జీఎస్ నిధుల ద్వారా ప్రతి నియోజకవర్గానికి 20 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ను నిధుల ద్వారా ప్రతి నియోజకవర్గానికి 20 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెసేను ఓడించడంలో బీఆర్ఎస్ పార్టీకి చేతకాకనే బీజేపీ వాత్తుగా పలుకుతూ డ్రామాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ఐదు లక్షలను పది లక్షల వరకు పెంచామని తెలిపారు. గత పది సంవత్సరాలలో బీఆర్ఎస్ పార్టీ పేదలకు మూడు ఏకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, హామీలకి సరిపోయిందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఓర్వలేక ఆటో డ్రైవర్లతో సమ్మె చేయిస్తున్నారని దుయ్యబట్టారు. అటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని దీనిని మ్యానిఫెస్టోలో పెట్టి అసెంబ్లీలో తీర్మానానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కృషి వల్లనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, వచ్చిన రాష్ట్రాన్ని మేము తచ్చామని బీఆర్ఎస్, నాయకులు చెప్పుకోవడం వారికి తగదన్నారు. తెలంగాణ కోసం పోరాడిన నాయకులకు కృతజ్ఞతలు చెప్పాలని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాలను గెలిపించుకునేలా అందరం కష్టపడి కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. అది విధంగా చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని టికెట్ ఎవరికి వచ్చిన అందరు కష్టపడి పని చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎలా గెలిపించుకున్నామో అది విధంగా కష్టపడాలని అన్నారు. హామీలకి పరిమితమైన బీఆర్ఎస్హామీలకే పరిమితమైన బీఆర్ఎస్...

తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి అంతంతనే అని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతామహేందర్రెడ్డి అన్నారు. తండాలు, చిన్న గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గాలికి వదిలేశారని సూచించారు. కరెంటు తాగునీరు తండాలలో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేరుకే కొత్త గ్రామ పంచాయతీలు సర్పంచ్లుగా ఎన్నికైన వారు అభివృద్ధి కోసం అప్పులు చేసి అభివృద్ధి కోసం కృషి చేస్తే బిల్లులు రాక ఎంతో ఇబ్బందులు పడుతున్నారని సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గతంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పది సంవత్సరాలు పని చేశానని అప్పట్లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి అభివృద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు.

# 5000 రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ



హుజూర్‌నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : నియోజకవర్గ పరిధిలోని మేళ్లచెరువు మండల పంచాయతీరాజ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఏ.ఈ రంగరాజు 5000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టు పడడం జరిగిందని ఏసీబీ డీఎస్పీ ఎం.వి శ్రీనివాస్ తెలిపారు.వివరాల్లోకెళ్తే కప్పల కుంట తండా కు చెందిన దరావావత్ కృష్ణ అనే వ్యక్తి మండల పరిధిలోని గ్రామాల్లో పంచాయితీ రాజుకు సంబంధించిన ఎలక్ట్రికల్ పోల్స్ ఎల్ఈడి లైట్స్ పనులను కాంట్రాక్టు తీసుకొని చేయగా దానికి యం.బి రికార్డు చేసేందుకు ఏ.ఈ 5 వేలు లంచం అడుగగా బాధితుడు కృష్ణ సోమవారం సాయంత్రం లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రంగరాజు ను పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీబీ డిఎస్పి ఎం.వి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే 9154388918 టోల్ ఫ్రీ నెంబర్ 1064 ఈ నెంబర్లను సంప్రదించాలని, లంచాలు తీసుకునే వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2002/12105